అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సోమవారం 23-09-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 265 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



దిసనాయకె విజయం

తొలిసారి అధ్యక్ష పీఠంపై మార్క్సిస్టు నేత

నేడు ప్రమాణ స్వీకారం

శ్రీలంకలో ఎగిరిన ఎర్రజెండా

శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో మార్క్సిస్టు నేత అనుర కుమార దిసనాయకె చారిత్రాత్మక విజయం సాధించారు. శ్రీలంకలో ఆర్థిక వ్యవస్థ నిలువునా కుప్పకూలిన తర్వాత మొదటిసారి జరిగిన ఈ ఎన్నికల ఓట్ల లెక్కింపు రెండో రౌండ్ ప్రాధాన్యత సంతరించుకుంది. జనతా విముక్తి పెరమున (జేవీపీ) నేతృత్వంలోని నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పీపీ) కూటమి అభ్యర్థి దిసనాయకె అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. సోమవారం ఆయన శ్రీలంక తొమ్మిదో కార్యనిర్వాహక అధ్యక్షునిగా పదవీ స్వీకార ప్రమాణం చేయనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

కొలంబో: శ్రీలంకలో ఎర్రజెండా ఎగిరింది. అక్కడి ఎన్నికల సంఘం ప్రకటించిన వివరాల ప్రకారం మొత్తం పోలైన ఓట్లలో దిసనాయకెకు 42.31 శాతం ఓట్లు రాగా, ఆయన సమీప ప్రత్యర్థి, ప్రతిపక్ష సామగి జన సందానయ పార్టీ (ఎస్‌జేపీ) అభ్యర్థి సాజిత్ ప్రేమదాస 32.76 శాతం ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలోకి దిగిన ప్రస్తుత అధ్యక్షుడు రణిల్ విక్రమ సింఘెకు కేవలం 17.27 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో ఆయన మొదటి రౌండ్‌లోనే పోటీ నుంచి నిష్క్రమించారు. మొత్తం పోలైన ఓట్లలో విజయానికి అవసరమైన 50శాతానికి పైగా ఓట్లు ఎవరికీ రాకపోవడంతో 1981 ప్రెసిడెన్షియల్ ఎలక్షన్ యాక్టు ప్రకారం మొదటి రెండు స్థానాల్లో నిలిచిన అభ్యర్థులకు రెండవ ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపు ద్వారా లభించిన ఓట్లు కలిపారు. కీలకమైన ఈ రెండో రౌండ్ ఓట్ల ...5లో

మార్పు కోసం తీర్పు దిసనాయకె

ఇది మార్పు కోసం ఇచ్చిన తీర్పు అని అధ్యక్షునిగా ఎన్నికైన మార్క్సిస్టు నేత అనుర కుమార దిసనాయకె అభివర్ణించారు. దిసనాయకెపై శ్రీలంక ప్రజలు ముఖ్యంగా యువత చాలా ఆశలు పెట్టుకున్నారు. చెల్లింపుల సంక్షోభం, అధిక ధరలు, నిరుద్యోగం, ఉరితాళ్లలా పరిణమించిన ఐఎంఎఫ్ అప్పులు వంటి వాటి నుంచి శ్రీలంకను గట్టెక్కించడం ఆయన ముందున్న అతిపెద్ద సవాళ్లు. వీటిని ప్రజల తోడ్పాటుతో పరిష్కరించేందుకు కృషి చేస్తానని దిసనాయకె చెప్పారు. తాము అధికారంలోకి వస్తే శ్రీలంక ప్రజలకు పెనుభారంగా మారిన అదానీ ఎనర్జీ ప్రాజెక్టును రద్దు చేస్తానని, ఐఎంఎఫ్‌తో రణిల్ విక్రమ సింఘె ప్రభుత్వం కుదుర్చుకున్న 290 కోట్ల డాలర్ల బెయిలవుట్ అగ్రిమెంట్‌ను తిరగదోడతానని ఎన్నికల ప్రచార సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.



మొదటి అలైన్‌మెంట్ ప్రకారమే

ట్రిబుల్‌ఆర్ భూసేకరణ

పవర్‌లూమ్ కార్మికులను ఆదుకోవాలి

- జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు కేటాయించాలి : సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చౌటుప్పల్ ప్రాంతంలో ట్రిబుల్‌ఆర్ భూసేకరణలో భూమిని కోల్పోతున్నామంటూ పలువురు బాధితులు ఆందోళన చెందుతున్నారని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సీఎంకు తెలిపింది. మొదటి అలైన్‌మెంట్ ప్రకారమే ట్రిబుల్‌ఆర్ భూసేకరణ చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, చెరుపల్లి సీతారాములు, జూలకంటి రంగారెడ్డి కలిసి వినతిపత్రాలను సమర్పించారు. ఇందుకు సంబంధించి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముందుగా నిర్ణయించిన అలైన్‌మెంట్‌ను ప్రభుత్వం మార్చడం వల్ల మధ్యతరగతి ఉద్యోగులు, రైతులు, పేదలు నష్టపోతున్నారని తెలిపారు. ముందు నిర్ణయించిన అలైన్‌మెంట్ ప్రకారం భూసేకరణ చేపడితే ఎవరికీ అభ్యంతరం లేదనీ, నష్టం ఉండబోదనీ పేర్కొన్నారు. ఆ ప్రకారమే ప్రభుత్వం ముందుకు పోవాలని కోరారు. ఇప్పటికే ట్రిబుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్పుపై నిర్ణయం జరిగిపోయిందనీ, వెనక్కి వెళ్లడం కష్టమనీ, బాధితులకు నష్టపరిహారం పెంచే ప్రయత్నం చేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని వివరించారు. సిరిసిల్లలో ఆందోళనలో ఉన్న 30వేల మంది పవర్‌లూమ్ కార్మికుల గురించి ఆయనతో ...5లో

స్థానిక ఎన్నికలపై

దృష్టి సారించాలి

నాలుగోసారి గెలిచేందుకే మోడీ 'జమిలీ' వ్యూహం

బీజేపీ పట్ల అప్రమత్తంగా ఉండాలి : సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో కష్టపడినట్టే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బాగా కష్టపడి అత్యధికంగా గెలిపించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నదనీ, వాటిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలని సూచించారు. దేశంపై పట్టు సాధించేందుకు మోడీ ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. అందులో భాగంగానే ప్రధాని జమిలీ ఎన్నికలకు తెరలేపారని విమర్శించారు. జమిలీ ఎన్నికలపై పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. తొమ్మిది నెలల్లో ఒక్క రోజు కూడా తాను సెలవు తీసుకోలేదని చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న కొత్త కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా 27 రోజుల్లో రూ.18వేల కోట్ల రైతు రుణమాఫీ చేశామనీ, రైతు రుణ విముక్తి కావడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు తీసుకురాబోతున్నదని వెల్లడించారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ హెల్త్ ప్రొఫైల్ డిజిటల్ కార్డు ఇస్తామని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడున్నా రేషన్ తీసుకునే అవకాశం కల్పిస్తామన్నారు. అధికారం కోల్పోయిన అసహనంలో ప్రతిపక్షం ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. వారానికి రెండు సార్లు ఇన్‌చార్జి మంత్రులు జిల్లాల్లో పర్యటించాలని సూచించారు. కష్టపడి పనిచేసే వారికి పార్టీలో మంచి అవకాశాలొస్తాయన్నారు. ఆదివారం హైదరాబాద్, మాదాపూర్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో కాంగ్రెస్ శాసనసభాపక్షం (సీఎల్పీ) సమావేశం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు ఇటీవల పార్టీలో చేరిన అరికెపూడి గాంధీ, కడియం శ్రీహరి, దానం నాగేందర్, ప్రకాశ్‌గౌడ్ కూడా హాజరయ్యారు. సమావేశంలో తాజా రాజకీయ పరిణామాలు, స్థానిక సంస్థల ఎన్నికలు, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడ ...2లో



టీపీసీసీ చీఫ్ మహేశ్‌తో సీఎం రేవంత్ రెడ్డి

అధ్యక్ష పదవిని బాధ్యతగా భావిస్తా | టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

కాంగ్రెస్ అధ్యక్ష పదవిని ఒక బాధ్యతగా భావిస్తానని నూతన అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. పార్టీని ముందుకు నడపడంలో సమిష్టి బాధ్యత అవసరమనీ, కార్యకర్తలు, నాయకులకు నిత్యం అందుబాటులో ఉంటానని చెప్పారు. పార్టీకి, ప్రభుత్వానికి మధ్య సమన్వయకర్తగా వ్యవహరిస్తానన్నారు. కార్యకర్తలు కష్టపడి పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారనీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించుకోవాలని సూచించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రులపై ఎక్కువ బాధ్యత ఉందని చెప్పారు. స్థానిక సంస్థల్లో 90 శాతం స్థానాలను గెలవాలని కోరారు. కార్యకర్తలను సమాయత్తం చేసి ...2లో



మళ్లీ హైడ్రా పంజా

కూకట్‌పల్లి నల్లచెరువు శిఖంలో ఆక్రమణలు నేలమట్టం

16 వాణిజ్య షెడ్లు, ప్రహరీలు కూల్చివేత

27 ఎకరాల చెరువులో 7 ఎకరాల్లో అక్రమ నిర్మాణాలు అమీన్‌పూర్‌లో

23 ఇండ్లు నేలమట్టం

కిష్టారెడ్డిపేటలో మూడు భవనాలు, పటేల్‌గూడలో 30 ఇండ్లు కూల్చివేత

వివరాలు 2లో..



నేడు బ్లాక్ డే

పాల్గొననున్న ఆర్టీసీ కార్మిక సంఘాలు

కేంద్రం తెచ్చిన లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్

వివరాలు 3లో..

దేశంలో ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని కాపాడటంలో

ఏచూరి ఒక స్ఫూర్తి

సంతాప సభలో వక్తలు

- అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలోనూ కీలకపాత్ర



మాట్లాడుతున్న ఎంఏ బేబి

అమరావతి : దేశంలో ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని నిలబెట్టడంలోనూ, నేడు విజృంభిస్తున్న మతోన్మాదాన్ని అడ్డుకోవడంలోనూ సీతారాం ఏచూరి అలుపెరుగని పోరాటం చేశారని పలువురు వక్తలు పేర్కొన్నారు. సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాపసభ ఆదివారం ఉదయం విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. దీనికి తెలుగుదేశం, వైసీపీ, కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ, వీసీకేలతోపాటు అన్ని వామపక్ష పార్టీల నాయకులూ హాజరయ్యారు. తొలుత వక్తలను సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు వేదికపైకి ఆహ్వానించగా, సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సభాధ్యక్షత వహించారు. తొలుత పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబి, మంత్రి కొలుసు పార్థసారథి.. ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సంతాప సూచకంగా ఒక నిమిషం మౌనం పాటించారు. ప్రజాశక్తి ప్రచురించిన ప్రత్యేక సంచికను బి.వి.రాఘవులు ఆవిష్కరించారు. కొండూరు వీరయ్య రూపొందించిన సీతారాం ఏచూరి పుస్తకాన్ని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ ఆవిష్కరించారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి

సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.ఎ.బేబి ఏచూరి బహుముఖ ప్రజ్ఞాశాలి ...13లో

సేవ్ దామగుండం

చిప్కో తరహాలో ఉద్యమం

రాడార్ కేంద్రంతో మూసీ నది మనుగడకు ప్రమాదం

అభివృద్ధి పేరుతో విధ్వంసాన్ని ఒప్పుకోం

సహజసిద్ధ అడవులను నరకడం వల్లనే ప్రకృతి విలయాలు : నిరసన కార్యక్రమంలో వక్తలు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ నాగేశ్వర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గతంలో కేవలం 300 చెట్ల నరికివేతకు నిరసనగా సుందర్‌లాల్ బహుగుణ చిప్కో ఉద్యమాన్ని నిర్వహించి విజయం సాధించారనీ, దాని తరహాలో 'సేవ్ దామగుండం' ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. సహజసిద్ధంగా ఏర్పడిన అడవిలో 12 లక్షల చెట్లను నరికివేస్తే అక్కడ నేలలు పటుత్వం కోల్పోయి ప్రకృతి విపత్తులు తలెత్తి హైదరాబాద్ మహానగరానికి అపార నష్టం కలిగే ప్రమాదముందని హెచ్చరించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద సేవ్ దామగుండం పేరుతో జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ కె.నాగేశ్వర్ మాట్లాడుతూ... దామగుండం అటవీ ప్రాంతంలో రాడార్ కేంద్రం వల్ల జీవ వైవిధ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కేంద్రం తీసుకునే నిర్ణయాలను ప్రశ్నిస్తే రాజద్రోహులు, దైవ ద్రోహులు, అర్బన్ నక్సలైట్లు అనే ముద్ర వేయడం పరిపాటిగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఆందోళనలో ఇద్దరు స్వామీజీలు పాలుపంచుకుంటుండటం వల్ల తనను నిందించే వారికి అవకాశం లేకుండా పోయిందన్నారు. పశ్చిమ కనుమల్లో అభివృద్ధి పేరిట జరిగిన ప్రకృతి విధ్వంసం వల్లనే వాయనాడ్ విపత్తు ముంచుకొచ్చిందని చెప్పారు. నావీ వాళ్లు 12 లక్షల మొక్కలను నాటుతామని చెప్పడం కాదు.. ఇప్పుడున్న అడవిలా మరో అడవిని సృష్టించిన తర్వాత రాడార్ కేంద్రం పెట్టుకుంటే అభ్యంతరం లేదన్నారు. పాలకులు చెబుతున్నట్టు రాడార్ కేంద్రంతో ఎలాంటి నష్టం లేకపోతే ప్రజలకున్న అనుమానాలను ఎందుకు నివృత్తి చేయడం లేదు? పర్యావరణ నష్ట రిపోర్టును ఎందుకు బహిరంగపర్చట్లేదు? గండిపేట చెరువులోకి నీళ్లు ఎలా వస్తాయి? అంత పెద్ద స్థాయిలో కృత్రిమ అడవిని నిర్మించడం ఎలా సాధ్యం? అని ప్రశ్నల వర్షాన్ని కురిపించారు. మూసీ నదికి మూలమైన ...5లో

రాడార్ స్టేషన్ నిర్మాణంపై ప్రభుత్వం పునరాలోచించాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

వివరాలు 13లో..

పిడుగులుపడి ఇద్దరు మహిళలు మృతి

నాగర్‌కర్నూల్, సంగారెడ్డి జిల్లాల్లో ఘటనలు



వివరాలు 5లో..

బోనస్ కాదు... బోగస్

సింగరేణి కార్మికులకు కాంగ్రెస్ దగా

టెండర్ల అక్రమాలపై విచారణకు సిద్ధం : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



వివరాలు 13లో..

పదేండ్లయినా పెరగని పరిహారం

సుమారు 3,200 ఎకరాలు కోల్పోతున్న రైతులు

2014లో నిర్ణయించిన 400 కేవీ లైన్ నష్టపరిహారాన్నే 765 కేవీ లైన్‌కు చెల్లింపు

రైతుల అభిప్రాయాలను తీసుకోకుండా గుడ్డిగా అధికారుల నిర్ణయం

తీవ్రంగా నష్టపోతున్న రైతులు

తమ భూముల్లో టవర్ లైన్లు వేయనివ్వమంటూ తిరుగుబాటు

నిర్మాణ సంస్థలతో అధికారులు కుమ్మక్కు..? | పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎల్‌అండ్‌టీలకు భూ సేకరణ

ప్రజల పక్షాన నిలవాల్సిన ప్రభుత్వాలు, అధికారు లు వ్యాపార సంస్థలకు కొమ్ము కాస్తూ.. ప్రజల సొమ్మును కొల్ల గొడుతున్నారు. బడా వ్యాపారులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవ డంతో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎల్‌అండ్‌టీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఎలక్ట్రికల్ ట్రాన్స్‌మిషన్ లైన్ నిర్మాణంలో రైతులు పెద్ద ఎత్తున భూములు కోల్పోతున్నారు. అయితే రైతుల భూములకు చెల్లించాల్సిన నష్టపరిహారంపై గందరగోళం నెలకొంది. ప్రస్తుత ధర ప్రకారం కాకుండా పదేండ్ల కిందట (2014లో) నిర్ణయించిన ధరనే చెల్లిస్తున్నారు. దాంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అధికారుల ఆనాలోచిత నిర్ణయాన్ని ప్రభుత్వం పరిశీలించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

కర్నాటక రాష్ట్రం బీదర్‌లో ఏర్పాటు చేసిన భారీ సోలార్ పవర్ ప్లాంట్ నుంచి విద్యుత్‌ను కొనుగోలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు బీదర్ నుంచి మహేశ్వరం మండలం మీర్‌ఖాన్‌పేటలోని 765 కేవీ పవర్ గ్రిడ్ సబ్‌స్టేషన్ వరకు సుమారు 190 కిలోమీటర్ల మేర భారీ టవర్లు, లైన్లు వేసేందుకు శ్రీకారం చుట్టారు. సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లోని 20 మండలాలు, 315 గ్రామాల మీదుగా సుమారు 3,200 ఎకరాల్లో ఈ లైను ఏర్పాటు చేయాలని భావించింది. బీదర్ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ బహిరంగ ప్రకటన కూడా జారీ చేసింది. ఈ లైన్ల నిర్మాణ కాంట్రాక్టును ఎల్‌అండ్‌టీ సంస్థ దక్కించు కుంది. సాధారణంగా ఏదైనా ప్రాజెక్టుకు భూమిని సేకరించాలంటే ముందు రైతులను సమావేశపరిచి అభిప్రాయం తీసుకోవాలి. వారికి ...13లో



అధికారులది ఏకపక్ష నిర్ణయం

ప్రభుత్వ అధికారులు రైతుల పక్షపాతిగా వ్యవహరించాలి. వారికి అన్యాయం జరగకుండా చూడాలి. కానీ ప్రయివేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారు. పదేండ్ల కింద నిర్ణయించిన నష్టపరిహారానికి ఐదు నుంచి ఆరు రెట్లు అదనంగా నష్టపరిహారం పెంచాల్సి ఉంది. ప్రస్తుత ధర ప్రకారమే నష్టపరిహారం చెల్లించాలి.

- చింపుల సత్యనారాయణరెడ్డి, అధ్యక్షులు, తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్

నిర్మాణ సంస్థలకు ఒక న్యాయం.. రైతులకు ఒక న్యాయమా..?

విద్యుత్ టవర్ల నిర్మాణానికి అవసరమైన అల్యూమినియం, స్టీలు, సిమెంట్, కూలీల చెల్లింపులను ప్రస్తుత ధరలకు అనుగుణంగా నష్టపరిహారం నిర్ణయించారు. రైతులు సాగు చేసే భూములకు మాత్రం పదేండ్ల కింద నిర్ణయించిన పరిహారాన్ని చెల్లిస్తున్నారు. అంతేకాదు 400 కేవీ లైన్‌కు నిర్ణయం చేసిన నష్టపరిహారాన్నే 765 కేవీ లైన్‌కు చెల్లిస్తుండటంపై కూడా అనేక అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. రైతుల ఆమోదం లేకుండా వారి భూముల్లో టవర్లు నిర్మించడంతో పాటు పరిహారం కూడా చాలా తక్కువ చెల్లిస్తుండటంపై సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా నష్టపరిహారాన్ని చెల్లించకపోతే.. లైన్ల ఏర్పాటు ప్రక్రియను అడ్డుకోవడానికి కూడా వెనుకాడబోమని రైతులు హెచ్చరిస్తున్నారు. అంతేకాదు, కర్నూలు నుంచి వచ్చే లైనుకు జారీ చేసిన ఉత్తర్వులను బీదర్‌లైన్‌కు చూపించి ప్రయివేట్ భూముల్లో టవర్లు నిర్మించడం ఎంతవరకు సమంజసమా అని ప్రశ్నిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ప్రపంచ కమ్యూనిస్టు మేధావి సీతారాం ఏచూరి

- సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు
- మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయడమే నిజమైన నివాళి : ప్రజానాట్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జిల్లెల్ల చిన్నారెడ్డి
- జిల్లా కేంద్రంలో ఘనంగా సంస్మరణ సభ



నవతెలంగాణ- వనపర్తి

ప్రపంచ కమ్యూనిస్టు మేధావి సీతారాం ఏచూరి అని, ఆయన దేశానికి చేసిన సేవలతోనే ప్రపంచ గుర్తింపు లభించిందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. సీపీఐ(ఎం) వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ అధ్యక్షతన ఆదివారం సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభకు ఆయన హాజరై మాట్లాడారు. ఏచూరి బాల్యమంతా హైదరాబాద్‌లోనే గడిచిందన్నారు. ఎంఏను జేఎన్‌యూ నుంచి పూర్తి చేసిన ఆయన, అక్కడే.. పీహెచ్‌డీలో చేరినా.. ఎమర్జెన్సీ సమయంలో అరెస్టు కావడంతో దాన్ని కొనసాగించలేక పోయారని తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి నేతగా 1974లో సీతారాం రాజకీయ ప్రస్థానం మొదలైందన్నారు. 1975లో సీపీఐ(ఎం)లో చేరారని, జేఎన్‌యూ స్టూడెంట్స్ యూనియన్‌కు మూడుసార్లు అధ్యక్షునిగా ఎన్నికయ్యారని చెప్పారు. సీపీఐ(ఎం) మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరత్‌తో కలిసి జేఎన్‌యూను వామపక్ష కోటగా మార్చారన్నారు. 2015లో విశాఖపట్నంలో జరిగిన 21వ సీపీఐ(ఎం) మహాసభల్లో పార్టీ ఐదో ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయిన ఏచూరి.. మరణించేవరకూ ఆ పదవిలో కొనసాగారన్నారు. ప్రజాసమస్యలు, ఇతర అంశాలపై గళం విప్పుతూ.. రాజ్యసభలో గుర్తింపు పొందారన్నారు. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం కోసం 'కామన్ మినిమమ్ ప్రోగ్రామ్' ముసాయిదాను రూపొందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన ఆశయసాధన కోసం పార్టీలో ప్రతి కార్యకర్త ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రజానాట్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి మాట్లాడుతూ.. దేశంలో మతోన్మాదం పెరుగుతున్న తరుణంలో ఇలాంటి కమ్యూనిస్టు మేధావిని కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. ఉన్మాదంపై పోరాటం చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని తెలిపారు. సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు వినయ్ కుమార్ మాట్లాడుతూ.. లౌకికవాదాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడటం కోసం ఆయన స్ఫూర్తితో మనందరం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. సభకు ముందుగా చెరుపల్లి, వినయకుమార్, జిల్లెల చిన్నారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే తూడి మెగారెడ్డి తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకట్రాములు, సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, ప్రజా వైద్యశాల డాక్టర్ మురళీధర్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, టీజేఏసీ జిల్లా అధ్యక్షులు ఖాదర్పాషా, ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు ఆనంద్, కట్ట నర్సింహ, రాష్ట్ర నాయకులు కాకం ఆంజనేయులు, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బుట్ట ఆంజనేయులు, లక్ష్మి, బాల్‌రెడ్డి, మేకల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ హైడ్రా పంజా

నవతెలంగాణ- కూకట్ పల్లి, సిటీబ్యూరో/అమీన్‌పూర్

గ్రేటర్ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై హైడ్రా మరోసారి పంజా విసిరింది. ఆదివారం హెచ్‌ఎండీఏ పరిధిలోని మూడు ప్రాంతాల్లో కూల్చివేతలు చేపట్టింది. సుమారు 8 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. తీవ్ర భావోద్వేగాల మధ్య జరిగిన ఈ కూల్చివేతల్లో హైడ్రా వెనక్కి తగ్గకుండా బుల్డోజర్‌లతో తన పని పూర్తి చేసింది. బాధితులు.. అధికారులు, సిబ్బందిని ప్రాధేయపడుతూ కాళ్లమీద పడినా ఆ నిర్మాణాలను కూల్చివేసేదాక అక్కడి నుంచి కదల్లేదు. ఇదిలావుంటే కూకట్‌పల్లిలోని నల్లచెరువును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను నేలమట్టం చేయగా.. ఎకరంపైగా ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకుంది. అయితే ఈ కూల్చివేతల్లో ఆక్రమణదారులు బాగానే ఉన్నా.. వారి వద్ద నుంచి భూమిని లీజుకు తీసుకొని వ్యాపారం చేస్తున్న సామాన్యులు కోట్లలో నష్టపోయినట్టు తెలుస్తోంది. కూకట్‌పల్లిలో మొత్తం 27 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న నల్ల చెరువు, ప్రస్తుతం 20 ఎకరాలకు కుంచించుకుపోయి, 7 ఎకరాల చెరువు కబ్జాకు గురైందని హైడ్రా అధికారులు గుర్తించారు. దాంతో ఆదివారం తెల్లవారుజామునే బుల్డోజర్‌లతో వచ్చిన అధికారులు భారీబందోబస్తు నడుమ నల్ల చెరువు శిఖం భూమిలో 16 షెడ్లను పూర్తిగా నేలమట్టం చేశారు. ప్రభుత్వ స్థలాలు, చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నివాసం కోసం కాకుండా వ్యాపారం కోసం ఏర్పాటు చేసిన నిర్మాణాలను మాత్రమే కూల్చివేసినట్టు హైడ్రా స్పష్టం చేసింది. కూకట్‌పల్లి నల్ల చెరువు సర్వే నెంబర్ 66, 67, 68, 69లో 16 కమర్షియల్ షెడ్లు, ప్రహరీలను అక్రమంగా నిర్మించినట్టు గుర్తించామని, వాటిని కూల్చివేసి 4 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నట్టు హైడ్రా వెల్లడించింది. కాగా, హైడ్రా అధి కారులు నోటీసులు సైతం ఇవ్వకుండా, తమ సామగ్రి తీసుకునే వెసులుబాటు కల్పించకుండా కూల్చడంతో, 'వాటిని కూల్చడం కంటే తమ ప్రాణాలు తీసుకోండని' కన్నీళ్లు పెట్టుకున్నారు. అప్పులు తెచ్చి వ్యాపారాలు పెట్టుకున్నామని సూర్యాపేట జిల్లాకు చెందిన రవి అనే బాధితుడు కన్నీరు మున్నీరయ్యాడు. లీజ్‌కు తీసుకుని రూ. 18 లక్షలతో షెడ్ ఏర్పాటు చేసుకుని, కోటి రూపాయల వరకూ విలువ గల ఫ్లెక్సీ ప్రింటింగ్ ఏర్పాటు చేసుకున్నానని, తన మిషనరీ తీసుకోవడానికి ఒక్కరోజు కూడా అవకాశం ఇవ్వకుండా కూల్చేస్తున్నారని రోధించాడు. మరో కుటుంబం క్యాటరింగ్ వ్యాపారం చేయడానికి వడ్డీలకు తెచ్చుకుని మరీ ఖర్చు పెట్టామని.. అప్పులు ఎలా తీర్చాలంటూ కన్నీటి పర్యంతమవుతూ ప్రభుత్వానికి శాపనార్థాలు పెట్టారు.

అమీన్‌పూర్‌లో మరోసారి బుల్డోజర్లకు పని

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాల్టీలోని పటేల్‌గూడ గ్రామానికి చెందిన 12వ నెంబరు ప్రభుత్వ సర్వేలో ఉన్న అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు ఆదివారం కూల్చివేశారు. వీరికి మూడు రోజుల కిందట నోటీసులు జారీ చేశారు. 14 విల్లాలను తొలగించే కార్యక్రమం కొనసాగుతోంది. ఇప్పటికే ఇండ్లలో నివాసమున్న కుటుంబ సభ్యులను రెవెన్యూ, పురపాలక, పోలీసు శాఖల అధికారులు ఖాళీ చేయించారు. అనంతరం భవనాలు కూల్చివేశారు. ఇండ్లను ఖాళీ చేయించడంతో కొందరు స్థానికులు కన్నీరుమున్నీరయ్యారు. మరోవైపు కిష్టారెడ్డిపేట గ్రామ పరిధిలోని 164 సర్వే నంబర్‌లో 3 బహుళ అంతస్తుల భవనాలతో పాటు వాణిజ్యపరంగా వినియోగిస్తున్న ఐదంతస్తుల భవనాన్ని కూల్చేశారు. పటేల్‌గూడలో 30 అక్రమ నిర్మాణాల్లో సర్వేనంబర్ 12/2, 12/3లోని 25 నిర్మాణాలను కూల్చివేసినట్టు హైడ్రా అధికారులు వెల్లడించారు. ఈ కూల్చివేతల్లో కిష్టారెడ్డిపేటలో ఒక ఎకరా, పటేల్ గూడలో మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నామని అధికారులు తెలిపారు. కూల్చివేతల సమయంలో స్థానికులు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. దాంతో కూల్చివేతల ప్రదేశానికి 500 మీటర్ల దూరంలో పోలీసులు అందరినీ నిలిపివేశారు.

పెద్దలకు ఒకలా.. పేదలకు మరోలా

పేదల పట్ల హైడ్రా కర్కశంగా వ్యవహరిస్తోందంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పెద్దలకు నోటీసులు ఇచ్చి టైమ్ ఇస్తున్న అధికారులు.. పేదల పట్ల మాత్రం కనికరం లేకుండా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న తమకు కనీసం టైమ్ ఇవ్వకుండా ఆస్తితో పాటు అందులో ఉన్న వస్తువులను సైతం నాశనం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'మా నిర్మాణాలు కూల్చేముందు మమ్మల్ని చంపేయండి' అంటూ కొందరు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏచూరి సేవలకు ముగింపు లేదు

మాజీ ఎంపీ, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు పి.మధు

- ఆయన కమ్యూనిస్టుల ఉమ్మడి ఆస్తి : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని
- దేశం గొప్ప రత్నాన్ని కోల్పోయింది : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్
- కొత్తగూడెంలో సంస్మరణ సభ



నవతెలంగాణ-కొత్తగూడెం

భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమానికే కాక, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి సీతారాం ఏచూరి చేసిన సేవలకు ముగింపు లేదని మాజీ ఎంపీ, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు పి.మధు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలోని కమ్మ కళ్యాణ మండపంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అధ్యక్షతన సీతారాం ఏచూరి సంస్మరణ సభ ఆదివారం జరిగింది. ముందుగా ఏచూరి చిత్రపటానికి సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కాసాని ఐలయ్యతో పాటు మధు, కనకయ్య తదితరులు పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం మధు మాట్లాడుతూ.. ఫెడరలిజంపై దాడి జరుగుతున్న నేపథ్యంలో సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికే కాదు, దేశానికే తీవ్రమైన నష్టమన్నారు. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైన తర్వాత ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం వెనకపట్టు పట్టిన సందర్భంలో కాంగ్రెస్ సీతారాం ఏచూరి బెంగాల్ కేంద్రంగా అంతర్జాతీయ కమ్యూనిస్టు పార్టీల సదస్సు ఏర్పాటు చేసి కమ్యూనిజానికి మరణం లేదని చాటిచెప్పారు. దేశంలో కష్టజీవులు, కార్మికులు ఉన్నంత కాలం పెట్టుబడిదారీ వ్యవస్థ ఉన్నంత కాలం కమ్యూనిజానికి, సోషలిజానికి మరణం లేదని ఈ సదస్సు ద్వారా తెలియజేశారని గుర్తు చేశారు. పార్లమెంటులో అనేక రకాల సమస్యలపై ఇతర రాజకీయ పార్టీలు సైతం అంగీకరించే విధంగా కామ్రేడ్ ఏచూరి తన వాదనలను వినిపించేవారని అన్నారు. విద్యార్థి దశ నుండే కమ్యూనిస్టు రాజకీయాల్లోకి వచ్చిన ఏచూరి తాను నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకు పనిచేశారని, చివరకు తన దేహాన్ని సైతం వైద్య విద్యార్థుల పరిశోధన నిమిత్తం ఇవ్వడం కమ్యూనిస్టులకు ప్రజలపై ఉన్న అభిమానం, దేశం పట్ల బాధ్యత ఏంటో తెలియజేసిందని అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమం బలహీనపడుతున్న సందర్భంలో కామ్రేడ్ ఏచూరి వేగుచుక్కలా కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుకు నడిపించడంలో కృషి చేశారన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. సీతారాం ఏచూరి భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమానికి ఉమ్మడి ఆస్తి అని స్పష్టంచేశారు. ఏచూరి మరణం భారతదేశానికి, వామపక్ష రాజకీయాలకు తీరని లోటన్నారు. తన మేధస్సుతో కమ్యూనిస్టు ఉద్యమాన్ని సైద్ధాంతికంగా నిలబెట్టిన ధీరుడు సీతారాం ఏచూరి అని కొనియాడారు. బతికున్నంత కాలం కమ్యూనిస్టు ఉద్యమానికి గౌరవ ప్రతిష్టలు అందించడమే కాకుండా ఆయన మరణం తర్వాత కూడా కమ్యూనిస్టు ఉద్యమానికి విశేషమైన గౌరవాన్ని అందించి వెళ్లిన కామ్రేడ్ సీతారాం ఏచూరి అజరామరుడని తెలిపారు. సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ మాట్లాడుతూ.. కమ్యూనిస్టు ఉద్యమమే కాక, భారతదేశమే ఒక గొప్ప రత్నాన్ని కోల్పోయిందని తెలిపారు. భారత రాజ్యాంగ మూల స్తంభాలైన ప్రజాస్వామ్యం, లౌకిక తత్వం, ఫెడరలిజంపై దాడి జరుగుతున్న నేపథ్యంలో లౌకిక భావాలకు కట్టుబడి పనిచేసిన ఏచూరి.. లేకపోవడం దేశానికి తీరని లోటన్నారు. ఏచూరి స్ఫూర్తితో కమ్యూనిస్టు ఉద్యమం బలోపేతానికి అంకితం అవ్వాలని పిలుపునిచ్చారు. అనంతరం సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కాసాని అయిలయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.షాబీర్‌పాష, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అవునూరి మధు, సీపీఐ ఎంఎల్, న్యూడెమోక్రసీ మాస్‌లైన్ జిల్లా నాయకులు ముద్దా బిక్షం, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు బుగ్గవీటి సరళ, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, కోనేరు సత్యనారాయణ, టీజేఎంఎస్ నాయకులు మల్లెల రామనాథం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు, ఏజే.రమేష్, ఎం.జ్యోతి, ఎంబి.నర్సారెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య, కె.బ్రహ్మచారి, కారం పుల్లయ్య, లిక్కి బాలరాజు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు సంకుబాపన అనుదీప్, టీజేఎస్ జిల్లా నాయకులు మల్లెల రామనాథం, పట్టణ ప్రముఖులు తాళ్లూరి వెంకటేశ్వరరావు, ప్రముఖ కవి మండవ సుబ్బారావు, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు వీరభద్రం, వివేకవర్ధన విద్యా సంస్థల చైర్మెన్ ఎంవీ చౌదరి, డాక్టర్ వాసిరెడ్డి రమేష్ బాబు, డాక్టర్ రామ్మోహన్‌రావు, ఐలూ రాష్ట్ర నాయకులు జలసూత్రం శివరాం ప్రసాద్, రమేష్ కుమార్ మక్కడ్, కోనేరు (చిన్ని) సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందికి అండగా 'నవతెలంగాణ'

వరద బారిన పడిన స్టాఫ్‌కు వితరణ

- ఆపత్కాలంలో చేయూత
- విపత్కర సమయంలో సిబ్బందికి భరోసా.. అభినందనీయం: సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి నున్నా, ప్రముఖ వైద్యులు సి.భారవి



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

సిబ్బందికి ఇబ్బంది వచ్చిన ప్రతి సందర్భంలోనూ 'నవతెలంగాణ' అండగా నిలబడటం అభినందనీయమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ప్రముఖ వైద్యులు చీకటి భారవి అన్నారు. కష్టాల్లో ఉన్న సిబ్బందికి మేమున్నామంటూ భరోసానిస్తున్న యాజమాన్యం, తోటి సిబ్బంది, విలేకరులు ఓ బంధుమిత్రుల్లా సహాయ సహకారాలు అందించుకోవడం ద్వారా సమిష్టి తత్వాన్ని చాటుతున్నారని అన్నారు. ఇటీవల ఖమ్మంలో వరదల బారినపడిన నవతెలంగాణ సిబ్బంది ఆరుగురికి.. ఆర్థిక సహాయంతో పాటు బియ్యం, నిత్యావసర సరుకులను స్థానిక కార్యాలయంలో ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా నవతెలంగాణ ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎస్‌డీ జావీద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో నాగేశ్వరరావు, భారవి మాట్లాడారు. ఆపత్కాలంలో అండగా ఉండటం కమ్యూనిస్టుల లక్షణమని అన్నారు. దాన్ని కొనసాగిస్తున్న నవతెలంగాణ సిబ్బందిని అభినందించారు. ఇటీవల వచ్చిన వరదలు ఖమ్మం జిల్లా ప్రజలకు తీరని నష్టం చేశాయని తెలిపారు. వేలాది ఇండ్లు ముంపునకు గురయ్యాయని అన్నారు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో సిబ్బందికి అండగా నిలబడటం గొప్ప విషయంగా చెప్పారు. వరద బాధితులకు ప్రభుత్వం ఇస్తున్న రూ.16,500 పరిహారాన్ని పెంచాలని కోరారు. కరోనా, వరదలు, ప్రమాదాల వంటివి చోటుచేసుకున్న సందర్భాల్లో నవతెలంగాణ తమ కుటుంబ సభ్యులకు అండగా నిలుస్తుండటం ఆనవాయితీగా వస్తోందని ఆ దినపత్రిక పూర్వ జనరల్ మేనేజర్ ఎం.సుబ్బారావు స్పష్టం చేశారు. కాగా, వరద బారిన పడిన నవతెలంగాణ ప్రాంతీయ ప్రతినిధి కె.శ్రీనివాసరెడ్డి, డెస్క్ ఇన్‌చార్జి వీరేష్, సిబ్బంది గుమ్మడి నరసయ్య, ఉపేందర్, విలేకరులు డి.వెంకటేశ్వర్లు, శ్రీధర్‌కు నగదుతో పాటు నిత్యావసర వస్తువులను అందజేశారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్, వై. విక్రమ్, దాతలు రాజేష్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, నవతెలంగాణ సమన్వయ కమిటీ సభ్యులు ఈ.వెంకటేశ్వర్లు, కోటి శివారెడ్డి, సిబ్బంది లింగా వీరారెడ్డి, నాగేశ్వరరావు, విలేకరులు మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు ఐసీఎస్ ఉగ్రవాది

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

పుణేలో విధ్వంసానికి పాల్పడి పెద్దఎత్తున మత విద్వేషాలను రగల్చటానికి ప్రయత్నించిన ఐసీఎస్ ఉగ్రవాది రిజ్వాన్ అబ్దుల్లాను ఎన్‌ఐఏ అధికారులు ఆదివారం హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. సైదాబాద్‌లోని గ్రీన్‌వ్యూ అపార్ట్‌మెంట్‌లో గతంలో ఉగ్రవాది బస చేసిన ఫ్లాట్‌లో రిజ్వాన్‌ను ఎన్‌ఐఏ అధికారులు విచారించారు. పుణేలో తాము పన్నిన విధ్వంస వ్యూహాన్ని అమలు చేయటానికి రిజ్వాన్ ఈ అపార్ట్‌మెంట్ నుంచే స్కెచ్ వేసినట్టు ఎన్‌ఐఏ అధికారులకు దర్యాప్తులో వెల్లడైంది. దాదాపు మూడు నెలల పాటు ఈ ఫ్లాట్‌లో ఉన్న రిజ్వాన్.. అక్కడ ఎవ్వరితోనూ ఎక్కువగా మాట్లాడేవాడు కాదనీ, ఎప్పుడూ తలుపులు మూసుకొని లోపల ఉండేవాడనీ, అవసరమైతే తప్ప వెలుపలికి వచ్చేవాడు కాదని ఇతర అపార్ట్‌మెంట్‌వాసుల నుంచి దర్యాప్తు అధికారులు సమాచారాన్ని సేకరించినట్టు తెలిసింది.

అయితే, రిజ్వాన్‌కు అక్కడ ఫ్లాట్‌ను ఎవరు ఇప్పించారు? ఆయన ఆపరేషన్‌కు అవసరమైన డబ్బులను ఎవరు సమకూర్చారు? ఇంకా ఎంత మందితో హైదరాబాద్‌లో రిజ్వాన్ నెట్‌వర్క్‌ను ఏర్పర్చుకున్నాడు? రిజ్వాన్‌తో సన్నిహితంగా మెలిగినవారెవరు? తదితర కోణాల నుంచి ఎన్‌ఐఏ అధికారులు క్షుణ్ణంగా దర్యాప్తు జరుపుతున్నారు. పుణేలో ఉగ్రకుట్రకు పాల్పడ్డ రిజ్వాన్‌ను ఇటీవలే ఢిల్లీలో ఎన్‌ఐఏ అధికారులు ఢిల్లీలో అరెస్ట్ చేసిన విషయం విదితమే. ఈ ఉగ్రవాది నుంచి ఆయుధాలు, పేలుడు పదార్థాలను కూడా ఆ సమయంలో స్వాధీనపర్చుకున్నారు.

మంత్రి పొన్నంకు అవగాహన లేదు

మాజీ మంత్రి హరీశ్‌రావు


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టుపై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అవగాహన లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం పొన్నం చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు తామే పూర్తి చేశావని గొప్పలు చెప్పకోవడం మానుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పాలనలో వివక్షకు గురైన ఎల్లంపల్లి ప్రాజెక్టును బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చిందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో బాగంగా ఎల్లంపల్లిని కీలకమైన బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మార్చిన తర్వాతే జలాశయం మీద ఆధారపడిన అన్ని ప్రాంతాలకు నీటిని అందించే పని ప్రారంభం అయ్యిందని పేర్కొన్నారు. ఇదంతా తెలంగాణ ఏర్పడ్డ తర్వాతనే జరిగిందని గుర్తు చేశారు. మేడిగడ్డలో మూడు పిల్లర్లు కుంగిపోతే కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం కుంగిపోయినట్టు, పెద్ద ఎత్తున ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు.

గత నాలుగేండ్లలో ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 20,33,572 ఎకరాలకు (కొత్త, స్థిరీకరణ) సాగునీరు అందిందని మంత్రి ఉత్తం అసెంబ్లీ వేదికగా ప్రకటించారని అన్నారు. ఇది అబద్ధమైతే, శాసన సభ్యులను తప్పుదోవ పట్టించినందుకు ఆయన మీద ప్రివిలేజ్ మోషన్ పెట్టవలసి వస్తుందని హెచ్చరించారు. కాళేశ్వరం ఉపయోగం ఏమిటో రైతాంగానికి, ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. తప్పుడు ప్రచారాలు మాని వాస్తవాలు ప్రజలకు చెప్పాలని సూచించారు.

4500 ఫోన్లు ట్యాపింగ్

ధ్వంసం చేసిన ప్రణీత్‌రావు.. దృష్టి సారించిన స్పెషల్ టీం



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో ఎస్‌ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు ధ్వంసం చేసిన ట్యాపింగ్ వివరాలపై పంజాగుట్ట స్పెషల్ టీం అధికారులు ప్రత్యేకంగా దృష్టిని సారించారు. ఈ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రతిపక్ష కీలక కాంగ్రెస్ నాయకుల ఫోన్లతో పాటు మరికొందరు ప్రముఖుల ఫోన్లను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎస్‌ఐబీ అధికారులు ట్యాపింగ్‌కు పాల్పడటం సంచలనం రేపిన విషయం విదితమే. ఈ నేరంపై కేసును సీరియస్ అయిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు కోసం స్పెషల్ టీంను ఏర్పాటు చేసి రంగంలోకి దించిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటి వరకు ఎస్‌ఐబీ డీఎస్పీ ప్రణీత్‌రావు, నగర టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు, అదనపు ఎస్పీలు బుజంగరావు, తిరుపతన్నలను స్పెషల్ టీం అధికారులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కాగా, వారి విచారణలో అప్పటి ఎస్‌ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు తాము ఫోన్ ట్యాపింగ్‌ను జరిపినట్టు అరెస్టయిన నిందిత అధికారులు వాంగ్మూలమిచ్చారు. అయితే, ఇందులో అదనపు ఎస్పీ బుజంగరావుకు మాత్రం మధ్యంతర బెయిల్ లభించగా, మిగతావారు జైలులోనే ఉన్నారు. కాగా, ఈ కేసు వెలుగు చూసే కొద్దిరోజుల ముందు ఐపీఎస్ అధికారి ప్రభాకర్‌రావుతో పాటు మరో నిందితుడైన ఐ న్యూస్ సీఈఓ శ్రవణ్ కుమార్‌లు దేశం విడిచి వెళ్లారు. తాను క్యాన్సర్ చికిత్స కోసం అమెరికాకు వెళ్లాననీ, చికిత్స ముగించుకొని వస్తానంటూ ప్రభాకర్‌రావు ఇక్కడి అధికారులకు సమాచారమందించారు. అయితే, ప్రభాకర్‌రావు, శ్రవణ్‌కుమార్‌ల కోసం కోర్టు అనుమతితో రెడ్‌కార్నర్ నోటీసును నగర పోలీసు కమిషనర్ తరఫున సీఐడీ అధికారులు జారీ చేశారు. ఆ ప్రక్రియ సీబీఐ ద్వారా ఇంటర్‌పోల్‌కు చేరి ప్రభాకర్‌రావు, శ్రవణ్‌కుమార్‌లను తీసుకొచ్చే ప్రక్రియ సాగుతున్నట్టు అధికార వర్గాలు చెప్తున్నాయి. ప్రణీత్‌రావు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 4500 ఫోన్లను రహస్యంగా ట్యాపింగ్ చేసినట్టు స్పెషల్ టీం అధికారుల దర్యాప్తులో వెల్లడైంది. అంతేగాక, ప్రధానంగా ప్రస్తుత తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబీకులతో పాటు పలువురు కాంగ్రెస్ కీలక నేతల ఫోన్లను ట్యాపింగ్ జరిపి, వారి కదలికలు, రాజకీయ ఎత్తుగడలను ఎప్పటికప్పుడు ఎస్‌ఐబీ చీఫ్‌కు సమాచారమందించినట్టు కూడా దర్యాప్తులో వెలుగు చూసింది. 198 మందికి పైగా కాంగ్రెస్ నాయకుల ఫోన్లను ట్యాపింగ్ చేశారనీ, ఆయన ట్యాపింగ్ చేసిన ఫోన్లన్నీ ఎయిర్టెల్ నెట్వర్క్‌కు చెందినవని స్పెషల్ టీం అధికారులు తెల్చారు. తాము జరిపిన ఫోన్ ట్యాపింగ్‌ల గుట్టు రట్టవటంతో ఎన్నికల ఫలితాలు వచ్చే ఒక రోజు ముందు ఎస్‌ఐబీ ఆఫీసులో తాము ట్యాపింగ్ కోసం ఏర్పాటు చేసుకున్న ప్రత్యేక గదిలోని సాంకేతిక పరికరాలు, హార్డ్ డిస్కులను ప్రణీత్‌రావు ధ్వంసం చేశాడని బయటపడింది. దాదాపు 328 జీ.బి మేర తాము సేకరించిన సమాచారాన్ని ధ్వంసం చేసినట్టు తేలింది. అయితే, ప్రస్తుత దర్యాప్తులో అత్యంత కీలకమైన ఆ సమాచారాన్ని తిరిగి సేకరించటానికి స్పెషల్ టీం అధికారులు ప్రత్యేకంగా దృష్టిని సారించినట్టు తెలిసింది. ఈ విషయమై కేసు దర్యాప్తును పర్యవేక్షిస్తున్న జూబ్లిహిల్స్ ఏసీపీ వెంకటగిరి తన సీనియర్ పోలీసు అధికారులతో చర్చించినట్టు సమాచారం. అలాగే, ఈ కేసులో ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తు అంశాలను నగర పోలీసు కమిషనర్ సి.వి ఆనంద్‌కు సైతం దర్యాప్తు అధికారులు విశదీకరించినట్టు తెలిసింది.

స్థానిక ఎన్నికలపై దృష్టి సారించాలి

(మొదటిపేజీ తరువాయి)

సహా పలు కీలక అంశాలపై చర్చించారు. అంతకు ముందు టీపీసీసీ నూతన అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడిగా తన ఆధ్వర్యంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చామనీ, లోక్‌సభ సీట్లు గెలిచామని తెలిపారు. మహేష్‌కుమార్ గౌడ్‌ను తెలంగాణ పీసీసీ అధ్యక్షులుగా నియమించినందుకు పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ధన్యవాదాలు తెలుపుతూ సీఎల్పీ ఏకగ్రీవ తీర్మానం చేసిందన్నారు. పార్టీ నాయకత్వం ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ, ప్రభుత్వం సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రజల్లో ఉన్న వారికే జిల్లా అధ్యక్ష పదవులు ఇవ్వాలని పీసీసీకి సూచిస్తున్నట్టు చెప్పారు. పార్టీ అనుబంధ విభాగాల్లో పని చేసిన 36 మందికి నామినేటెడ్ పోస్టులు ఇచ్చామనీ, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పని చేసినందుకే వారికి పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. నరేంద్ర మోడీని ఓడించడం చారిత్రాత్మక అవసరమని వెల్లడించారు. బీసీ కులగణన చేయాలన్నది రాహుల్ గాంధీ బలమైన ఆలోచన అని తెలిపారు.

రాహుల్ ఆలోచన మేరకు బీసీ కమిషన్ చైర్మెన్, సభ్యులను నియమించామన్నారు. వారికి రిజర్వేషన్లు ఇవ్వాలంటే కచ్చితంగా జనాభాను లెక్కించాల్సిందేనన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలుపై ఉత్తమ్ కుమార్ రెడ్డి నాయకత్వంలో మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. సుప్రీం కోర్టు తీర్పును పూర్తిగా అధ్యయనం చేసి ఈ కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇస్తుందని తెలిపారు.


అధ్యక్ష పదవిని బాధ్యతగా భావిస్తా

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే తమ లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తాను మమేకమై పని చేస్తానన్నారు. అధికారాన్ని కట్టబెట్టిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం ఆలోచనలను ప్రజాప్రతినిధులు జనంలోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ ఈ దేశానికి ఆశాకిరణమనీ, ఆయన్ను ప్రధాని చేయడమే ధ్యేయంగా అంతా పని చేయాలని సూచించారు.

ఘాటెక్కనున్న ఉల్లి

బంగారం కానున్న బంగాళదుంపలు | దిగుబడి పడిపోవడమే కారణం



ఆహార ద్రవ్యోల్బణంపై ప్రభావం

ప్రభుత్వ మూడో ముందస్తు అంచనాలు

న్యూఢిల్లీ : 2023-24లో మన దేశంలో ఉద్యాన పంటల ఉత్పత్తి తగ్గే అవకాశం ఉంది. ప్రభుత్వం శనివారం విడుదల చేసిన మూడవ ముందస్తు అంచనాల ప్రకారం ఉద్యాన పంటల ఉత్పత్తి 0.65 శాతం తగ్గి 353.19 మిలియన్ టన్నులకు చేరుతుంది. జూన్‌లో విడుదలైన రెండవ ముందస్తు అంచనాల ప్రకారం దేశంలో ఉద్యాన పంటల మొత్తం ఉత్పత్తి 352.23 మిలియన్ టన్నులు.

దిగుబడులు తగ్గడమే కారణం

దేశంలో ఉల్లిని అధికంగా పండించే ప్రాంతాలలో దిగుబడులు తగ్గడమే ఉత్పత్తి పడిపోవడానికి కారణంగా భావిస్తున్నారు. ఉల్లి ఉత్పత్తులు 19.76 శాతం తగ్గాయి. 24.24 మిలియన్ టన్నుల ఉల్లి మాత్రమే ఉత్పత్తి అయింది. వంగ, కంద, కాప్సికమ్ ఉత్పత్తి కూడా తక్కువగానే ఉంది. ఈ ఏడాది అధిక వర్షపాతం నమోదవుతుందని వాతావరణ విభాగం అంచనా వేయడంతో ఉల్లి ఉత్పత్తి తగ్గవచ్చునని భావిస్తున్నారు. బంగాళదుంపల ఉత్పత్తి కూడా 5.13 శాతం తగ్గవచ్చు. ఈ పంట ఉత్పత్తి 57.05 మిలియన్ టన్నులు ఉండవచ్చు. ఉల్లి, బంగాళదుంపల ఉత్పత్తి తగ్గితే వాటి ధరలను అదుపు చేయడం ప్రభుత్వానికి సవాలుగా మారు తుంది. ఆహార ద్రవ్యోల్బణంలో ఈ రెండు నిత్యావసర కూరగా యలు కీలక పాత్ర పోషిస్తాయి.

స్థిరంగా కూరగాయల ఉత్పత్తి

మన దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం ఆగస్టులో 3.65 శాతానికి పెరిగింది. జూలైలో ఇది 3.6 శాతంగా ఉంది. ద్రవ్యోల్బణం రిజర్వ్‌బ్యాంక్ నిర్దేశించిన మధ్యంతర లక్ష్యం 2-6 శాతం పరిమితిలోనే ఉండడం కొంత ఊరట కలిగించే విషయం. వివిధ పంటల దిగుబడిలో హెచ్చుతగ్గులు కన్పిస్తున్నప్పటికీ మొత్తంగా కూరగాయల ఉత్పత్తి 205.80 మిలియన్ టన్నుల వద్ద స్థిరంగా ఉంటుందని అంచనా. టమాటా, క్యాబేజీ, కాలీఫ్లవర్, కర్రపెండలం, సొర, గుమ్మడి, క్యారట్, దోస, కాకర, బెండ వంటి కూరగాయల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. టమాటాల ఉత్పత్తి 4.38 శాతం పెరిగి 21.32 మిలియన్ టన్నులకు చేరింది.

గత సంవత్సరం టమాటాల ధర బాగా పెర గడంతో రైతులు ఈసారి ఎక్కువగా ఈ పంట వేశారు. పోయిన సంవత్సరం కిలో టమాటాల ధర గరిష్టంగా రూ.250కి చేరిన విషయం తెలిసిందే. ఈసారి కూడా ధరలు బాగానే ఉంటాయన్న అంచనాతో పంట విస్తీర్ణం గణనీయంగా పెరిగింది.

పండ్ల దిగుబడి పెరగవచ్చు



టమాటాల ఉత్పత్తి పెరగడంతో భోజనం ఖర్చు కొంతమేర తగ్గింది. శాఖాహార థాలీ ధర 8 శాతం, మాంసాహార భోజనం ధర 12 శాతం మేర తగ్గింది. కూరగాయలతో పాటు పండ్ల ఉత్పత్తి కూడా 2.29 శాతం పెరిగే అవకాశం ఉంది. మొత్తంగా 112.73 మిలియన్ టన్నుల పండ్ల ఉత్పత్తి జరగవచ్చునని అంచనా. ముఖ్యంగా మామిడి, అరటి, ఇతర పండ్ల దిగుబడి పెరగవచ్చు. యాపిల్, నారింజ, జామ, దానిమ్మ పండ్ల ఉత్పత్తి తగ్గే సూచనలు ఉన్నప్పటికీ మొత్తంగా పండ్ల ఎగుమతులపై దాని ప్రభావం పడకపోవచ్చు. బియ్యం, గోధుమలు వంటి ఆహారధాన్యాల ఎగుమతులపై దీర్ఘకాలంగా కొనసాగుతున్న నిషేధం కారణంగా ఎగుమతుల పరిమాణంలో తలెత్తిన వ్యత్యాసాన్ని పండ్ల ఎగుమతుల ద్వారా పూరించే అవకాశం ఉంది. తేనె, పూలు, ప్లాంటేషన్ పంటలు, సుగంధ ద్రవ్యాలు, ఔషధ మొక్కల ఉత్పత్తి కూడా గత సంవత్సరపు తుది అంచనాలతో పోలిస్తే పెరగవచ్చునని ప్రభుత్వం భావిస్తోంది. 2023-24లో మన దేశం నుండి తాజా కూరగాయలు, పండ్ల ఎగుమతులు 14 శాతం పెరిగి వాటి విలువ 3.65 బిలియన్ డాలర్లకు చేరింది.

ఇండియా-ఇజ్రాయిల్ బిజినెస్ సమ్మిట్‌ను రద్దు చేయండి

ఉన్నత విద్యా సంస్థకు 1300 మందికి పైగా లేఖ

పాలస్తీనా, పొరుగు దేశాలలో ఇజ్రాయిల్ దుశ్చర్యలపై తీవ్ర ఆందోళన

ఐఐఎస్సీని కోరిన దేశ, విదేశాల్లోని పలు యూనివర్సిటీల ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు





బెంగళూరు : బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ)లో నిర్వహించతలపెట్టిన 'ఇండియా-ఇజ్రాయిల్ బిజినెస్ సమ్మిట్'పై దేశ, విదేశాల్లోని పలు యూనివర్సిటీల అధ్యాపకులు, విద్యార్థుల నుంచి వ్యతిరేకత వస్తున్నది. ఈ సమ్మిట్‌ను రద్దు చేయాలంటూ భారత్, విదేశాలలో పలు యూనివర్సిటీల నుంచి 1300 మందికి పైగా ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ఐఐఎస్సీకి వారు లేఖ రాశారు. అందులో వారు తమ ఆందోళనలను వెలిబుచ్చారు. 'ఇండియా-ఇజ్రాయెల్ బిజినెస్ సమ్మిట్' సోమవారం ఐఐఎస్సీల జరగాల్సి ఉన్నది. ఈ సమ్మిట్‌ను థింక్ ఇండియా సంస్థ, ది ఇండియన్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్, ది మైసూర్ లాన్సెర్స్ హెరిటేజ్ ఫౌండేషన్ లు నిర్వహించతలపెట్టాయి.

ఈ కార్యక్రమాన్ని అనుమతించటం ద్వారా పాలస్తీనాలో ఇజ్రాయిల్ మారణ హోమాన్ని, పొరుగుదేశాలపై ఆ దేశ దూకుడు చర్యలకు నేరుగా మద్దతుచ్చినట్టవుతుందని విద్యార్థులు, అధ్యాపకులు తమ లేఖలో పేర్కొన్నారు. గాజాలో ఇజ్రాయిల్ యుద్ధంలో విధ్వంసాన్ని వారు ఐఐఎస్సీ డైరెక్టర్ గోవిందన్ రంగరాజన్‌కు రాసిన లేఖలో ఎత్తి చూపారు. ఇన్‌స్టిట్యూట్ ఈ కార్యక్రమాన్ని స్పాన్సర్ చేస్తూ నిర్వహించటంపై వారు తీవ్ర ఆందోళనను వెలిబుచ్చారు. గాజాలోని ప్రతి యూనివర్సిటీనీ ఇజ్రాయిల్ ధ్వంసం చేసిందని పేర్కొన్నారు. అలాగే, ఆరోగ్య సౌకర్యాలను కూడా విధ్వంసం చేసిందని వివరించారు. గాజాలో 96 శాతం మంది ఆహార అభద్రతలో ఉన్నట్టు ప్రపంచ ఆహార సంస్థ అంచనా వేసిందని పేర్కొన్నారు. లెబనాన్‌లోనూ ఇజ్రాయిల్ ఉగ్రదాడులను చేసిందని ప్రస్తావించారు.

పాలస్తీనా ప్రాంతాలలో ఇజ్రాయిల్ ఉండటమనేది అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించటమేననీ, దానికి తప్పక ముగింపు పలకాలన్న అంతర్జాతీయ న్యాయస్థానం ఆదేశాలను లేఖలో వారు ఉటంకించారు. 12 నెలల్లో ఆక్రమిత పాలస్తీనా ప్రాంతంలో ఇజ్రాయిల్ చట్టవ్యతిరేక ఉనికికి ముగింపు పలకాలంటూ ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ తీసుకొచ్చిన తీర్మానాన్ని విద్యార్థులు, ఫ్యాకల్టీ సభ్యులు గుర్తు చేశారు. ఇలాంటి తరుణంలో భారత్, ఇజ్రాయిల్‌ల మధ్య సహకారాన్ని ప్రోత్సహించటం అనాలోచితమని వివరించారు. కాబట్టి, ఈ కార్యక్రమాన్ని రద్దు చేయాలనీ, మారణహోమం, వలసవాదాన్ని చేయటానికి ఐఐఎస్సీని వేదికగా ఉపయోగించటానికి అనుమతించొద్దని రంగరాజన్‌ను వారు కోరారు.

ఇండో-పసిఫిక్ ప్రాంతానికి నాలుగు కోట్ల వ్యాక్సిన్లు

ఇవి కోట్లాది మంది ప్రజల జీవితాల్లో ఆశాకిరణం



యూఎస్‌లో క్యాన్సర్ మూన్‌షాట్ కార్యక్రమంలో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : క్వాడ్ సమ్మిట్‌లో పాల్గొనటం కోసం అమెరికాలో మూడు రోజుల అధికారిక పర్యటన చేస్తున్న ప్రధాని మోడీ క్యాన్సర్‌పై పోరాటంలో భాగంగా ఇండో-పసిఫిక్ ప్రాంతానికి నాలుగు కోట్ల (40 మిలియన్లు) వ్యాక్సిన్ డోసులను అందించటానికి హామీ ఇచ్చారు. డెలావేర్‌లోని విల్మింగ్టన్‌లో ఏర్పాటు చేసిన క్యాన్సర్ మూన్‌షాట్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోడీ ఈ హామీనిచ్చారు. అలాగే, క్యాన్సర్‌తో పోరాటంలో భాగంగా రేడియో థెరపీ చికిత్స, కెపాసిటీ బిల్డింగ్ వంటి సాయానికి మోడీ కట్టుబడ్డారు. ఈ 40 మిలియన్ల వ్యాక్సిన్ డోస్‌లు కోట్లాది మంది ప్రజల జీవితాల్లో ఒక ఆశాకిరణంగా మారుతుందని సమావేశంలో ప్రధాని అన్నారు. ఈ వ్యాధిపై పోరాడటానికి భారత్‌లో అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఇందులో ప్రతి ఒక్కరికీ మందులు తక్కువ ధరలో అందేలా చేసే ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య బీమా పథకం ఉన్నదని చెప్పారు. "క్యాన్సర్ కేర్‌లో పని చేసే నిపుణులు భారత్ నుంచి ఈ సమావేశంలో పాల్గొన్నారు. వన్ ఎర్త్-వన్ హెల్త్ అనేది భారత విజన్. కాబట్టి, మూన్‌షాట్ చొరవ కింద నేను 7.5 మిలియన్ డాలర్ల విలువ (రూ.62.61 కోట్లకు పైగా) చేసే నమూనా కిట్స్, డిటెక్షన్ కిట్స్, వ్యాక్సిన్లకు నేను మద్దతు పలుకుతున్నాను" అని మోడీ అన్నారు. వ్యాధితో పోరాడటం కోసం భారత్ తన స్వంత వ్యాక్సిన్‌ను వృద్ధి చేసినట్టు ప్రధాని తెలిపారు. అలాగే, క్యాన్సర్ చికిత్సలో కృత్రిమ మేథ(ఏఐ)ను ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు అమెరికా అధ్యక్షుడు బిడెన్‌కు మోడీ కృతజ్ఞతలు తెలిపారు. ఇది సరసమైన, అందుబాటులో ఉండే, నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను అందించాలనే మన భాగస్వామ్య లక్ష్యాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో ఇండో-పసిఫిక్‌కు మనం క్వాడ్ వ్యాక్సిన్‌ను తీసుకెళ్లామనీ, దానికి తాను సంతోషిస్తున్నట్టు మోడీ చెప్పారు. గర్భాశయ క్యాన్సర్(సర్వైకల్ క్యాన్సర్) వంటి సవాళ్లను సంయుక్తంగా ఎదుర్కోవటానికి క్వాడ్‌లో మేం నిర్ణయించామన్నారు.

క్యాన్సర్ కేర్ విషయంలో అన్ని దేశాల మద్దతు తప్పనిసరి అని ప్రధాని తెలిపారు. రోగులు, వైద్యులు, పరిశోధకులను ఏకం చేయటం ద్వారా క్యాన్సర్ పరిశోధనను వేగవంతం చేయటం కోసం మూన్‌షాట్ క్యాన్సర్ కార్యక్రమాన్ని తొలుత 2016లో నిర్వహించారు. ఆ తర్వాత 2022లో యూఎస్ అధ్యక్షుడు బిడెన్ ఈ ప్రయత్నాలను పునరుద్ధరించాడు. ఈ కార్యక్రమం ఇప్పటి వరకు ఐదు వేర్వేరు దేశాలకు 95 కార్యక్రమాలను, విధానాలను, వనరులను అందించింది. "ఇండో-పసిఫిక్‌లో సర్వైకల్ క్యాన్సర్ కారణంగా ప్రతి ఏడాదీ 1.50 లక్షల మంది మహిళలు చనిపోతున్నారు. మనం దానిని అలా జరగనివ్వద్దు. మనం నలుగురం (క్వాడ్ కూటమిలోని నాలుగు దేశాలు) గర్వించే ప్రజాస్వామ్య దేశాలం. మన ప్రజలకు మంచి, మరింత ఆశను అందించటం కోసం మనం కలిసి నడుస్తున్నాం. హెచ్‌పీవీ స్క్రీనింగ్, చికిత్సలకు 150 మిలియన్ డాలర్లకు పైగా (రూ.1253 కోట్లకు పైగా) ఖర్చు చేసేందుకు నాలుగుదేశాలు, ఈ కార్యక్రమానికి వచ్చిన నేతలు, అనేక సంస్థలు ముందుకు రావటం పట్ల నేను గర్వంగా భావిస్తున్నాను. వచ్చే ఏడాది నుంచి యూఎస్ నేవీ నుంచి వైద్యులు, నర్సులు ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ఉండే వారి సహచరులకు సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్, వ్యాక్సినేషన్ నిర్వహణలో శిక్షణనిస్తారు" అని బిడెన్ తెలిపారు. క్వాడ్ సమ్మిట్ తర్వాత జరిగిన ఈ కార్యక్రమానికి అందరు ప్రపంచనేతలు హాజరయ్యారు.



నాగర్‌కర్నూల్‌లో మాట్లాడుతున్న ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నర్సింహ



వీరతెలంగాణ నాటిక ప్రదర్శన



వనపర్తిలో మాట్లాడుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సాగర్

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రజానాట్యమండలి శౌర్యయాత్ర

బీజేపీలో 'మహా' రాజకీయం

ఈ ఏడాది చివరినాటికి మహారాష్ట్రలో షెడ్యూల్ ప్రకారం అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న మహారాష్ట్రలో రాజకీయ పార్టీలు ఇప్పటికే అనేక వ్యూహాలను రచిస్తున్నాయి. రాష్ట్రంలో మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) ప్రభుత్వం కూలిపోవటం నుంచి రెండేండ్ల క్రితం ఏక్‌నాథ్ షిండే శివసేన నేతృత్వంలోని మహాయుతి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడే వరకు కీలక పాత్ర వహించిన బీజేపీ కూడా ఇందుకు మినహాయింపేమీ కాదు. ఇతర పార్టీల వ్యవహారాల్లో వేలు పెడుతుందన్న పేరున్న బీజేపీ.. ఇప్పుడు అంతర్గత సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

మోడీ-షాకు నచ్చకపోతే అంతే

ఎంతటి నాయకుడైనా అణిగిమణిగి ఉండాల్సిందే

లేకపోతే రాజకీయంగా అంతే సంగతులు

అధిష్టానం తీరుపై పార్టీలో అసంతృప్తి

ఇప్పటికే పలు సందర్భాలలో బయటపడిన నిరసన జ్వాలలు

గొంతెత్తిన కిరిటి సోమైయా వంటి సీనియర్ నాయకులు

ఆ తర్వాత మళ్లీ చల్లారిన వైనం

తన నియోజకవర్గం వరకే పరిమితమైన నితిన్ గడ్కరీ

ముంబయి : రాష్ట్ర రాజకీయాల్లోనూ బీజేపీ అధిష్టానానిదే కీలక పాత్ర అని అంటున్నారు. మోడీ-షా ల అనుమతి లేనిదే పార్టీలో రాజకీయాలు ముందుకు సాగవని చెప్తున్నారు. మోడీ-షా ద్వయానికి ఎదురు తిరిగితే ఇక అంతే సంగతులన్న విషయం రాష్ట్రంలో బీజేపీ నాయకులకు తెలుసని అంటున్నారు. అయితే, అధిష్టానం ఏకపక్ష, నియంతృత్వ తీరు రాష్ట్ర నాయకులకు మింగుడుపడటం లేదని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. మోడీ-షాల ధోరణిపై కొందరు అణిగిమణిగి ఉంటుండగా, మరికొందరు గొంతెత్తి పార్టీలో రాజకీయంగా అధ:పాతాళానికి తొక్కేయబడుతున్నారని చెప్తున్నారు.

రాష్ట్రంలోని బీజేపీ ప్రచార కమిటీలో తనకు సభ్యత్వం నిరాకరించటంపై ఆ పార్టీ సీనియర్ నాయకుడు కిరిటి సోమైయా ఆగ్రహానికి లోనయ్యాడు. మోడీ-షా ద్వయాన్ని పరోక్షంగా లక్ష్యంగా చేసుకుంటు లేఖ రాశాడు. ఆ తర్వాత ఏమైందో తెలీదు కానీ.. కిరిటి సోమైయా ఆ మొత్తం విషయాన్ని తగ్గించి చూపించే ప్రయత్నం చేశాడు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయిందనీ, మీడియా కూడా ఆయన లేఖను 'లెటర్ బాంబ్'గా అభివర్ణించిందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. 70 ఏండ్ల కిరిటి సోమైయా సాధారణ బీజేపీ నాయకుడు కాదనీ, రాష్ట్ర రాజకీయాల్లో ఆయనకు సీనియర్ నేతగా పేరున్నదని చెప్తున్నారు. ప్రతిపక్ష నాయకులపై రాజకీయంగా విమర్శలు చేస్తూ, బీజేపీకి సానుకూల వాతావరణాన్ని తీసుకురావటంలో ఆయన కీలకంగానే వ్యవహరించారని అంటారు. గతంలో రెండుసార్లు లోక్‌సభ ఎంపీగా పని చేసిన ఆయనకు తగిన గౌరవం దక్కలేదనే అసంతృప్తిలో కిరిటి సోమైయా ఉన్నారు. కనీసం రాజ్యసభ సీటు అయినా దక్కుతుందనే ఆశతో ఉన్న ఆయనకు అది కూడా దక్కకపోవటంతో మోడీ-షా ద్వయంపై ఆయన గుర్రుగా ఉన్నట్టు తెలుస్తున్నది.

రాష్ట్ర బీజేపీలో ఫడ్నవీస్ ముఖ్యమంత్రి స్థాయికి ఎదగటానికి ముందు ఏక్‌నాథ్ ఖడ్సే బీజేపీలో అత్యంత సీనియర్ నేతగా ఉండేవారు. 2014లో అధిష్టానం ఆశీస్సులతో దేవేంద్ర ఫడ్నవీస్ మహారాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారు. ఆ తర్వాత ఏక్‌నాథ్ ఖడ్సేకు ఫడ్నవీస్‌తో పొసగకపోవటంతో పార్టీని వీడి శరద్ పవార్ నేతృత్వంలోని అప్పటి ఎన్సీపీ (ప్రస్తుతం ఎన్సీపీ(ఎస్పీ))లో చేరాడు. అయితే, ఇటీవల బీజేపీలోకి తిరిగి వచ్చే ప్రయత్నం చేసిన ఏక్‌నాథ్ ఖడ్సేకు చేరిక అంత సులువు కాలేదు. ఫడ్నవీస్ కారణంగానే పార్టీలో తన చేరిక నిలిచిపోయిందన్న ఆరోపణలను ఏక్‌నాథ్ ఖడ్సే వినిపిస్తున్నారు.



లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత ఆరెస్సెస్, బీజేపీ మధ్య గ్యాప్ పెరిగిందనే వార్తలు వచ్చాయి. ఆరెస్సెస్ స్థావరమైన నాగ్‌పూర్‌కు బీజేపీ సీనియర్ నేత నితిన్ గడ్కరీ ఎంపీగా ప్రాతినిథ్యం వహిస్తూ, కేంద్ర మంత్రిగా ఉన్నారు. బీజేపీలో ప్రధాని పదవికి వినబడే పేర్లలో గడ్కరీ కూడా ఉంటారు. అలాంటిది మహారాష్ట్ర రాజకీయాల్లో ఇంత జరుగుతున్నా.. ఆయన మాత్రం నాగ్‌పూర్ వరకే పరిమితమవుతూ, తన శాఖ పనుల మీదనే దృష్టి పెడుతుండటం గమనార్హం. మొత్తానికి, వాజ్‌పేయి, అద్వానీలు తయారు చేసిన నాయకులను మోడీ-షా ద్వయం నమ్మటం లేదని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. రాష్ట్రంలో కమలం పార్టీకి జాతీయస్థాయిలో ఉన్న అధిష్టానమే ఆదేశాలు జారీ చేస్తూ పోతే ఇక్కడ రాబోయే ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రావటం కష్టమేనని బీజేపీ పార్టీలోనే కొందరు నేతలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

నేడు బ్లాక్ డే

- పాల్గొననున్న ఆర్టీసీ కార్మిక సంఘాలు
- కేంద్రం తెచ్చిన లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కార్మిక చట్టాల స్థానంలో కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు సోమవారం దేశవ్యాప్తంగా బ్లాక్ డే పాటిస్తున్నారు. దానిలో భాగంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) లోని కార్మిక సంఘాలు కూడా ఈ ఆందోళనల్లో భాగస్వామ్యం అవుతున్నాయి. కొన్ని సంఘాలు బ్లాక్ డేకు సంఘీభావం ప్రకటించాయి. టీజీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్), స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌డబ్ల్యూయూ) సంయుక్తాధ్వర్యంలో సోమవారం ఉదయం పది గంటలకు హైదరాబాద్ బస్‌భవన్ ఎదుట బ్లాక్ డేను నిర్వహిస్తున్నట్టు ఆ సంఘాల ప్రధాన కార్యదర్శులు వీఎస్ రావు, కే రాజిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం మొదటి డ్యూటీ నుంచి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలపాలని టీజీఎస్ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ పిలుపునిచ్చింది. ఈ మేరకు జేఏసీ చైర్మెన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మెన్ ఎమ్ థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎమ్‌డీ మౌలానా, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బీ యాదగిరి ఓ ప్రకటనలో తెలిపారు. బ్లాక్‌డేకు మద్దతు తెలుపుతూ, కార్మికులు ఆందోళనల్లో పాల్గొనాలని టీజీఎస్ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్ష, కార్యనిర్వాహక అధ్యక్షులు పీ కమాల్‌రెడ్డి, ఎమ్ నరేందర్ పిలుపునిచ్చారు.

వెన్నెల వేగు



రంగురంగుల రెక్కలతో అలికిడి
ఆత్మ మీద వాలింది
పేరు తెలవని పువ్వులు
అంతరమంతా పూసినయి
ఏ రాగమో కాని కనికట్టు కట్టింది
నిద్ర కూడా మొగ్గ తొడిగింది
కలలో జారిపోయిన పట్టాగొలుసు
నీడ చాటుకు నిలబడ్డ దివ్య పాదానిది
నాలోకిచూసి సింగిడి సిగ్గు పడింది.
రాలిన ఆకు... ఆకాశంలా విస్తరించింది.
అలుగు పద్యాన్ని మలుగు వింటుంటే
ఎలుగు వొచ్చి పోతుంది
వెన్నెల్ని మింగిన చేపలు
చెరువు నిండా నక్షత్రాలు
ఒక తెడ నా ఛాతి మీదికి వొచ్చి
సిగ్గు పడుతుంది నేను వెన్నెల వేగునని
చీకటి రాత్రి చికాకుపడ్డది
భటువు కుదవపెట్టి పటువ కల్లు తాగితే
చందమామ చేతికి తగిలింది
రాత్రి ఒడ్డు మీద పడుకొని
ఆకాశంతో ముచ్చట పెడుతుంటే
చేపలు ఊ కొడుతున్నాయి
ఆ పక్క పేదరాశి పెద్దమ్మలా ఉంది పెద్దగుండు
చెరువు ఆకాశమో.. ఆకాశం చెరువో కాని
నా కళ్ల రెండు ఈదుతునే ఉన్నయి
జింక తపస్సుకు పులి ప్రత్యక్షమైనట్టు
చేపలు తిని బొల్లి కోడి బలిస్తే
బొల్లి కోడిని తిని బోయ బలిసిండు
బోయ రెక్కల కష్టం తిని
రామయ్య సేటు బలిసిండు
ఊత మీద ఊత పడ్డది
పిడకల గూడేనకాల మునిమాపు ముచ్చటకు
మిణుగురులు దీపం పట్టినయి
కీచురాయి గొంతు మూగబోయింది
మాట మాట పేనవేసుకుంటుంటే
గాలి హొయలుబోయింది
పగలంతా పోంగ.. మిగిలింది గీ రాత్రే
పక్షి గూడు కుందేలు పొద
ఎవరు కొనగలుగుతారు గీ రాత్రి.. నాకూ అంతే
చెరువారనే దివ్య లోకం ఒకటి ఉంది
నా కళ్లల్లో దృశ్యాల్ని
హృదయం ఎక్కడికో తీసికెళ్లింది
కొన్ని మైళ్ల నడిచినాంక
ఓ రంగుల వాగులో మునిగి తేలుతున్న

- మునాసు వెంకట్, 9948158163

‘తెలుగుదనం’ అనే మాట ఈమధ్య చాలా ప్రసిద్ధికెక్కింది. ఒకరు దానికి కళ తప్పిందంటే, మరొకరు దాన్ని ఆధిపత్య ముసుగుగా అభివర్ణించారు. ఇంకొక అరవైమందికి పైగా సాహితీమిత్రులు అందులోంచే పెత్తనం, దాష్టీకం, వివక్షా వగైరాలను తవ్వి తీశారు. తెలుగు అనే పదాన్ని నన్నయ, నన్నెచోడుడు, తిక్కన, పాల్కురికి ఏ విధంగా ఎక్కడ వాడారో, అది జాతి వాచకమో దేశవాచకమో ఈ చర్చకు ప్రాధాన్యం కాదు.



తెలుగదేలయన్న...

ఆంధ్రా, తెలంగాణ ప్రజలు మాట్లాడేది తెలుగు భాషే (లేక తెలంగాణ భాషే) అనుకున్నప్పుడు ఒక జాతిగా వాళ్ళకున్న సారూప్యతలేమిటి? నిర్మాణ పరంగా ఈ తెలుగు (లేదా తెలంగాణ) జాతిలో వైరుధ్యాలేమున్నాయి? అన్న ఆలోచన మెదుల్తుంది. ఈ రెండు ప్రాంతాల్లో ఏవి తత్సమాలు, ఏవి తద్భవాలో కూడా ఇప్పుడు విశదీకరించడం లేదు. విషయమల్లా కె.శ్రీనివాస్ గారు (15.8.24) ‘సాంస్కృతిక జీవనంలోనూ, విలువల పాటింపులోనూ కొత్త పతనస్థాయిని, లేకితనంలో కొంగ్రొత్త పతాకస్థాయిని అందుకుంటున్న ప్రయాణం తెలుగువారిదన్న’ మాట గురించి. లేకితనం అనే పదాన్ని ఎంత దుబారాగా వాడేసేడీయన. ఆయన విమర్శించిన తెలుగుదనంలో సంగిశెట్టివారికి (25.08.24) బ్రాహ్మణాధిపత్య ‘థాట్ పోలీసింగ్’ (భావజాల నియంత్రణ) కనిపించింది. విరసం పాణి (వసంతమేఘం - 1.9.24) దీన్ని పాపులిస్టిక్ ధోరణి అన్నారు. ఆనందాచారిగారు నవతెలంగాణలో ‘మన సాహిత్యరంగం ఇలా ఎందుకుంది’ అని ప్రశ్నించారు. ఇవన్నీ ఒకెత్తైతే మన తెలంగాణలో (2.9.24) పసునూరి రవీందర్ రాసిన వ్యాసం/ ప్రకటన మరొకటి. వీటన్నింటికీ ఒక ఏకసూత్రత ఉంది. అది ఈ మధ్యే బెంగళూరులో జరిగిన ‘బుక్ బ్రహ్మ’ సాహిత్య కార్యక్రమం.

ఉదారవాద ప్రజాస్వామ్య ప్రేమికులైన మేధావులకి దేన్నన్నా/ ఎవర్నన్నా సరిపోల్చడంలో ఒక సరదా ఉంటుంది. లేకపోతే ఆ అవలక్షణరీత్యా ఒక్కొక్కరూ ఒక్కోవిధంగా పేర్లు తీసుకోకపోదురు. తీసుకున్నారుపో, తమ కులపువాళ్ళని, ఉపకులపువాళ్ళనీ, లేదా సొంత ముఠాదార్లనీ ఎంచుకోక తప్పదు కామోసు. సంగిశెట్టివారన్నట్టు నేం డ్రాపింగ్ కూడా ఒక కళే’. బహుజన వాదానికి ఆంధ్రా, తెలంగాణ అభేదం పాటించి సంగిశెట్టి ప్రశంసార్హుడైనాడేమో గానీ కులప్రాతినిధ్యం పట్ల సంగిశెట్టి చూపిన శ్రద్ధకీ, సోకాల్డ్ బ్రాహ్మణాధిపత్య ప్రమోషనల్ లక్షణానికీ తేడా ఏమున్నది? సరే ఉన్నదిపో, దానికి తెలుగుదనానికి ఎందుకు ముడిపెట్టాలి? సాంస్కృతికంగా తెలుగు భాషా ప్రాతినిధ్యం తెలిసి కూడా, వాళ్ళెవరో రాష్ట్రం బయట చేసుకుంటున్న ‘సాహిత్య మేళా’కి ఏ బీసీనీ పిలవలేదు, ఏ తెలంగాణావారినీ పిలవలేదని ఎందుకు ఆక్రోశించాలి? ఆ కార్యక్రమ నిర్వాహకుల పిలుపుల్లో సామాజిక వర్గ కోణాన్ని ఎత్తిచూపుతూనే ‘తెలుగుదనాన్ని’ విమర్శించడం అసంబద్ధ చర్య.

వీరికి ప్రాథమికంగా కేంద్ర సాహిత్య అకాడెమీతో పేచీ ఉందని అర్థమవుతోంది. అకాడెమీ తెలంగాణాలో ఏర్పాటు చేసే కార్యక్రమాల్లో తెలంగాణేతరులుండరాదని వీరి ప్రతిపాదన. చెప్పగలిగితే దీనికి సలహా మండలి కన్వీనర్లూ/ సభ్యులుగా ఉన్నవారు సమాధానం చెప్పాలి. అకాడెమీలో అన్ని ప్రాంతాల భాగస్వామ్యం ఉంది కదా. ఉన్న రెండు తెలుగు రాష్ట్రాలకి అకాడెమీ ఎలా పదవులూ, పురస్కారాలూ పంచాలో అది ప్రత్యేకమైన చర్చ. అకాడెమీలో భాషాపరంగా కాక రాష్ట్రాల వారీగా ప్రాతినిధ్యం కావాలనడంలో ఔచిత్యం ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది. పలుకుబళ్ళు వేరు గావచ్చు, మూలం తెలుగే. ఈ రెండు ప్రాంతాల నాగరికత, సాంస్కృతిక చరిత్రల్లో, తెలుగు భాషని విడదీసి చూసేంత ప్రలోభానికి ఏ సామాన్యుడూ గురి కాడు. మీ కథలూ కవిత్వాలూ ‘ఆంధ్రా’ పేరిట అచ్చేసుకోమని చెప్పడం తొందరపాటు తప్ప మరొకటి కాదు. అదీగాక తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, లేక ఇతర ప్రదేశాల్లో తెలుగు మాట్లాడేవాళ్ళని తమ భాషకి ఏ పేరు పెట్టుకొమ్మని చెబుదాం? సాహిత్యకారులు వ్యక్తివాదులుగా మారకూడదు. సైద్ధాంతిక గందరగోళం ప్రమాదకరమైనది.

> ఒకే భాష మాట్లాడుతూ ఒక్కటి కాలేకపోయిన తెలుగు ప్రజలు ప్రపంచ మానవులు కావడానికి తెలుగుదనం కంటే వేరే ప్రాతిపాదికలు ఎక్కువ ఉపయోగపడతాయేమో చూడాలన్నాడు. ఆలోచించాల్సిన మాటే. తెలుగుదనంలోని సంప్రదాయ కంఠస్వరం పోయేది కాదు. రెండు రాష్ట్రాల ప్రజలందరికీ తమ తమ సాంస్కృతిక వారసత్వాలున్నాయి. అది తెలుగుదనంలో భాగంగా ఉంది.

“మీ సాహిత్యం క్యారెక్టర్ వేరు. నేచర్ వేరు. ఫంక్షన్ వేరు. బిహేవియర్ వేరు. లక్ష్యం వేరు. కాబట్టి మీరు వేరు” అంటాడు మిత్రుడు. జాషువా మొదలు, శివసాగర్, మద్దూరి, కలేకూరి రచనల క్యారక్టర్ (వ్యక్తిత్వం) ఏమిటి? వాళ్ళ రచనల బిహేవియర్ (స్వభావమూ) లక్ష్యం ఏమిటి? కావడి కుండల సంకలనాన్ని మర్చిపోయారనుకుంటాను. మేమైతే తెలంగాణ ఉద్యమం బట్టబయలు చేసిన సత్యాలకి రుణపడి ఉంటాం. అసమానతలు తెలిశాయి. అయితే తెలంగాణ వచ్చాక ఈ పదేళ్లలో రెండు ప్రాంతాలలో పెరిగిన కలివిడితనాన్ని కలుషితం చేయకండి.

‘ప్రధాన వేదికలపై అందరూ ఆధిపత్య కులాల వాండ్లే కదా’ అనడంలో ఔచిత్యం ఏమిటి? ఏవి ప్రధాన వేదికలు? పదేళ్ళ కాలంలో తెలంగాణలో సాహిత్య అకాడెమీ ఏర్పాటయ్యింది. చక్కటి భాషోత్సవాలు చేశారు. తెలంగాణ సారస్వత పరిషత్తు సాహితీవేత్తల్ని సముచితంగా గౌరవిస్తోంది. తెలుగు విశ్వవిద్యాలయం మీకే పుస్తక గ్రాంట్లు ఇస్తోంది. కీర్తి పురస్కారాలనూ ప్రకటిస్తోంది. ఇవిగాక భాషా సాంస్కృతిక శాఖ పనితీరు చాలా బాగుంది. కథా, కవితా వార్షికలు ఒక్క ఆంధ్రా ప్రాంతం నుండే కాదు, తెలంగాణ నుంచీ విరివిగా వస్తున్నాయి కదా. బహుజన కథా కచ్చీరులు, కూడళ్ళు, తెలంగాణ సాహితి లిటరరీ ఫెస్టు మంచి పనే చేస్తున్నాయి కదా. ‘ఇప్పుడు హైద్రాబాద్ కేవలం తెలంగాణ ప్రజల ఆస్తి’ అనడం వెనుక హైదరాబాద్ నగర కేంద్రీకృత రాజకీయం కనిపిస్తోందంతే. ఆంధ్ర ప్రాంతంలో ఒక బలమైన సాంస్కృతిక నగరావసరాన్ని నొక్కి చెప్పినందుకు కృతజ్ఞతలు. దానికి తెలుగుని, తెలుగుదనాన్ని ఫణంగా పెట్టకండి. తెలంగాణం అంటేనే తెలుగు స్థానం, తెలుగు మాటల మాగాణం అన్న నలిమెల భాస్కర్ గారి మాటలు మననీయమైనవి.

ఫ్రీవర్స్ ఫ్రంట్, ఉమ్మడిశెట్టి, రంగినేని, రొట్టమాకురేవు, సినారె పురస్కారాల్ని గమనించండి. కవిసంగమం కృషిని తలుచుకోండి. సాహిత్యప్రేమ తప్ప వేరు పక్షపాతం కనబడదు. ఖమ్మం ఈస్థటిక్స్, ముల్కనూర్ గ్రంథాలయం కథల పోటీలు, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రొ. కాశిం గారి నేతృత్వంలో జరిగిన తెలుగు సాహిత్య మహాసభలు స్ఫూర్తిదాయకమైనవి. విశాఖ మక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్ వరుసగా తండా హరీష్ గౌడ్, బండారి రాజ్ కుమార్లని గౌరవించింది. ఇబ్రహీం నిర్గుణ్ గారికి అనంతపురంలో విమలాశాంతి పురస్కారం, ఏనుగు నరసింహా రెడ్డి గారికి ఒంగోలులో నాగభైరవ పురస్కారం ఇచ్చారు. కరీంనగర్ అసిస్టెంట్ కలెక్టరు శ్యాంప్రసాద్ లాల్ చిత్తూరు జిల్లాకు చెందిన మేఘనాధ్ రెడ్డిని తన తండ్రి పేర సత్కరించారు. ఖమ్మంకు చెందిన ఫణిమాధవి విజయనగరంలో రాధేయ పురస్కారం అందుకున్నారు. ఎటువంటి ప్రాంతీయ వివక్ష లేకుండా తిరుపతి నుండి కంచర్ల సుబ్బానాయుడు ‘సేవ’ పేరుతో ఏడాదిపాటు నిర్వహించిన ఆన్లైన్ కార్యక్రమాలు యూట్యూబ్లో ఉన్నాయి చూడండి. మిత్రులారా ఇంకా విశాల దృక్పథాలకు కాలమున్నది. ఇదొక మంచి పరిణామం. ఇప్పటికీ తెలుగు వాడి ప్రస్తావన వస్తే మేం సి.నారాయణరెడ్డి కవితే ఉదహరిస్తాం. అందుకే మిత్రులు మాకు సిగ్గులేదంటున్నారు కదా.

ఎక్కడో ఆఫ్ఘనిస్తాన్, ఉక్రెయిన్, పాలస్తీనా వంటి దేశాల సమస్యలపై రచనలు చేసే మనం విభజనకు ముందే ఈ రెండు రాష్ట్రాల్లో రక్తసంబంధీకులున్నారు, స్నేహితులున్నారని, మన అనుకున్న ప్రజలున్నారని మరచిపోలేదు కదా. మీడియా హౌస్‌ల, సాహిత్య పేజీ ఇన్‌చార్జుల కులాధిపత్యాన్నే సాకుగా చూస్తున్నాం గానీ దేశంలో అన్ని ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలు ఏ పార్టీ కనుసన్నల్లోకి వెళ్ళి పోయాయో తెలియడం లేదా? మనలో మనం వేదికల భాగస్వామ్యం కోసం ఇలా అల్లరి పడటం వలన ఉమ్మడి శత్రువుకు పలుచనైపోవడం లేదూ? దేశంలో హిందీని బలవంతంగా రుద్దే ప్రయత్నం జోరుగా జరగట్లేదా? తెలుగు ఇతర ద్రవిడ భాషల మధ్య, అధికారిక హిందీ మధ్య ఎంతో నలిగిపోతోంది. List of rationalised content పేరిట పాఠ్య పుస్తకాల్లోంచి సామాన్యుడి పోరాటాలు కనుమరుగవుతున్నాయి. సెప్టెంబరు 17 ఎంత రాజకీయమైపోయింది చూడండి? వీటిని మనం తెలుగు భాషతోనే కదా ఎదుర్కొనగలం?

పాణి ఒకే భాష మాట్లాడుతూ ఒక్కటి కాలేకపోయిన తెలుగు ప్రజలు ప్రపంచ మానవులు కావడానికి తెలుగుదనం కంటే వేరే ప్రాతిపాదికలు ఎక్కువ ఉపయోగపడతాయేమో చూడాలన్నాడు. ఆలోచించాల్సిన మాటే. తెలుగుదనంలోని సంప్రదాయ కంఠస్వరం పోయేది కాదు. రెండు రాష్ట్రాల ప్రజలందరికీ తమ తమ సాంస్కృతిక వారసత్వాలున్నాయి. అది తెలుగుదనంలో భాగంగా ఉంది. తెలుగుదనానికి కోస్తాలో సంక్రాంతి సంబరాలెంత ముఖ్యమో, తెలంగాణా మహంకాళీ బోనాలు, ఖైరతాబాద్ వినాయకుడూ అంతే ముఖ్యమైనవి. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమెంత ప్రాణప్రదమైనదో, శ్రీకాకుళ గిరిజనోద్యమమూ అంతే మరువలేనిది. అయితే ప్రగతిశీల భావజాలం కోసమని సామాన్యుడు తన జీవన శైలిని, ఆచార వ్యవహారాలని సులువుగా మార్చుకోలేడని ఎన్నో అనుభవాలు చెబుతున్నాయి. బాబాల భజనలూ, మండల పూజలు చేస్తున్న నేటి యువతరాన్ని గమనించండి. హిపోక్రసీ లేకుండా ముందు వీటన్నింటినీ అంగీకరించాలి. ఆపై మన సాంస్కృతిక పరిణతిని అంచనా వేద్దాం. కళ జీవితాన్ని ప్రతిబింబిస్తుందనుకున్నప్పుడు ఏది దేన్ని దాటి ప్రవర్తిస్తున్నదో కూడా తెలుసుకోవాలి. అప్పుడే ఒక తరాన్ని ప్రభావితం చేసే రచనల ప్రస్తావన, తెలుగుదనాల గురించీ వ్యాఖ్యానం చేయాలి. తెలంగాణా నుడికారం విద్యా పరిపాలనా రంగాలకు మరింత విస్తరించాలన్న కాంక్షలో మీ భాష ఆంధ్రా, తెలుగు కాదనేంత కాఠిన్యం ఉంటుందనుకోలేదు. మీ ప్రకటనలో దౌర్జన్యం ధ్వనిస్తోంది. కలుపుకుంటే రెండు తెలుగులు ఒకటే (ఉపకారి -2022) అన్నాడు మిత్రుడు బూర్ల వెంకటేశ్వర్లు. ప్రాంతం పేరుతో వేర్పాటువాద విధానాలకు స్వస్తి పలుకుదాం. ఎందుకంటే తెలుగు భాష పట్ల ‘మన’ అనే మమకారం మనందరికీ వుండాలి.

- అనిల్ డ్యానీ, సుంకర గోపాల్, పాయల మురళితో కలసి శ్రీరాం పుప్పాల

వారాల ఆనంద్ జ్ఞాపకాల సడి


- డా॥ బి.వి.ఎన్. స్వామి, 9247817732



గతాన్ని నెమరువేసుకోవడానికి కాస్తంత తెరపి అవసరం. మనోవేగంతో పోటీపడి సాగుతున్న ఆధునిక జీవనంలో తెరపి దొరకడం కాస్త కష్టమే. కారణాలేవైనా దొరికిన విశ్రాంతిని, కాలాన్ని సృజన వైపు మళ్ళించడం మంచి వ్యాపకం. అనారోగ్య కారణం వల్ల వారాల ఆనంద్‌కు విశ్రాంతి దొరికింది. గతాన్ని జ్ఞప్తికి తెచ్చుకునే వెసులుబాటు కలిగింది. అది కాస్త జ్ఞాపకంగా విస్తరించి “యాదోంకి బారాత్” అనే పుస్తకంగా వెలువడింది. ‘ఇప్పుడు రచనే నన్ను బతికిస్తుంది” అని చెప్పుకున్న ఆనంద్ కలం నుండి కవితలు, వ్యాసాలు, అనువాదాలు, ఆడియోటాక్స్, వీడియో విజువల్స్, రేడియో ప్రోగ్రామ్స్, సోషల్ మీడియా రైటింగ్స్ ఇలా రకరకాలుగా వెలువడినాయి. 1958 నుండి 2014 వరకు విస్తారంగా పరుచుకున్న తన జీవనానుభవాల్ని పొరలు పొరలుగా పాఠకుల ముందు పరిచారు. ఏ రచననైనా సమాజం నుండి వేరు చేసి చూడలేం. సామాజిక స్పృహ కలిగిన రచనలో సమకాలీన చరిత్ర రూపుకడుతుంది ఆనంద్ జీవితం. ఆనాటి ఘటనలతో కలగలిసి ఉండడం వల్ల జ్ఞాపకాలు చాలావరకు చరిత్రను గుర్తుచేస్తాయి.

ఆత్మకథ, జీవిత చరిత్ర, జ్ఞాపకాలు పేరేదైనా కానీయండి, ఆ రచనతో రచయిత లేదా వ్యక్తి జీవితం ముడివేసుకొని ఉంటుంది. సుఖదు:ఖాలను, మానావమానాలను సమదృష్టితో వ్యక్తం చేసిన రచనకు విశ్వసనీయత చేకూరుతుంది. రచయిత నిజాయితీకి ఇలాంటి రచనలు అద్దంపడతాయి. “నాకు తెలిసి నేను మధ్య తరగతి జీవిని. పట్టణ వాసన ఉన్నవాణ్ణి. చాలా వాటిని ప్రేమించాను. అభిమానించాను. ఆరాధించాను. ప్రేరణ పొందాను. కానీ అందులోకి దిగలేదు. కాళ్ళకు మట్టి అంటలేదు, ఒంటికి సురుకూ అంటలేదు. కానీ నేను నా విశ్వాసాల్ని ప్రేమల్ని, అభిమానాల్ని అట్లే ఉంచుకున్నాను. మారలేదు. నమ్మినదానికి ఎప్పుడూ వ్యతిరేకమయితే కాలేదు. శత్రువుగానయితే మారలేదు. బహుశ నేను నమ్మింది మానసావాచా అనుసరించింది ఇదే” అని చెప్పుకున్న ఆనంద్ మాటవల్ల రచనకు బలం చేకూరింది. 1958లో జన్మించిన రచయిత 2014లో పునర్జన్మించాడు. ఈ మధ్య కాలపు ఘటనలు, అనుభవాలు, అనుభూతులను జ్ఞాపకాల రూపంలో పంచిపెట్టాడు. కొందరికి జీవితం వడ్డించిన విస్తరయితే మరికొందరికది శూన్యహస్తం లాంటిది. ఇంకొందరికి ఎగుడుదిగుడు దారి లాంటిది. అలాంటి దారిలో పడుతూ లేస్తూ నిలిచిన రచయిత వారాల ఆనంద్. అందుకే “జీవితంలో వ్యక్తిత్వం, ప్రతిభ రూపొందే క్రమం ఒకటి ఉంటుంది. గెలుపోటముల మధ్య అని కొనసాగుతుంది” అని అనగలిగాడు.

ఉమ్మడి కుటుంబంలో జన్మించిన రచయిత అవ్వాతాతల ఆప్యాయతను, చిన్నా పెద్దల ప్రేమను పొందాడు. ఉమ్మడిలో గల ఐక్యతను, అసూయలను అనుభవించాడు. హాస్టల్‌ను తలపించే చతుశ్శాల భవంతి గుంపు మనస్తత్వాన్ని ఆకళింపు చేసుకున్నాడు. మిఠాయి సత్తెవ్వ, డా॥ సుబ్రమణ్యంల మనవడిగా పొందిన అనురాగాల్ని, పెద్దనాన్నల దౌర్జన్యాల్ని సమానంగా చవిచూసాడు. అర్ధరాత్రి అవమానకరంగా బయటకు గెంటివేయబడిన సంఘటన రచయిత బాల్యంపై బలమైన ముద్రవేసింది. ఇది ఉమ్మడి కుటుంబపు మరో పార్శ్వం. ఆ తరువాతనే రేడియో, సినిమా లాంటి వికాస సదుపాయాలు ఆనంద్‌కు అందాయి. వాటివల్లనే అతనిలో వికాసం మొగ్గ తొడిగింది. ఇతను పుట్టి పెరిగిన కరీంనగర్ ఊరు లక్షణాలు, పట్టణ పోకడలు కలగలిసిన కేంద్రం. మిఠాయి వ్యాపారం, సినిమా టాకీసులు, రోడ్లు, హోటల్స్ పట్టణ చిహ్నాలైతే, ఇండ్లు, బడులు, ఉమ్మడి కుటుంబాలు పల్లెపట్టుల ఆనవాళ్ళు. సెమీ అర్బన్ లక్షణమైన గుండాయిజం, వీధి పోరాటాలుగా వర్ధిల్లింది. ఒక వాడకు, మరొక వాడకు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. వ్యక్తుల ఆధిపత్యాలకు అది ఆజ్యం పోసి బడి పిల్లలను, యువకులను సమూహాలుగా విడగొట్టి ఎదురెదురుగా నిలబెట్టింది. ఆనంద్ లాంటి తటస్థులను కూడా ఏదో ఒక వైపు నిలబెట్టిన కాలమది. హత్యలు, కేసులు, కొట్లాటలు-వరిష్కారాలు ఫ్యూడల్ చిహ్నాలుగా విలసిల్లాయి. పట్టణాల్లోని ఆ వాతావరణం నుండే ప్రగతిశీల శక్తులు తలెత్తి గ్రామాలకు తరలాయి. ఈ క్రమాన్నంతటినీ పుస్తకం చెప్పింది.



స్పష్టంగా మాట పలకలేని తనం వల్ల ఆనంద్ సమూహంలో ఒంటరిగా పెరిగాడు. సూటిపోటి మాటల వల్ల అంతర్ముఖుడయ్యాడు. అమ్మమ్మ ఒడిలో కొంత, రేడియో నీడన కొంత సేదతీరాడు. బినాకా గీత్ మాలా నారుపోస్తే, నవలలు నీరు పోసాయి. తద్వారా సృజన పంట సమాజానికందింది. పెరిగి పెద్దగయ్యే క్రమంలో గొంతు పెకలనితనం వల్ల వెనక బెంచికి పరిమితమైతే, అతనిలోని కార్యశీలి నలుగురిలో వెలిగాడు. కరీంనగర్‌లోని కార్ఖానగడ్డ, గంజ్ హైస్కూల్ మీదుగా సైన్స్ కాలేజీ వరకు ఎదిగిన తరువాత కళాశాల కార్యక్రమాల ఉధృతి, కొత్తస్నేహాల ప్రభావాలు, ప్రగతిశీల ఆలోచనలు పదుగురిలో మాట్లాడక తప్పనిసరి పరిస్థితులను కల్పించాయి. ఈ సందర్భంలోనే చిన్ననాటిస్నేహితులను, చదువు నేర్పిన పంతుళ్ళను, బడుల స్థితిగతులను, విద్యార్థుల చలనశీలతను పూసగుచ్చినట్లు వివరించాడు.

తను 60% మార్కులు అందుకోలేని సాధారణ విద్యార్థినని చాలా చోట్ల చెప్పుకున్నాడు. డిగ్రీ వరకు ఉన్న ఊళ్ళోనే చదువుకోవడం వల్ల తీరుబడి కాలాన్ని సాహిత్య, సాంస్కృతిక కార్యకలాపాలకు వెచ్చించాడు. తల్లిగారి ఊరైన వేములవాడలో ఎక్కువ కాలం ఉండటం వల్ల అక్కడి నటరాజకళానికేతన్, కళాభారతి లాంటి సంస్థల ద్వారా సాంస్కృతిక వారసత్వాన్ని అందుకున్నాడు. ఉత్తర తెలంగాణలోని వామపక్ష తీవ్రవాదం, ఎమర్జెన్సీ ప్రకటన, జగిత్యాల జైత్రయాత్ర, పౌరహక్కుల సంఘాల ప్రభావాలు ఆనాటి విద్యార్థులపై మెండుగా ఉన్నాయి. ఆ అవగాహనతోనే ఉస్మానియా యూనివర్శిటీలో లెఫ్ట్‌వింగ్‌కు మద్దతిచ్చి ఎన్నికల్లో వారిని గెలిపించాడు. యూనివర్శిటీ చదువు పూర్తి కాగానే మంథని జూనియర్ కళాశాలలో లైబ్రేరియన్‌గా ఉద్యోగం వచ్చింది. అక్కడినుండి మొదలైన ఉద్యోగ పర్వం కరీంనగర్‌లో ఎస్.ఆర్.ఆర్. డిగ్రీ కళాశాలతో ముగిసింది. ఈ మధ్యకాలంలో తనకు తారసిల్లిన సాహితీవేత్తలను, తనపై వారి ప్రభావాలను చెప్పుకున్నాడు. తన నిక్కచ్చితనం మూలంగా పరీక్ష, ఎన్నికల విధుల్లో ఎదురైన ప్రమాదాలను సీనియర్స్ సహాయంతో గట్టెక్కిన విధానాన్ని వివరించాడు.

ఒక వైపు ఉద్యోగం, మరొక వైపు తీరిక లేని కార్యక్రమాలలో జీవితం గడిపారు. కరీంనగర్ ఫిలిం సొసైటీ స్థాపన-భవన నిర్మాణము, ఫిలిం క్లబ్స్ ఏర్పాటు, ఫిలిం ప్రదర్శనలు, ఫిలిం ఫెస్టివల్స్ నిర్వహణ, అక్షర ఉజ్వల కార్యక్రమాలు, సాహితీ గౌతమి, తెలంగాణ రచయితల వేదిక లాంటి సాహితీ సంస్థల్లో భాగస్వామ్యం, కరీంనగర్ రెసిడెన్షియల్ స్కూల్ స్థాపన, పుస్తక ప్రచురణ, ప్రింట్-విజువల్ మీడియాతో తనకున్న అనుబంధాన్ని, చిన్న సినిమా నిర్మాణం, మొదలగు పనులలో పడిన కష్టాల్ని పాఠకులకు చేరవేశారు. ఇందులో ఆనాటి చరిత్ర కనపడుతుంది. కాలేజీ ఉద్యోగం-కార్యక్రమాలు, కరీంనగర్ ఫిలిం సొసైటీ ప్రదర్శనలు ఉత్సవాలు, సృజనాత్మక కృషి-డాక్యుమెంటరీ నిర్మాణం, కుటుంబ సమస్యలు అనే నాలుగు రంగాల్లో అంతా తానై వ్యవహరించారు. తన ఆరోగ్యం దెబ్బతినేంత వరకు మూడు సినిమాలు-ఆరు ఫిలిం ఫెస్టివల్స్, రెండు కవితలు-నాలుగు సంపుటాలుగా ప్రదర్శన సాగింది. 2014లో రెండు కిడ్నీలు ఫెయిల్ అయి ఆనంద్ ఆరోగ్యం దెబ్బతింది. అది డయాలసిస్‌కు, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు దారితీసింది. ఆ కాలం నరకానికి నకలు లాంటిది. ఆయన సహచరి ఇందిర తన కిడ్నీని ఇచ్చి పునర్జన్మ ప్రసాదించింది.


రైటర్, జర్నలిస్టు, ఫిలిం మేకర్, ఆర్గనైజర్ లైబ్రేరియన్, డాక్యుమెంటరీ రైటర్, డైరెక్టర్ ఇలా బహుముఖాలుగా ఆనంద్ విస్తరించాడు. పురానీ ఫిల్మోంకే గీత్, ఆప్‌హీకే గీత్, బినాకాగీత్‌మాలా లాంటి హిందీ పాటల ప్రోగ్రాంలు ఆనంద్‌కు ఇష్టం. వాటి ప్రభావంతోనే పుస్తకానికి “యాదోంకీ బారాత్” పేరు పెట్టాడు. బొమ్మల కొలువు, జాతర, పురుడు లాంటి విశేషాల్ని సంస్కృతి చిత్రణలో భాగంగా చిత్రిక పట్టాడు. యాదోంకీ బారాత్ అనేది రచయిత విడుదల చేసిన శ్వేతపత్రం. అది అతని జీవిత దర్పణం.

గొర్రెతోక బెత్తెడే ..!

ముడిచిన మెట్ట .. ముక్కున కమ్మి
పాలె మొలతాడు.. బద్దల గిడుగూ
గొర్రెలమందలో వాడో గొర్రె కలసిపోతాడు
ఆకాశాన్ని పచ్చడం జేసీ
బరికమ్మ పరుపుల మీద దొర్లీ దొర్లీ ..
పోగేసిన పింద్రికల పెంట మీంచి
పొద్దుకు ఆహ్వానం పలుకుతాడు!
మట్టిబెడ్డల పొక్కళ్లపొయ్యి మీద ఎసరై మరిగీ ..
దానిగర్రలో చల్లారిన చెమటను
అంకుడాకుదొన్నలో జావజేసి తాగుతాడు
రాత్రంతా కంటికొమ్మల మీద వాలిన
కునుకుపిట్టను తోలీ
మందచుట్టూ కోరడిలా ప్రాణాలు పాతిన కోనారి
ఆకాశానికి దాపేసి రెక్కల దొనిగర్రతో మబ్బుల్ని తెంపి
మందకు మేతేస్తాడు !
ఎండముళ్లు గుచ్చుకుంటున్నా ..
శీతగాలి కమ్మకత్తై కోతపెడుతున్నా ..
మందసారాన్ని మట్టితల్లికి అందిస్తాడు
బగాదిపెట్టి పిడుగులు పడుతున్నా ..
కప్పుకున్న తట్టకమ్మలోంచి నీటిమొక్కై మొలుచుకొస్తాడు
కళ్లంపెండిని మంద మేసిందనీ
నాయుడు కొట్టిన కొరడా దెబ్బలకి
కనిపించే చుక్కల్ని కళ్లంట రాల్చుకొన్న ఎర్రిబాగులోడు!
మన్నెంకని మేకలమందతో అడివిపట్టీసి
ఇటికీపున్నమికి ఏడాదైనా ..
పిక్కరోడు మీద దేల బోయినపుడు
చంకనెత్తుకున్న గొర్రెపిల్లలో కొడుకుని జూసుకుంటాడు
టిర్.. టిర్.. అంటూ
పగలంతా నాయుడోళ్ల పొలాలమీద మందాసీ ..
పొద్దు వాలాక ముత్తుంగింజల బత్తెం కోసం
వాళ్ల మునివాకిట బేపిలా ఎదురుజూస్తే ..
గావంచాన రాలేవి సోలడు గింజలే
వాళ్ల పండగ పబ్బాల్లో
గుండెల్ని తప్పెటగుళ్ల జేసీ ఎంత బాదుకున్నా
గొల్లోడి బతుకు గొర్రెతోక బెత్తెడే ..!
మాయదారి రోగమేదో మబ్బై ముసిరి
మందను మింగేస్తే .. వాడు
ఓ తప్పిపోయిన గొర్రెపిల్లై తల్లడిల్లుతుంటాడు !!

- సిరికి స్వామినాయుడు, 9494010330

మట్టిలో మరణం లేని జీవం



గతలో చేసిన పోరాటాలు
చరిత్రలుగా జ్ఞాపకాలుగా గుర్తుకొస్తాయి
ప్రాణ త్యాగ పోరాటాలు
నేడు చేసిన ఉద్యమాలు రేపటికి చరిత్రలు
సృజనాత్మక సృష్టి సేవలు
నేలపై మిగిలిపోయే జ్ఞాపకాలు
మనసుల హృదయాలు
కదిలించిన ఉద్యమాలు
మరణం లేని ఉద్యమాలు
చూసినా నేత్రాం చదివినా వాయి
కథలుగా కవితలుగా వ్యాసాలుగా
పద్యాలుగా పాటలుగా
బుర్ర కథలుగా ఒగ్గు కథలుగా
చరిత్రలుగా చెప్తుంటారు
ప్రజాసేవ, రాజకీయ జనసేవ
వీర సేవలు వీర చరిత్రలు
మట్టిలో మరణం లేని జీవం

- దేవరపాగ కష్టయ్య, 9963449579

సాహితీ వార్తలు

కుడికాల వంశీధర్ ‘లోపలి వాన’ ఆవిష్కరణ

కుడికాల వంశీధర్ రచించిన ‘లోపలి వాన’ కవితా సంపుటి ఆవిష్కరణ సభ ఈ నెల 29న ఉదయం 10 గంటలకు రవీంద్రభారతి సమావేశ మందిరం (మొదటి అంతస్తు), హైదరాబాద్‌లో జరుగుతుంది. ఈ సభకు డా. ఎన్.గోపి ఆచార్య సూర్యా ధనుంజయ్, డా. ఎస్. రఘు, డా. గిన్నారపు ఆది నారాయణ మద్దాళి రఘురాం హాజరవుతారు.

- మద్దాళి రఘురాం, కుడికాల వంశీధర్

బాలల సాంస్కృతికోత్సవం

తెలంగాణ సారస్వత పరిషత్తు నిర్వహించే సాంస్కృతికోత్సవం కోసం రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు, సృజనాత్మక రచన అధ్యయన శిబిరాలు జరుగుతాయి. వివిధ రంగాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో అద్భుతాలు సష్టించి ప్రతిష్టాత్మక పురస్కారాలు అందుకున్న బాల మేధావులు తమ అనుభవాలు పంచుకుని తోటి విద్యార్థులకు ప్రేరణ కలిగిస్తారు. రెండు రకాలుగా నిర్వహించే మొదటి పోటీలో విద్యార్థులు రెండు పేజీలకు మించకుండా కథ, 20 పంక్తులకు మించకుండా ఏదేని అంశంపై వచన కవిత, ఐదు పద్యాలకు మించకుండా పద్య కవితా పోటీకి రాసి పంపాలి. చిత్రలేఖనం గీసి పంపవచ్చు. చిరునామా: తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్డు, ఆబిడ్స్, హైదరాబాద్. రెండోది ఉత్సవం రోజున కూడా అప్పటికప్పుడు ఏకపాత్రాభినయ పోటీ, దేశభక్తి, లలిత గీతాలాపన పోటీ,వ్యాసరచన, వక్తత్వం, పుస్తక సమీక్ష పోటీలు ఉంటాయి.విద్యార్థులు 9603727234 నెంబర్‌కు తమ పేరు, తరగతి, పాఠశాల, ఊరి పేరు ఇతర వివరాలను పంపాలి. ప్రతినిధులుగా పాల్గొనేవారు, పోటీల్లో పాల్గొనేవారు అక్టోబర్ 10వ తేదీలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలి.

- డాక్టర్ జె. చెన్నయ్య

సాంకేతిక పరిజ్ఞానంతో మరమ్మతులు పూర్తి చేయాలి

- సాగు నీరు విడుదల చేసి పంటలను కాపాడాలి
- తెలంగాణ రైతు సంఘం, సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పాలేరు రిజర్వాయర్ కాలువ గండ్ల వద్ద రైతుల నిరసన
- పంటలు ఎండిపోవడానికి అధికారులతో పాటు నలుగురు మంత్రులూ బాధ్యత వహించాలి : తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు



నవతెలంగాణ - కూసుమంచి

ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్ కింది భాగంలో సాగర్ ఎడమ కాల్వకు పడ్డ గండ్లను సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి మరమ్మతులు వెంటనే పూర్తి చేసి, రెండు లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోకుండా కాపాడాలని రైతులు డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు సాగర్ ఎడమ కాల్వకు పడ్డ గండ్లకు మరమ్మతులు చేసినా మళ్లీ శనివారం గండి పడింది. దాంతో ఆ ప్రదేశంలో సీపీఐ(ఎం), తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్ మాట్లాడారు. ఆగస్టు 31, సెప్టెంబర్1 తేదీల్లో కురిసిన అతి భారీ వర్షాలకు సాగర్ ఎడమ కాలువకు పడ్డ గండ్లను అధికారులు సకాలంలో స్పందించక పోవడం వల్ల మరమ్మతులు ఆలస్యంగా మొదలు పెట్టారన్నారు. అలస్యంగా ప్రారంభించిన పనులు హడావుడిగా పూర్తి చేసి సాగర్ జలాలు విడుదల చేయడంతో, మళ్లీ అక్కడే గండి పడిందని తెలిపారు. దీనిపై జిల్లా ఇన్‌చార్జి మంత్రితో సహా జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు స్పందించాలని డిమాండ్ చేశారు. గండ్ల మరమ్మతు పనులను, నాణ్యతను మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షించకపోవడం వల్లే రెండవ సారి గండి పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగర్ ఆయకట్టు పరిధిలో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు నష్టం జరగకుండా యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, ఉపాధ్యక్షులు తాతా భాస్కర్ రావు, చింతనిప్పు చలపతిరావు వాసిరెడ్డి ప్రసాద్, గోడవర్తి నాగేశ్వరరావు, ఎస్‌కె మీరా, పార్టీ మండల కార్యదర్శి యడవల్లి రమణారెడ్డి, రైతు సంఘం మండల అధ్యక్షులు తోటకూర రాజు, కార్యదర్శి బిక్కసాని గంగాధర్, జిల్లా నాయకులు, మండల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మొదటి అలైన్‌మెంట్ ప్రకారమే ట్రిబుల్‌ఆర్ భూసేకరణ

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడారు. పవర్‌లూమ్‌ల కరెంటు చార్జీలను ప్రభుత్వం రూ.రెండు నుంచి రూ.10లకు పెంచిందని వివరించారు. పదేండ్ల నుంచి బకాయిలు కట్టాలంటున్నారని పేర్కొన్నారు. దానివల్ల పవర్‌లూమ్‌లు మూతపడ్డాయనీ, 30 వేల మంది కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. వాటికి కరెంట్ రాయితీని కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలోలాగా యూనిట్‌కు రూ.రెండు వసూలు చేసి, కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో హన్మకొండ జిల్లా కాకతీయ విశ్వవిద్యాలయానికి ఆనుకుని టీచర్లు, కాంట్రాక్టు కార్మికులు, ఆటో డ్రైవర్లు 40 ఏండ్లుగా నివసిస్తున్నారని తెలిపారు. అది కాకతీయ వర్సిటీకి సంబంధించిన స్థలమనే పేరుతో ఆ ఇండ్లను కూలుస్తామంటూ మున్సిపల్ అధికారులు బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. ఇది వారి ప్రయివేటు స్థలమనీ, వర్సిటీకి సంబంధం లేదని తెలిపారు. కాబట్టి సాధారణ ఉద్యోగులు, కార్మికుల ఇండ్లను కూల్చొద్దనీ, వాటిని పరిరక్షించాలని కోరారు. మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిల సమక్షంలో ఈ సమస్యను పరిశీలిస్తామంటూ సీఎం హామీ ఇచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కొంత మంది జర్నలిస్టులకు ప్రభుత్వం ఇండ్ల స్థలాలు ఇచ్చిందనీ, దాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. అయితే కొంత మంది సీనియర్ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు రావడం లేదని తెలిపారు. ప్రభుత్వం ఒక సొసైటీకి భూమి ఇచ్చిందని వివరించారు. ఆ సొసైటీలో లేని సీనియర్ జర్నలిస్టులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. సీనియర్లు నష్టపోకుండా తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జూబ్లీహిల్స్ సొసైటీలో ఎక్కువ మంది సీనియర్లున్నారని వివరించారు. ప్రభుత్వం ఇచ్చే ఇండ్ల స్థలాల్లో ఏ సొసైటీలో ఉన్నా సీనియర్ జర్నలిస్టులకు భూమిని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సీనియర్లకు నష్టం జరగకుండా చూడాలని తెలిపారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని పేర్కొన్నారు. ఆ సమస్యను పరిశీలించాలంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని సీఎం కోరారు.

లెప్రసీ సర్వే డబ్బులేవీ..?

ఇచ్చామంటున్న వైద్యారోగ్యశాఖ

- రాలేదంటున్న డీఎంఅండ్‌హెచ్‌ఓలు
- ఆందోళనకు సిద్ధమవుతున్న ఆశాలు
- ఇప్పటికే వినతిపత్రాలు అందజేత

నవతెలంగాణ-సిటీబ్యూరో

కుష్టు వ్యాధి రోగులను గుర్తించేందుకు ఆశాలు రెండు సార్లు సర్వే చేశారు. ఇందు కోసం రావాల్సిన నిధుల విషయంలో సందిగ్ధం నెలకొంది. నిధులను ఆయా జిల్లాలకు విడుదల చేశామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖాధికారులు చెబుతుంటే.. సదరు నిధులు తమకు రాలేదని జిల్లా అధికారులు చెబుతున్నారు. దాంతో సర్వే చేసిన ఆశా కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఇప్పటికే జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేసిన యూనియన్లు ఆందోళనకు రెడీ అవుతున్నాయి.

క్షేత్రస్థాయిలో విధులు

ఆశాలు క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించి లెప్రసీ సర్వే చేశారు. ఆత్యవసరమైతే తప్ప సెలవు తీసుకోరాదనీ, సర్వేలో కచ్చితంగా పాల్గొనాలనీ, పకడ్బందీగా చేయాలనీ, ఎక్కడ తప్పులు దొరదొర్లినా చర్యలు తీసుకుంటామనీ, నిర్దిష్ట ఫార్మెట్, నిర్దిష్ట కాలంలో సర్వే పూర్తి చేయాలని సర్కార్ ఆశాలకు అనేక కఠిన నిబంధనలను విధించింది. అయినా ఆశాలు వారి విధులను వారు సమర్థంతంగా నిర్వర్తించి



తక్కువ సమయంలోనే సర్వే పూర్తి చేశారు. ఇంత నిబద్ధతతో పని చేసినా.. డబ్బుల చెల్లింపులో మాత్రం సందిగ్ధం నెలకొన్నది. సర్వేలో పాల్గొన్న ఒక్కో ఆశాకు రెండుసార్లకు కలిపి దాదాపు రూ.2,800 వరకు రావాల్సి ఉన్నా నేటికీ అందలేదు. జిల్లాలకు ఇచ్చామని వైద్య, ఆరోగ్యశాఖ చెబుతుంటే.. తమకు డబ్బులు రాలేదనీ, కేవలం వర్క్ ఆర్డర్ మాత్రమే వచ్చిందని డీఎంఅండ్‌హెచ్‌ఓలు చెబుతున్నారు.

రెండుసార్లు సర్వే

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రాష్ట్రంలో కుష్టు రోగులను గుర్తించేందుకు ప్రత్యేక సర్వే చేపట్టారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో 2023లో ఆగస్టు 18 నుంచి 31వ తేదీ వరకు 13 రోజులపాటు మొదటి సర్వే జరిగింది. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా 26,673 మంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అన్ని ఖర్చులు కలుపుకుని ఒక్కో ఆశా కార్యకర్తకు రూ.1,407 చొప్పున చెల్లించడానికి రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం రూ.3,75,47,050 నిధులను కేటాయిస్తూ కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారులు 2023 జులై 17వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. అంటే సర్వేకు ముందుగానే ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ ఏడాది మార్చి 11 నుంచి 24వ తేదీ వరకు రెండోసారి సర్వే జరిగింది. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా 28,160 మంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. వీరికి ఒక్కొక్కరికి రూ.1,400 చొప్పున చెల్లించడానికి రాష్ట్ర వ్యాప్తంగా రూ.3,94,24,100 నిధులు కేటాయిస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 5వ తేదీన ఉత్తర్వులు వెలువడ్డాయి. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం చూస్తే.. సర్వేకు ముందుగానే రెండు సార్లు నిధుల కేటాయింపులు జరిగినట్టు తెలుస్తోంది. ఆ మేరకు ఆయా జిల్లాల వారీగా సర్వేలో పాల్గొనే ఆశా కార్యకర్త, వారికి చెల్లింపులు, అవసరమైన నిధుల వంటి పూర్తి వివరాలను పేర్కొంటూ జిల్లా వైద్యాధికారులకు ఉత్తర్వులు వచ్చాయి. ఇందులో భాగంగానే హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోనూ రెండు సర్వేలు జరిగాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొదటిసారి జరిగిన సర్వేలో 299 మంది ఆశాలు పాల్గొన్నారు. వీరి కోసం రూ.4,20,693 నిధులు కేటాయించారు. రెండో సర్వేలో 1,273 మంది ఆశాలు పాల్గొన్నారు. వీరికి కోసం రూ.17,82,200 కేటాయించారు. హైదరాబాద్ జిల్లాలో రెండు సర్వేల్లో 1,913 మంది ఆశాలు సర్వేలో పాల్గొన్నారు. వీరి కోసం రూ.25,35,450 కేటాయించారు. కానీ ఇప్పటి వరకు ఈ డబ్బులు ఆశాలకు అందకపోవడం గమనార్హం.

ఆశాలకు అన్యాయం



కష్టపడి పని చేసిన ఆశాలకు వైద్య, ఆరోగ్యశాఖ, డీఎంఅండ్‌హెచ్‌ఓలు అన్యాయం చేస్తున్నారు. లెప్రసీ సర్వే డబ్బులు ఇచ్చామని హెల్త్ కమిషనర్ చెబుతుంటే.. డీఎంఅండ్‌హెచ్‌ఓ మాత్రం తమకు రాలేదని చెబుతున్నారు. ఇద్దరిలో ఎవరు చెప్పింది నిజం అనుకోవాలి. మొత్తానికి ఆశాలను తప్పుదోవ పట్టిస్తున్నారు. కొన్ని జిల్లాల్లో ఇచ్చి మరికొన్ని జిల్లాల్లో ఇవ్వకపోడం ఏమిటి..? సరైన సమాధానం రావడం లేదు. ఇప్పటికైనా స్పందించి ఆశాలకు రావాల్సిన సర్వే డబ్బులను వెంటనే చెల్లించాలి.

- వెంకటేశ్, సీఐటీయూ, సెంట్రల్ సిటీ కార్యదర్శి

ఫిక్సిడ్ వేతనం అమలు చేయాలి



ఆశాలకు 20 పనులకు పారితోషికం ఇస్తూ 40-45 రకాల పనులు చేయిస్తున్నారు. దారణమైన ఈ పద్ధతిని ఆపి వెంటనే ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి. 2023-24లో చేసిన లెప్రసీ సర్వే డబ్బులను ఇప్పటి వరకు ఇవ్వకపోవడం అన్యాయం.వెంటనే చెల్లించాలి. ఇలాంటి సర్వేలకు సంబంధించిన గతంలో కూడా చాలా వరకు డబ్బులు రావాల్సి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి. లేదంటే ఆందోళనలకు రెడీ అవుతాం.

- ఉన్నికృష్ణ, సీఐటీయూ, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోశాధికారి

సేవ్ దామగుండం

(మొదటిపేజీ తరువాయి)

ఈసీ, కాగ్నా నదుల పుట్టుకకు కారణమైన వికారాబాద్ అడవులనే నరికివేస్తే మూసీ నది పరివాహక అభివృద్ధి ఎలా సాధ్యమని నిలదీశారు. జర్నలిస్టు తులసీ చంద్ మాట్లాడుతూ.. చిప్కో తరహాలో పర్యావరణ ప్రేమికులంతా దామగుండం తరలి చెట్ల నరికివేతను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. అడవి చుట్టూ మానవహారం నిర్వహిస్తామన్నారు. 2900 ఎకరాలను రాడార్ కేంద్రం కోసం కేటాయించారనీ, అందులో 1400 ఎకరాల్లో టవర్ పార్కును నిర్వహించబోతున్నారని తెలిపారు. దీని వల్ల 60 వేల మంది జీవనోపాధిని కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. పశువుల కాపరులు అడవిలో మేపడం వల్లనే అడవులు ధ్వంసం అవుతున్నాయనీ, టవర్లు వేస్తే వచ్చే నష్టం ఏంటని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అనటాన్ని తప్పుబట్టారు. సత్యానందస్వామిజీ మాట్లాడుతూ.. 2,713 ఎకరాల రామలింగేశ్వర స్వామి దేవాలయ భూమిని నిబంధనలకు విరుద్ధంగా అటవీశాఖకు ఎలా బదిలీ చేశారు? దేవాలయాల భూములను ఇతర అవసరాల కోసం వాడొద్దన్న సుప్రీం కోర్టు తీర్పును ఎందుకు పరిగణనలోకి తీసుకోవడం లేదని ప్రశ్నించారు. దామగుండం అడవిని రక్షించాలని కిషన్‌రెడ్డినీ, బీజేపీ ఎంపీలను కలిసినా, ప్రధానికి లేఖలు రాసినా పట్టించుకున్న పాపాన పోలేదనీ, హిందూత్వ పేరుతో ఓట్లు అడగడం తప్ప వారికి ప్రజల బాధలు పట్టవని విమర్శించారు. ఒక నెమలికి గింజలు వేస్తూ ఫొటోలకు ఫోజులిచ్చే ప్రధాని మోడీకి ఇక్కడ అడవి నరికివేతతో వేలాది నెమళ్లు చనిపోతాయనే సోయి లేదా? అని ప్రశ్నించారు. జలసాధన సమితి ఫౌండర్ దుశ్చర్ల సత్యనారాయణ మాట్లాడుతూ.. మేకలు, బర్రెలు, గొర్రెలు అడవుల్లో మేయకుంటే కార్పొరేట్ ఆఫీసులకెళ్లి మేస్తాయా? అని ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డిని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తాము ఏమి చేసినా చెల్లుతుందనేది పాలకుల అవివేకమనీ, గొప్పోళ్లయిన ప్రజలు వారికి తప్పకుండా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. జేఏసీ నాయకులు గీత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సినీ నిర్మాత, దర్శకులు తమ్మారెడ్డి భరద్వాజ, పీఓడబ్ల్యూ జాతీయ నాయకులు వి.సంధ్య, అరుణోదయ నాయకులు విమలక్క, పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేశ్, పూడూరు మాజీ సర్పంచి లక్ష్మయ్య తదితరులు సేవ్ దామగుండం పోరాటానికి మద్దతు తెలిపి మాట్లాడారు.

అమృత్ టెండర్లపై తప్పుడు ప్రచారంమానుకోండి

- బీఆర్ఎస్ నేతలకు చనగాని దయాకర్ హెచ్చరిక

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అమృత్ టెండర్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ బదనాం చేసే చర్యలకు పూనుకున్నదని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ విమర్శించారు.అనవసరంగా తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని ఒక ప్రకటనలో హెచ్చరించారు. హైదరాబాద్ చుట్టూ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను, చెరువులు, కుంటలను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలకు పాల్పడారని ఆరోపించారు.వరదలకు హైడ్రాబాద్ కాలనీ వాసులు నీట మునిగి ఇబ్బందులకు గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వం వచ్చాక సీఎం రేవంత్ రెడ్డి హైడ్రాబాద్ ముఖ చిత్రం ధ్వంసం అవుతున్న నేపథ్యంలో ప్రాభుత్యం హైడ్రాను ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు సీఎం తపిస్తుంటే, బీఆర్ఎస్ పింక్ మీడియా హద్దులు దాటి వ్యవహరిస్తున్నదని చెప్పారు.ఆ టెండర్లతో కేటీఆర్ సన్నిహిత బినామీ మిత్రులు నష్టపోయారని ఎద్దేవా చేశారు. ఆ ఆవేదనతోనే కేటీఆర్ ప్రభుత్వంపై అజ్ఞానిగా మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు.

శ్రీలంకలో ఎగిరిన ఎర్రజెండా



(ఫైల్)

(మొదటిపేజీ తరువాయి)

లెక్కింపు తర్వాత దిసనాయకె తిరుగులేని ఆధిక్యత సాధించినట్టు ఎన్నికల సంఘం చైర్మెన్ ఆర్ ఎల్ ఎం రత్నాయకె ప్రకటించారు. శనివారం జరిగిన ఎన్నికల్లో 70 శాతానికిపైగా ఓట్లు పోలయ్యాయి.

ఎవరీ దిసనాయకే..?

విద్యార్థి నేతగా మొదలై.. దేశాధినేత వరకు ఎదిగిన దిసనాయకే శ్రీలంక రాజకీయాల్లో ఓ సంచలనం. 1968 నవంబర్ 24న కొలంబోకు 100 కి.మీల దూరంలో ఉన్న తంబుట్టెగామలో కార్మిక కుటుంబంలో ఆయన జన్మించారు. స్థానికంగానే పాఠశాల విద్యనభ్యసించిన దిసనాయకే.. తమ గ్రామం నుంచి యూనివర్సిటీలో ప్రవేశం పొందిన తొలి విద్యార్థి కావడం విశేషం. తొలుత పెరదేనియా విశ్వవిద్యాలయంలో చేరగా.. రాజకీయ సిద్ధాంతాల కారణంగా ఎదురైన బెదిరింపులతో కెలానియా విశ్వవిద్యాలయానికి బదిలీ అయినట్టు గతంలో ఆయన ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. బ్యాచిలర్ ఆఫ్ సైన్స్‌లో గ్రాడ్యుయేట్ పట్టా అందుకున్న ఆయన.. ఆ తర్వాత సోషలిస్టు స్టూడెంట్స్ అసోసియేషన్‌లో చేరి విద్యార్థి రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించారు.

రాజకీయ జీవితం ఇలా..

1987లో మార్క్సిస్టు ప్రభావిత జనతా విముక్తి పెరమునా (జేవీపీ)లో చేరిన దిసనాయకే.. రాజకీయ జీవితానికి పునాది నిర్మించుకున్నారు. 1998 నాటికి జేవీపీ నిర్ణయాధికార విభాగం పొలిట్‌బ్యూరోలో చోటు దక్కించుకున్నారు. 2000లో ఎంపీ అయిన దిసనాయకే.. 2004లో శ్రీలంక ఫ్రీడమ్ పార్టీతో కలిసి జేఎస్‌పీ ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. చంద్రికా కుమారతుంగ ప్రభుత్వంలో ఆనాడు వ్యవసాయ, నీటిపారుదల శాఖ మంత్రిగా సేవలందించారు. 2005లో సునామీ సహాయక సమన్వయం కోసం ప్రభుత్వం, ఎల్‌టీటీఈ మధ్య ఉమ్మడి ఒప్పందంపై అంగీకారం కుదరకపోవడంతో తలెత్తిన విభేదాలతో మంత్రి పదవికి రాజీనామా చేశారు.

అవినీతిపై వ్యతిరేక పోరాట గళం

శ్రీలంకలో 2022లో తలెత్తిన ఆర్థిక సంక్షోభం తర్వాత ప్రజల అసంతృప్తిని ఆయుధంగా మలచుకొని సమర శంఖం పూరించారు. మార్పు, అవినీతి వ్యతిరేక సమాజ నిర్మాణం వంటి నినాదాలతో విస్తృతంగా ప్రచారం చేసి అపూర్వ జనాదరణ పొందారు. వ్యవస్థాగత మార్పు కోసం నినదించారు. ఎన్నికల ప్రసంగాల్లో గత పాలకుల అవినీతి, వైఫల్యాలను ఎత్తిచూపుతూనే.. జవాబుదారీతనం ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఆర్థిక సంక్షోభానికి మూల కారణాలను పరిష్కరించడంలో గత పాలకుల వైఫల్యాలను ఎత్తి చూపారు. అంతేకాకుండా తమ పార్టీ మేనిఫెస్టోలో విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ప్రజారోగ్యానికి పెద్ద పీట వేయడంతో పాటు అనేక ప్రజా సంక్షేమ విధానాలతో ప్రజల్ని తన వైపు ఆకట్టుకోవడంలో విజయవంతమయ్యారు. శ్రీలంక ఆర్థిక సంక్షోభం, రాజపక్సే రాజీనామా వంటి పరిణామాలతో ఏర్పడిన నాయకత్వ శూన్యత, ప్రజల్లో నిరుత్సాహం కమ్ముకొని ఉన్న పరిస్థితుల్లో వ్యవస్థలో మార్పు రావాలని కోరుకుంటున్న యువతను.. అవినీతి వ్యతిరేక వైఖరితో ఆకట్టుకోవడంలో దిసనాయకే విజయం సాధించారు.

ప్రజలను ఏకతాటిపైకి తెచ్చిన 'గద్దర్' గానాలు

ఎమ్మెల్సీ, టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం ప్రజాకవి గద్దర్ సంస్మరణ సభ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ప్రజా కవి, యుద్ధ నౌక గద్దర్ పాడిన పాటలు ప్రజలను ఆలోచింపజేసి వారిని ఏకతాటిపైకి తీసుకురావడంలో కీలక భూమిక పోషించాయని ఎమ్మెల్సీ, టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఆదివారం ఎస్టీయూ భవన్‌లో యుద్ధనౌక, ప్రజాకవి గద్దర్, సియాసత్ ఎడిటర్ జహీరోద్దీన్ ఆలీ ఖాన్ సంస్మరణ సభను నిర్వహించారు. దీనికి గద్దర్ కుమార్తె వెన్నెల, జహీరోద్దీన్ కుమారుడు ఫఖర్ అలీఖాన్‌తో కలిసి కోదండరామ్ హాజరయ్యారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కళాకారులు గద్దర్ గురించి పాటలు పాడారు. గద్దర్ కుమార్తె వెన్నెల తన ప్రసంగం అనంతరం పాటలు పాడి ప్రజలను ఉత్సాహపరిచారు. అనంతరం కోదండరాం మాట్లాడుతూ.. స్వరాష్ట్రం కోసం అన్ని వర్గాల వారిని మమేకం చేయడంలో గద్దర్ పాటలు ఎంతో దోహదం చేశాయన్నారు. తన కోసం కాకుండా ప్రజల కోసం పోరాటం చేసిన వ్యక్తులను సమాజం గుర్తుంచుకుంటుందన్నారు. ఆత్మగౌరవ తెలంగాణ పోరాటంతో పాటు బడుగు, బలహీన వర్గాల సమస్యలపై తన పాటల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేశారని తెలిపారు. తల్లి నుంచి పాటలు నేర్చుకొని అనేక ఉద్యమాల్లో కీలకంగా వ్యవహరించారని గుర్తు చేశారు. గద్దర్ కుమార్తె వెన్నెల మాట్లాడుతూ.. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం.. వారిని చైతన్యపరడానికి తన తండ్రి పాటలు రచించి పాడారన్నారు. నీడని నమ్మని సమాజంలో జహీరోద్దీన్ అలీ ఖాన్‌ను గద్దర్ నమ్మేవారని గుర్తుచేశారు. ఇంటి నుంచి నిరుత్సాహంగా జహీరోద్దీన్ వద్దకు వెళ్లినా సంతోషంగా తిరిగి వచ్చేవారని తెలిపారు. ఇద్దరూ వేరే వేరే రంగాల్లో ఉన్నా వారిని కలిపింది ప్రజా సమస్యలేనని చెప్పారు. ప్రజల కోసం పాటల ద్వారా గద్దర్ ఉద్యమిస్తే, నిశ్శబ్దంగా వెనక నుంచి పేదలకు, ఉద్యమకారులకు జహీరోద్దీన్ అలీఖాన్ సహకారం ఇచ్చే వారని గుర్తు చేశారు. మహనీయుల ఆశయాలను కొనసాగించాలంటే చదువు తప్పకుండా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసీ నాయకులు మండల భాస్కర్, దరువు ఎల్లన్న, దుర్గం భాస్కర్, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి, టీఎన్జీఓఎస్ అధ్యక్షులు అశోక్, సంస్మరణ సభ ఆహ్వాన కమిటీ సభ్యులు సొగల సుదర్శన్, అశోక్, పరమేశ్వర్, సత్యవాన్, అర్పత్ ఖాన్, ప్రశాంత్, నేతాకాని మహార్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

అప్పుల ఊబిలో సిరిసిల్ల సెస్

14 ఏండ్లుగా పేరుకుపోతున్న మరమగ్గాల విద్యుత్ సబ్సిడీ బకాయిలు సిరిసిల్ల సెస్‌ను కుదిపేస్తున్నాయి. రాష్ట్రంలో మరమగ్గాల విద్యుత్ సబ్సిడీ బకాయిలు రూ. 237 కోట్లు పేరుకుపోయి.. రాష్ట్రంలోని మరమగ్గాల్లో 75శాతం సిరిసిల్ల సెస్ పరిధిలోనే ఉండటంతో అంతర్జాతీయ గుర్తింపు పొందిన సంస్థ నేడు అప్పుల ఊబిలోకి కూరుకుపోతోంది. ప్రభుత్వాల నిర్లక్ష్యంతో 2.72 లక్షల మంది వినియోగదారులకు సేవలందిస్తున్న సెస్ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. రాష్ట్రంలోని 40 వేల మరమగ్గాల్లో 30 వేలు సిరిసిల్లలోనే ఉండగా.. గ్రామీణ విద్యుదీకరణలో అద్భుత ఘనత సాధించిన సెస్‌కు తాజా పరిణామాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.



- మరమగ్గాల విద్యుత్ సబ్సిడీ బకాయిలు రూ.237 కోట్లు
- 14ఏండ్లుగా చెల్లించని ప్రభుత్వాలు
- సెస్‌కు రావాల్సింది రూ.127 కోట్లు
- రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలకు రూ.110 కోట్లు
- 40 వేల మరమగ్గాల్లో 30 వేలు సిరిసిల్లలోనే..

నవతెలంగాణ-సిరిసిల్ల

రాష్ట్రంలో మరమగ్గాల విద్యుత్ సబ్సిడీ బకాయిలు భారీగా పేరుకుపోయాయి. 14 ఏండ్లుగా ప్రభుత్వం చెల్లించని సబ్సిడీ మొత్తం రూ. 237 కోట్లకు చేరింది. ఈ భారీ మొత్తంలో సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘానికి (సెస్) రావాల్సింది రూ. 127 కోట్లు కాగా, రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలకు చెందినది రూ. 110 కోట్లు ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మరమగ్గాలకు 50 శాతం విద్యుత్ సబ్సిడీని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అయితే ఆ సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం చెల్లించకపోగా నేటికీ బకాయిలు కుదిబండలా మారాయి. దాంతో ట్రాన్స్‌కోతో పాటు రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని సహకార విద్యుత్ సరఫరా సంఘానికి భారీ మొత్తంలో నష్టం వాటిల్లింది.

గ్రామీణ విద్యుద్దీకరణలో అంతర్జాతీయ గుర్తింపు పొందిన సిరిసిల్ల సెస్ 1970 నవంబర్ 1న ప్రారంభమైంది. అప్పటి ఎమ్మెల్యే చెన్నమనేని రాజేశ్వరరావు చేతుల మీదుగా ఈ సంస్థ ఆవిర్భవించింది. ప్రారంభంలో 46 గ్రామాల్లోని 4,720 మంది వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేసిన సెస్, నేడు 2.72 లక్షల మందికి సేవలందిస్తోంది. ప్రస్తుతం సెస్ పరిధిలో సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి, మానకొండూరు నియోజకవర్గాలున్నాయి. 13 మండలాల్లోని 255 గ్రామ పంచాయతీల్లో సేవలందిస్తోంది. కాగా, 2004 నుంచి 2009 వరకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి మాత్రమే 50 శాతం మరమగ్గాలకు విద్యుత్ సబ్సిడీ మొత్తాన్ని విడుదల చేశారు. ఆ తర్వాత 2010లో రోశయ్య అనంతరం కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్న సమయంలో విద్యుత్ సబ్సిడీ నిధులు రాలేదు. 2014నుంచి 2023 వరకు తెలంగాణ రాష్ట్ర సమితి పరిపాలన సాగించినా, అప్పటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు కూడా ఈ బకాయిలను చెల్లించలేకపోయారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా 10నెలలు గడిచినా ఈ విషయంలో చొరవ చూపలేదు.

రాష్ట్రవ్యాప్తంగా 40వేల మరమగ్గాలు ఉండగా, ఒక్క సిరిసిల్ల జిల్లాలోనే 30వేల మరమగ్గాలు ఉన్నాయి. సిరిసిల్ల ప్రాంతంలో ట్రాన్స్‌కో కాకుండా సెస్ ఉండటంతో సంబంధిత సెస్‌కు రూ.97 కోట్లు మరమగ్గాల విద్యుత్ సబ్సిడీ బకాయిలు రావాల్సి ఉండగా, రూ. 30 కోట్ల వరకు ఆ విద్యుత్ బకాయిలపై సర్‌చార్జీలు కూడా చేరాయి. సెస్ ట్రాన్స్‌కో నుంచి విద్యుత్ కొనుగోలు చేసి ట్రాన్స్‌కోకు డబ్బులు చెల్లిస్తున్నది. అంతేకాకుండా విద్యుత్ బిల్లులు బకాయి పడితే సర్‌చార్జీలు కూడా చెల్లిస్తోంది. కానీ ప్రభుత్వాలు మాత్రం సెస్‌కు మరమగ్గాల 50శాతం విద్యుత్ సబ్సిడీ బకాయిలు చెల్లించడంలో వెనకడుగు వేస్తున్నాయి. దాంతో జిల్లాకు సంబంధించిన వినియోగదారుల డబ్బులతో నడుస్తున్న సెస్ అప్పుల ఊబిలో కూరుకుపోతోంది. గత ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యంతోనే సెస్ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని విద్యుత్ వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా బకాయిలో ఉన్న మరమగ్గాల 50శాతం విద్యుత్ సబ్సిడీ డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

పిడుగులుపడి ఇద్దరు మహిళలు మృతి

- నాగర్‌కర్నూల్, సంగారెడ్డి జిల్లాల్లో ఘటనలు





(ఫైల్)

నవతెలంగాణ-బిజినేపల్లి/న్యాల్‌కల్

ఉరుములు మెరుపులతో కురిసిన వర్షానికి పిడుగు పడి ఇద్దరు మహిళలు మృతిచెందిన ఘటనలు నాగర్‌కర్నూల్, సంగారెడ్డి జిల్లాలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం మమ్మాయిపల్లి గ్రామానికి చెందిన నక్క నీలమ్మ(40) రోజు మాదిరిగానే ఆదివారం బర్రెలను మేపుకోవడానికి వెళ్లింది. ఆ సమయంలో ఉరుములు మెరుపులతో కురిసిన వర్షానికి పిడుగుపడి ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ఆమెతో పాటు వెళ్లిన తన సోదరి నాగేంద్రమ్మ ఆ శబ్దానికి స్పృహ తప్పి పడిపోయింది. గమనించిన చుట్టుపక్కల వారు 108కు సమాచారం ఇవ్వగా.. ఆమెను ఆస్పత్రికి తరలించారు.

సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని న్యామతాబాద్ గ్రామానికి చెందిన బూచినేల్లి నాగమ్మ(41) శనివారం సాయంత్రం వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి బయల్దేరింది. అప్పటికే ఈదురుగాలులతో వర్షం మొదలయ్యాయి. దారి మధ్యలో ఒక్కసారిగా మెరుపులు వచ్చి ఆమెపై పిడుగు పడింది. నాగమ్మ అక్కడకక్కడే మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే హద్నూర్ పోలీసులు ఏఎస్ఐ ఇక్బాల్, ఆర్ఐ శ్యామ్‌రావు, స్థానిక గ్రామస్తులతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నాగమ్మ కుమారుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కొణిదెల చిరంజీవికి సీఎం అభినందనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రముఖ సినీ నటుడు కొణిదెల చిరంజీవికి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్‌లో చోటు దక్కడం తెలుగు వారంతా గర్వించదగ్గ విషయమని సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు. ఈ సందర్భంలో చిరంజీవికి ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.

తెలుగు చలనచిత్ర ప్రముఖ నటులు, కేంద్ర మాజీ మంత్రి చిరంజీవికి గిన్నీస్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కడం పట్ల టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వందలాది సినిమాల్లో అత్యుత్తమ నటనను ప్రదర్శించి మంచి డ్యాన్స్, ఫైట్స్ పర్ఫార్మెన్స్ చేసిన చిరంజీవికి గిన్నీస్ బుక్ గుర్తించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

పోరాటయోధుల విగ్రహాలను ట్యాంక్ బండ్‌పై ప్రతిష్టించాలి

సీఎంకు కూనంనేని లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్టించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సీఎంకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. మఖ్దూం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణ రెడ్డి వంటి యోధుల పేర్లు పోరాటంలో ముందు వరసలో ఉంటాయని పేర్కొన్నారు. వారితో పాటు తొలి అమరుడు దొడ్డి కొమురయ్య తదితర నాయకుల విగ్రహాలు ట్యాంక్‌బండ్ పెట్టడం ద్వారా ఆనాటి పోరాట స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయవచ్చునని తెలిపారు. ఇప్పటికే మఖ్దూంమొహియుద్దీన్ విగ్రహం ట్యాంక్ బండ్‌పై ఉన్నందున ఆ విగ్రహం ప్రక్కనే బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణ రెడ్డి విగ్రహాలు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. బొమ్మగాని ధర్మభిక్షం, ఆరుట్ల కమళాదేవి, మల్లు స్వరాజ్యం, భీరెడ్డి నర్సింహారెడ్డి, నలమల్ల గిరిప్రసాద్ తదితరులకు వారివారి ప్రాంతాలల్లో తగు గుర్తింపు ఉండే విధంగా, ఆయా జిల్లాల కూడలిలలో విగ్రహాలు ఏర్పాటు చేయాలని కోరారు. సెప్టెంబర్ 17ను "ప్రజా పరిపాలన" పేరుకు బదులుగా "విలీన దినోత్సవం"గా జరపాలని సూచించారు. ఆనాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, కమ్యూనిస్టుల త్యాగాలు, కాంగ్రెస్, సోషలిస్టుల అగ్రనాయకుల త్యాగాలను భావి తరాలకు తెలిపినట్టవుతుందని పేర్కొన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు తమకు అనుకూలంగా మల్చుకుంటున్నాయని గుర్తు చేశారు. 1948 సెప్టెంబర్ 17న ఇండియాలో తెలంగాణ ప్రాంతం విలీనం చేస్తూ "యాక్సెసెన్" అనే పదంతో అగ్రిమెంట్ జరిగిందని తెలిపారు. అందుకే విలీనం పేరుతో ఉత్సవాలు జరిపితే సబబుగా ఉంటుందని సూచించారు.

లడ్డు కల్తీపై విచారణ జరపాలి

టీపీసీసీ కార్యనిర్వాహణ అధ్యక్షులు జగ్గారెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తిరుమల, తిరుపతి వెంకటేశ్వర స్వామి ఆలయ లడ్డు కల్తీపై విచారణ చేపట్టాలని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబునాయుడు చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. దానిపై విచారణ జరపాలంటూ మాజీ సీఎం జగన్ అంటున్నారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశ, విదేశాల్లో ఉన్న భక్తులు ఇప్పుడు లడ్డు తినాలా? వద్దా? అనే ఆందోళనలో ఉన్నారన్నారు. వైసీపీ, టీడీపీ రాజకీయ గొడవల్లో శ్రీవారి ఆలయ ప్రసాదాన్ని అప్రతిష్టపాలు చేయొద్దని కోరారు. లడ్డు కల్తీకి కారణమైన వారిపై దోషులను శిక్షించాలని కోరారు. లడ్డు విశిష్టతను కాపాడేందుకు అధికార టీడీపీ, ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలు దృష్టి సారించాలన్నారు.

అమెరికాలో మళ్లీ కాల్పులు

- నలుగురు మృతి

వాషింగ్టన్ : అమెరికాలో మరోసారి కాల్పులు కలకలం సృష్టించాయి. అలబామ రాష్ట్రం బర్మింగ్‌హామ్‌లోని ఫైవ్ పాయింట్స్ సౌత్ డిస్ట్రిక్ట్‌లో గుర్తు తెలియని దుండగులు . శనివారం రాత్రి 11 గంటల సమయంలో కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోగా, మరో తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు. పలువురు ఈ కాల్పులకు పాల్పడినట్టు భావిస్తున్నట్లు పోలీసు అధికారి ట్రూమాన్ ఫిట్జ్‌గెరాల్డ్ మీడియాకు ఆదివారం తెలిపారు. ఒక మహిళ సహా ముగ్గురు అక్కడికక్కడే మరణించారని చెప్పారు. మరొకరిని స్థానిక ఆసుపత్రికి తరలించగా, అక్కడ చనిపోయారని తెలిపారు. ఈ ఘటనలో తొమ్మిదిమంది తీవ్రంగా గాయపడ్డారని, వారిలో నలుగురికి ప్రాణాపాయ గాయాలున్నాయని చెప్పారు. ఈ ఏడాది ఇప్పటివరకూ అమెరికాలో 403 సామూహిక కాల్పుల ఘటనలు చోటచేసుకున్నాయి. 12,416 మంది ప్రాణాలు కోల్పోయారు.

తమిళనాడులో కూలిన నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్

చెన్నై : తమిళనాడులోని తిరుపత్తూరు జిల్లా అంపూర్‌లోని చెన్నై - బెంగళూరు జాతీయ రహదారిపై నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ కూలిపోయింది. ఈ ఘటనలో ఫ్లైఓవర్‌పై పనిచేస్తున్న బీహార్, జార్ఖండ్‌కు చెందిన ఆరుగురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు రక్షించి, చికిత్స నిమిత్తం అంబూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీంతో ఫ్లైఓవర్ పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. ఈ ఘటనపై సమాచారం అందుకున్న అంబూర్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని, ట్రాఫిక్ జామ్‌ను క్లియర్ చేశారు. కేసు నమోదు చేసి ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నారు.

యూత్ కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా ఉదయ్ భాను చిబ్

ఢిల్లీ: ఇండియన్ యూత్ కాంగ్రెస్ (ఐవైసి)కు నూతన అధ్యక్షుడిగా ఉదయ్ భాను చిబ్‌ను కాంగ్రెస్ నియమించింది. శ్రీనివాస్ బివి స్థానంలో ఉదయ్ భానును నియమించినట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఐవైసి ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయన గతంలో జమ్ము కాశ్మీర్ ప్రదేశ్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారు.

పట్టాలపై గ్యాస్ సిలిండర్.. నెలరోజుల్లో మూడో ఘటన

కాన్పూర్ : కొంత కాలంగా రైళ్లు పట్టాలు తప్పేలా రైల్వే ట్రాకులపై ప్రమాదకర వస్తువులు ఉంచుతూ కొందరు దుండగులు హడలెత్తిస్తున్నారు. ఉత్తర ప్రదేశ్‌లోని కాన్పూర్ నుంచి ప్రయాగ్ రాజ్ వైపు గూడ్స్ రైలు వెళుతుండగా పట్టాలపై గ్యాస్ సిలిండర్‌ను లోకో పైలట్ గుర్తించాడు. వెంటనే అప్రమత్తమై ఎమర్జెన్సీ బ్రేకులు వేసి ట్రైన్‌ను ఆపాడు. అనంతరం అధికారులకు సమాచారం చేరవేయడంతో అక్కడికి చేరుకున్న సెక్యూరిటీ సిబ్బంది ట్రాక్‌పై ఉన్న సిలిండర్‌ను తొలగించి తనిఖీ చేశారు. అది ఐదు లీటర్ల సామర్థ్యం కలిగిన ఖాళీ సిలిండర్‌గా వారు గుర్తించారు. ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశాలిచ్చినట్లు నార్త్ సెంట్రల్ రైల్వే ప్రకటించింది. నెలరోజుల్లో ఇది మూడో ఘటన కావడం గమనార్హం. ఆగస్టు నుంచి ఈ తరహాలో 18 ఘటనలు వెలుగుచూశాయని రైల్వే శాఖ ఇటీవల ప్రకటించింది.

కల్తీ నెయ్యిపై విచారణకు 'సిట్'

- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

అమరావతి : టిటిడి లడ్డూ నెయ్యి కల్తీ వ్యవహారంతో పాటు అధికార దుర్వినియోగంపైన కూడా ప్రత్యేకంగా స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను వేస్తున్నట్లు సిఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. దర్యాప్తు అధికారిగా ఐజి స్థాయి అధికారిని నియమిస్తామన్నారు. సిట్ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయన్నారు. భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఉండవల్లిలోని ఆయన నివాసంలో ఆదివారం రాత్రి సిఎం మీడియాతో మాట్లాడారు. ఎంతో పవిత్రమైన శ్రీవారి ప్రసాదంలో జంతుకొవ్వు వినియోగించి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేశారన్నారు. తిరుమల మొత్తం ప్రక్షాళన చేసి పూర్వ వైభవం తీసుకురానున్నట్లు చంద్రబాబు వెల్లడించారు.

వర్షాల నేపథ్యంలో జాగ్రత్తలు తప్పనిసరి

కలుషిత నీరు, ఆహారం అయ్యే ప్రమాదం

- దోమల పెరుగుదలను అరికట్టాలి
- చికిత్స కోసం అన్ని ఏర్పాట్లు : డీహెచ్ డాక్టర్ బి.రవీందర్ నాయక్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎడతెరిపి కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రోగాలు ప్రబలే ప్రమాదముందని వైద్యారోగ్యశాఖ హెచ్చరించింది. వ్యాధుల చికిత్సకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామనీ, ప్రజలు వ్యక్తిగతంగా వ్యాధులు వ్యాప్తి చెందకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. వర్షాకాలంలో, వర్షాకాలం తర్వాత కొంత కాలం వ్యాధులు ఎక్కువగా ప్రబలుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందనీ, వాతావరణంలో ఉష్ణోగ్రత తగ్గి, తేమ శాతం పెరడంతో వివిధ రకాల వైరల్ ఇన్‌ఫెక్షన్లు, దోమలతో పాటు ఆహారం, నీరు కలుషితం కారణంగా వచ్చే వ్యాధుల బారిన పడకుండా తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

"దోమలు వ్యాపించకుండా మస్కిటో నెట్స్, స్క్రీన్స్ వాడాలనీ, దోమలు ఎక్కువగా పెరిగే అవకాశమున్న ఉదయం, సాయంత్రం సమయాల్లో తలుపులు, కిటికీలు సరిగ్గా మూసుకోవాలి. దోమల కారణంగా మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధుల బారిన పడతారు. 156 రంధ్రాలు కలిగిన మస్కిటో నెట్లను వాడాలి. పిల్లలు తేలికపాటి రంగుల దుస్తులను ధరించాలనీ, కాళ్లను, చేతులను కూడా కవర్ అయ్యేలా చూసుకోవాలి. బయటికి వెళ్లేటప్పుడు మస్కిటో రీపెల్లెంట్ వంటి క్రీములు, లోషన్స్, బాడీ స్ప్రేలను వాడాలి. రసాయన మస్కిటో రీపెల్లెంట్స్‌ను పిల్లలకు దూరంగా ఉంచాలి. నీటి నిల్వ లేకుండా జాగ్రత్త పడాలి. సెప్టిక్ ట్యాంక్‌లను పూర్తిగా కవర్ చేయాలి. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలి..." అని సూచించారు."బయటికి వెళ్లినప్పుడు ఇంటి నుంచి కాచి వడబోసిన నీటిని మాత్రమే తాగాలి. తరచుగా చేతులను శుభ్రం చేసుకోవాలి. ముఖ్యంగా బయటి ఆహారం, కోసినవి, సరిగ్గా కవర్ చేయాలని చాట్, సలాడ్స్, ఫ్రూట్స్, జ్యూసెస్‌కు దూరంగా ఉండాలి. ఇంట్లో వండిన తాజా ఆహారాన్ని మాత్రమే భుజించాలి. వ్యాధిబారిన పడిన వారితో చేతులు కలపడం, ఆహారాన్ని పంచుకోవడం, నీరు, వస్త్రాలు పంచుకోవద్దు. బహిరంగ ప్రదేశాలకు వెళ్లినప్పుడు తలుపుల హ్యాండిల్స్, టేబుల్ టాప్స్ వంటి వాటిని తాకకూడదు. తగ్గినప్పుడు ఇతరులకు ఇన్ఫెక్షన్ సోకకుండా మూతిని పూర్తిగా కవర్ చేసుకోవాలి. దగ్గు, తుమ్ములు వచ్చినప్పుడు వాడిపాడేసే టిష్యులను ఉపయోగించాలి. ఎవరైన జ్వరంతో కూడిన దగ్గు, తలనొప్పి, గొంతు నొప్పి, ఒళ్లు నొప్పులు, కండ్లకలక లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లాలి..." అని డాక్టర్ రవీందర్ నాయక్ తెలిపారు. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ప్రభుత్వం జ్వరపీడితుల కోసం అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రత్యేక బెడ్లను సిద్ధం చేసినట్టు డీహెచ్ డాక్టర్ రవీందర్ నాయక్ తెలిపారు. ఇప్పటికే ఆయా ఆస్పత్రుల్లో ఐవీ ఫ్లూయిడ్స్, అత్యవసర మందులను అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. ఆస్పత్రికి వ్యాధిగ్రస్తులు చేరుకునేలోపు అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేందుకు వీలుగా ఏఎన్ఎం, ఆశాలు, అంగన్ వాడీ వర్కర్ల వద్ద ఒఆర్ఎస్ సాచెట్లను ఉంచినట్టు పేర్కొన్నారు.

ఇరాన్ బొగ్గు గనిలో పేలుడు

- 51 మంది మృతి
- 20 మందికి తీవ్రగాయాలు, మరో 24 మంది గల్లంతు

టెహ్రాన్ : బొగ్గు గనిలో పేలుడు సంభవించడంతో 51 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా, మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. 24 మంది ఆచూకీ తెలియరాలేదు. ఇరాన్ దక్షిణ ఖొరాసన్ ప్రావిన్స్‌లో శనివారం రాత్రి ఈ ఘోర సంఘటన చోటుచేసుకుంది. క్షతగాత్రులను బయటకు తీసుకొచ్చేందుకు, మృతదేహాలను వెలికితీసేందుకు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. శనివారం రాత్రి 9 గంటలకు మదంజు కంపెనీ నిర్వహిస్తున్న బొగ్గు గనిలోని బి, సి బ్లాకుల్లో మీథేన్ గ్యాస్ విడుదల కావడంతో పేలుడు జరిగినట్లు సౌత్ ఖొరాసన్ ప్రావిన్స్ గవర్నర్ అలీ అక్బర్ రహీమి తెలిపారు. బి బ్లాక్‌లో రెస్క్యూ ఆపరేషన్ ఇప్పటికే పూర్తయినట్లు ఆయన మీడియాకు చెప్పారు. బి బ్లాక్‌లో పని చేసిన 47 మంది కార్మికుల్లో 30 మంది మరణించారని, మరో 17 మంది గాయపడ్డారని తెలిపారు. సి బ్లాక్‌లో సహాయక చర్యలు ప్రారంభమయ్యాయని, అక్కడ మీథేన్ సాంద్రత ఎక్కువగా ఉండటంతో, రెస్క్యూ ఆపరేషన్‌కు ఎక్కువ సమయం పడుతుందని చెప్పారు. పేలుడు సమయంలో మొత్తంగా ఆయా బ్లాకుల్లో 69 మంది కార్మికులు ఉన్నారని వివరించారు. గాయపడిన 17 మందిని ఆసుపత్రికి తరలించామని, 24 మంది ఆచూకీ తెలియలేదని వెల్లడించారు. దేశంలోని బొగ్గులో 76 శాతం ఇక్కడి నుంచే సరఫరా అవుతోందని, మదంజు కంపెనీతోసహా 8 నుంచి 10 పెద్ద కంపెనీలు ఈ ప్రాంతంలో పనిచేస్తున్నాయని ఆయన వివరించారు. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. మృతి చెందిన వారి కుటుంబాలకు, గాయపడిన వారికి తగిన సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.

ఏపీలో వైసీపీ కార్యాలయంపై దాడి



అమరావతి : తిరుమల ప్రసాదం కల్తీ పేరుతో సంఘ పరివార్ రాష్ట్రంలో ఉద్రిక్తతలను రెచ్చగొట్టేందుకు కుట్రలు చేస్తోంది. ఆదివారం బిజెపి, బిజెవైఎం కార్యకర్తలు మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టేలా నినాదాలు చేస్తూ తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంపై దాడికి తెగబడ్డారు. బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షులు మిట్టా వంశీకృష్ణ ఆధ్వర్యాన తాడేపల్లి కార్యాలయానికి చేరుకున్న కార్యకర్తలు హిందువుల మనోభావాలను దెబ్బతీశారంటూ నినాదాలు చేస్తూ తమ వెంట తెచ్చుకున్న కాషాయం కలర్ వున్న పాలథీన్ ప్యాకెట్‌లను, చెప్పులను వైసిపి కార్యాలయంపైకి విసిరారు. 108 సార్లు తిరుమల శ్రీవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ వైవి సుబ్బారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వైసిపి కార్యాలయం గేట్లు ఎక్కి లోపలకు దూసుకుపోయేందుకు ప్రయత్నించారు. అలాగే జగన్ నివాసంలోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో అక్కడ దాదాపు గంటపాటు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అక్కడ వున్న సెక్యూరిటీ సిబ్బంది ప్రధాన ద్వారం గేట్లు వేయడంతో గేటు ముందు కూర్చొని జగన్, వైవి సుబ్బారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జగన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. వైసిపి కార్యాలయంపైకి దాడికి వచ్చారన్న సమాచారంతో మాజీ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, టిజెఆర్ సుధాకర్‌బాబు, నాయకులు దేవినేని అవినాష్, నారాయణమూర్తి తదితరులు అక్కడికి చేరుకునే లోపే పోలీసులు బిజెపి, బిజెవైఎం కార్యకర్తలను అరెస్టు చేసి మంగళగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి : వైసిపి

వైసిపి కార్యాలయంపై దాడికి పాల్పడ్డ బిజెవైఎం కార్యకర్తలను కఠినంగా శిక్షించాలని వైసిపి గ్రీవెన్స్‌సెల్ రాష్ట్ర అధ్యక్షులు అంకంరెడ్డి నారాయణమూర్తి తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమ కార్యాలయంపై దాడికి వచ్చినవారు తమ పార్టీ సెక్యూరిటీ ఆఫీసర్ ఈశ్వర్, ఆర్ఎస్ఐ వీరేష్, కానిస్టేబుల్స్ రవీంద్రరెడ్డి, ఖాజాను భయభ్రాంతులకు గురిచేశారని తెలిపారు. వైసిపి కేంద్ర కార్యాలయానికి భద్రత పెంచాలని కోరారు.

దాడి హేయమైంది : మాజీ మంత్రి అంబటి

బిజెవైఎం కార్యకర్తలు తమ కార్యాలయంపైకి దాడికి తెగబడటాన్ని ప్రజాస్వామ్యవాదులంతా తీవ్రంగా ఖండించాలని మాజీ మంత్రి అంబటి రాంబాబు డిమాండ్ చేశారు.

ఫ్రాన్స్‌లో కొత్త ప్రభుత్వంపై భారీ నిరసన



అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ మితవాద ప్రభుత్వాన్ని నియమించడంపై శనివారంనాడు ఫ్రాన్స్ అంతటా పెద్దఎత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి. జూలైలో జరిగిన పార్లమెంటరీ ఎన్నికల ఫలితాలను వారు విస్మరించారని ఆరోపిస్తూ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, అతని కొత్త సంప్రదాయవాద ప్రధాన మంత్రి మిచెల్ బార్నియర్ లను ఖండిస్తూ పారిస్‌లో వేలాది మంది కదం తొక్కారు. లెఫ్ట్-వింగ్ న్యూ పాపులర్ ఫ్రంట్ (ఎన్ ఎఫ్ పి) కూటమి, మాక్రాన్ పునరుజ్జీవనోద్యమ పార్టీ నేతృత్వంలోని కేంద్రం, మితవాద జాతీయ ర్యాలీ - మూడు సమానమైన కూటములతో ఏర్పడిన హంగ్ పార్లమెంటు ఫ్రాన్స్‌ను ప్రతిష్టంభనకు గురిచేసింది. ఏ పార్టీకి మెజారిటీ రానప్పటికీ, ఎన్ ఎఫ్ పి సంకీర్ణం అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంది. ఈ కారణం చేతనే ఎన్ ఎఫ్ పి ప్రధానమంత్రి పదవిని ఆశించింది.

అయినప్పటికీ, మాక్రాన్ ఎన్ ఎఫ్ పి నుంచి ఎంపికైన లూసీ కాస్టెట్స్‌ను ప్రధానమంత్రిగా నియమించడానికి నిరాకరించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశాడు. ఈ నెల ప్రారంభంలో, మాక్రాన్ సెంటర్-రైట్ రిపబ్లికన్ పార్టీ నుంచి బార్నియర్‌ను ప్రధానమంత్రి పోస్ట్ కోసం నామినేట్ చేశాడు. బార్నియర్ వేగంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో విఫలమయ్యాడు. అంతిమంగా అతను శనివారం కొత్త క్యాబినెట్‌ను ప్రకటించినప్పుడు, న్యాయ మంత్రిగా ఒక వామపక్ష రాజకీయ నాయకుడు డిడియర్ మిగౌడ్ మాత్రమే ఉన్నాడు. మిగిలిన వారిలో ఎక్కువగా మధ్యవాదులు, మితవాదులు ఉన్నారు. శనివారం వీధుల్లో కనిపించిన అనేక ప్లకార్డుల ప్రకారం వామపక్ష కూటమి ఎన్నికల విజయాన్ని అపహాస్యం చేసి మొత్తం ప్రజాస్వామ్యాన్ని "అగౌరవ పరిచిన" చర్యగా నిరసనకారులు భావించారు. "ఈడియట్స్ పాలన", "మాక్రాన్‌ను అభిశంసించండి" అంటూ నినదిస్తూ అధ్యక్షుడి రాజీనామాకు పిలుపునిచ్చారు. బార్నియర్ నియామకంతో "తిరుగుబాటు" చేయడం ద్వారా ఫ్రెంచ్ అధ్యక్షుడు "చక్రవర్తి" కావడానికి ప్రయత్నిస్తున్నాడని ఆరోపిస్తూ కొందరు మాక్రాన్ ముసుగులు ధరించారు."మేము ఎప్పటికీ లొంగబోమని, రిపబ్లిక్ అధ్యక్షుడి ప్రజాస్వామ్య వ్యతిరేక అధికారాన్ని ఎప్పటికీ అంగీకరించబోమని పునరుద్ఘాటించడానికి మేము ఇక్కడ ఉన్నాము" అని ఒక ప్రదర్శనకారుడు పేర్కొన్నాడు. "మాక్రాన్ అధికారంలో చట్టబద్ధత లేదు... ఫ్రెంచ్ ప్రజలు ఓటు వేశారు. ఎన్ ఎఫ్ పి ఆధిక్యంలో ఉందని స్పష్టమైనప్పటికీ మాక్రాన్ తక్కువ ఓట్లు పొందిన కూటమికి చెందిన వ్యక్తిని ప్రధాన మంత్రిగా నియమించాడు" అని మరొక నిరసనకారుడు వివరించాడు. శనివారంనాడు పారిస్‌లో జరిగిన అతిపెద్ద ప్రదర్శనలో 40,000 మంది వరకు పాల్గొన్నారని నిర్వాహకులు పేర్కొన్నారు. లియోన్, నాంటెస్, మార్సెయిల్, బోర్డియక్స్, అంగోలేమ్, స్ట్రాస్‌బర్గ్‌ల్లో కూడా నిరసనలు జరిగాయి.ప్రజల్లో చెలరేగిన అసంతృప్తితో పాటు, ఫ్రాన్స్ కొత్త ప్రభుత్వం పన్ను విధానాన్ని క్రమబద్ధీకరించడం నుంచి బడ్జెట్ సంక్షోభాన్ని పరిష్కరించడం వరకు అనేక సమస్యలను ఎదుర్కొంటుంది. మూడు కూటములుగా విడిపోయిన పార్లమెంటు ద్వారా చట్టాలను అమలు చేయడం పెద్ద సవాలుగా మారనుందని చాలా మంది నిపుణులు హెచ్చరిస్తున్నారు.

12 లక్షల చెట్ల తొలగింపు వార్త అవాస్తవం

- రాడార్ స్టేషన్‌కు వాడే భూమి 48 శాతమే : అటవీ సంరక్షణ ప్రధానాధికారి ఆర్.ఎం.డోబ్రియాల్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వికారాబాద్ జిల్లాలోని దామగుండం అడవుల్లో తూర్పు నౌకాదళ రాడార్ స్టేషన్ నెలకొల్పేందుకు 12 లక్షల చెట్ల తొలగించబోతున్నారనే వార్తలో ఎలాంటి నిజం లేదని తెలంగాణ అటవీ సంరక్షణ ప్రధానాధికారి రాకేశ్ మోహన్ డోబ్రియాల్ తెలిపారు. "ప్రాజెక్టు నిర్మాణ కోసం కేటాయించిన మొత్తం అటవీ భూముల్లో 48 శాతం విస్తీర్ణంలోనే రాడార్ స్టేషన్ నిర్మాణం జరుగుతుంది. మిగతా 52 శాతం విస్తీర్ణంలోని అటవీ సంపదకు ఎలాంటి హాని జరగకుండా చర్యలు చేపడుతున్నాం. 1,93,562 చెట్లను మాత్రమే రాడార్ స్టేషన్ నిర్మాణం కోసం తొలగిస్తామని ఫారెస్ట్ అడ్వైజరీ అథారిటీ స్పష్టం చేసింది. తొలగించాలనుకున్న చెట్ల సంఖ్యను ఇంకా తగ్గించే దిశగా అటవీశాఖ ప్రణాళికలు రచిస్తున్నది. ఈ ప్రాజెక్టు ఏర్పాటుతో కోల్పోనున్న 1,93,562 చెట్లకు బదులుగా రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల అడవుల్లోని 2,348 హెక్టార్లలో విస్తరించి వున్న 17,55,070 చెట్లను అటవీశాఖ పునరుద్ధరించనున్నది" అని డోబ్రియాల్ తెలిపారు. గ్రామసభల్లో ప్రాజెక్టుకు అనుకూలంగా తీర్మానాలు జరిగాయనీ, షెడ్యూల్డ్ తెగలు, ఇతర సాంప్రదాయ అటవీ నివాసులకు ఇబ్బందులు కలగటంలేదని జిల్లా కలెక్టర్ నుంచి ఆమోదం పొందిన తర్వాతనే పనులు మొదలయ్యాయని పేర్కొన్నారు. 2010 నుంచే భూసేకరణను భారత ప్రభుత్వం మొదలు పెట్టిందని తెలిపారు. అప్పటి నుంచి రాష్ట్రంలోని ప్రభుత్వాలతో పరస్పర సంప్రదింపులు జరిపి రాడార్ స్టేషన్ పనులను ముందుకు తీసుకెళ్లుతున్నదని పేర్కొన్నారు. 500 ఏండ్ల నుంచి ఉన్న రామలింగేశ్వర ఆలయాన్ని భూసేకరణలో తరలిస్తున్నారనే ప్రచారాన్ని కొట్టిపడేశారు. 32 ఎకరాల 10 గుంటల్లో విస్తరించిన దేవాలయంతో పాటు కొలను అలాగే ఉంటుందనీ, దేవాలయాన్ని సందర్శించే భక్తులకు నేవీ అధికారుల నుంచి ఎలాంటి ఇబ్బందులు కూడా ఉండబోవని స్పష్టం చేశారు. జాతీయ ప్రాధాన్యత ఉన్న ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా స్థానికులకు ఉపాధి కలుగుతుందని పేర్కొన్నారు. తమిళనాడులోని తిరునల్వేలి తర్వాత రాడార్ స్టేషన్ కలిగి వున్న ప్రాంతంగా, జాతీయ భద్రతను కల్పిస్తున్న కేంద్రంగా తెలంగాణకు పేరువస్తుందని తెలిపారు.

సూరత్‌లో నకిలీ కరెన్సీ ఫ్యాక్టరీపై దాడి

- నలుగురి అరెస్టు
- 1.20 లక్షల విలువైన నకిలీ నోట్ల స్వాధీనం



సూరత్ : గుజరాత్‌లోని సూరత్ నగరంలో ఆన్‌లైన్ గార్మెంట్ స్టోర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న నకిలీ కరెన్సీ తయారీ యూనిట్‌పై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. నలుగురు నిందితులను అరెస్టు చేశారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాజ్‌దీప్ నకుమ్ ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. షాహిద్ కపూర్ నటించిన "ఫర్జీ" వెబ్ సిరీస్ నుంచి ప్రేరణ పొందినట్లు నిందితులు చెబుతున్నారని తెలిపారు. వారి నుంచి రూ.1.20 లక్షల విలువైన నకిలీ నట్లను స్వాధీనం చేసుకుని, సంఘటనా స్థలంలోనే రాహుల్ చౌహాన్, పవన్ బానోడ్, భవేష్ రాథోడ్‌లను అరెస్టు చేశామన్నారు. ఆ తరువాత మరొకరిని అరెస్ట్ చేశామన్నారు. ఆన్‌లైన్ గార్మెంట్ వ్యాపారం పేరుతో వాణిజ్య భవనంలో కార్యాలయ స్థలాన్ని అద్దెకు తీసుకుని, నకిలీ నోట్లను ముద్రిస్తున్నారని పేర్కొన్నారు. నోట్లను ముద్రించేందుకు వినియోగిస్తున్న పేపర్, కలర్ ప్రింటర్లు, ప్రింటింగ్ ఇంక్, లామినేషన్ మెషిన్ మొదలైన పరికరాలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

జీడిమెట్ల పోలీసులను సస్పెండ్ చేయాలి.

- మానవ హక్కుల వేదిక డిమాండ్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అకారణంగా ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని, థర్డ్ డిగ్రీ ప్రయోగించి, హింసకు పాల్పడిన జీడిమెట్ల పోలీసులను సస్పెండ్ చేయాలని మానవహక్కుల వేదిక నిజనిర్ధారణ కమిటీ డిమాండ్ చేసింది. రూ.5వేలు దొంగతనం చేశారనే ఆరోపణపై ఈనెల 16వ తేదీ షాపూర్ నివాసి రామునాయక్ (38)ను జీడిమెట్ల పోలీసులు అదుపులోకి తీసుకొని, హింసించినట్టు తమ కమిటీ గుర్తించిందని మానవ హక్కుల వేదిక హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి సంజీవ్, నగర కార్యదర్శి రోహిత్ తెలిపారు. స్నేహితుల మధ్య జరిగిన దొంగతనం ఆరోపణల్లో పోలీసులు శృతిమించి వ్యవహరించి, రాము నాయక్‌ను చిత్రహింసలకు గురిచేశారనీ, వారి దెబ్బలకు అతని కుడికాలు, ఎడమ చెయ్యి పనిచేయకుండా పోయాయని తెలిపారు. ప్రస్తుతం రామునాయక్ ఎలాంటి పనులకు వెళ్లలేని దీనస్థితిలో ఉన్నాడనీ, ప్రభుత్వం అతనికి వైద్యసహాయం అందించాలని కోరారు. సంబంధం లేని విషయంలో పోలీసులు తనను ఇరికించే ప్రయత్నం చేశారని బాధితుడు చెప్పాడని వారు తెలిపారు. గతంలో ఇదే పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు అశోక్ అనే వ్యక్తిని కొట్టడం వల్ల అతను ఆత్మహత్య చేసుకొని చనిపోయాడన్నారు. ప్రభుత్వం ఈ రెండు ఘటనలపై విచారణ జరిపాలని డిమాండ్ చేశారు. దీనికి బాధ్యులైన పోలీసులను సస్పెండ్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో అమాయకులపై జరుగుతున్న హింసపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌కి నివేదిక సమర్పిస్తామని చెప్పారు.



పర్యాటకానికి రండి

యువతకు మంత్రి జూపల్లి పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణలోని పర్యాటక ప్రాంతాల ప్రమోషన్‌లో భాగస్వాములు కావాలని ఆ శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు యువతకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ పర్యాటక వారోత్సవాల్లో భాగంగా బుద్ధవనం థీమ్ పార్కుకు ప్రచారం కల్పించేందుకు చేపట్టిన "రైడ్ టూ నిర్వాణ బైక్ ర్యాలీ"ని ఆదివారం హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజా వద్ద జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్ పటేల్ రమేష్‌రెడ్డితో కలిసి టూరిజం ప్లాజా నుంచి తార్నాక వరకు బైక్ నడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగార్జున సాగర్ వద్ద ముగిసే ఈ ర్యాలీ ద్వారా తెలంగాణ టూరిజం గురించి ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. చారిత్రక, వారసత్వ కట్టడాలు, ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, వన్య ప్రాణులు, సాహస కార్యకలాపాలకు అనువైన ఎన్నో ప్రాంతాలు తెలంగాణలో ఉన్నాయని, వాటిని సందర్శించి ప్రాచుర్యం కల్పించాలని ప్రజలను కోరారు. విదేశీ పర్యాటకులను ఆకర్షించటమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత బౌద్ధ క్షేత్రమైన నాగార్జున కొండ చరిత్ర, బౌద్ధ వారసత్వాన్ని ఈ తరానికి తెలియజేయనున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అభివద్ధి సంస్థ ఎండీ ప్రకాష్‌రెడ్డి, పురావస్తు పరిశోధకులు ఈమని శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ - మలక్‌పేట్

మలక్‌పేట్‌లోని సలీంఖాన్ కమ్యూనిటీ హాల్లో 50 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లను ఆదివారం ఎమ్మెల్యే హమ్మద్ బలాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కుట్టు మిషన్లు ఉపయోగ పడతాయని తెలిపారు. మహిళలు నేటి పోటీ యుగంలో అన్నిరంగాలలో ముందంజలో ఉన్నారని, ఉపాధి మార్గాలు పెంచుకోవటం కష్టం కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎంఐఎం మలక్‌పేట్ మహిళా అధికారి నజిమ, పార్టీ కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.



మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనిఅల్మాస్ గూడలో ఉన్న అడివిరెడ్డి గార్డెన్స్ లో జరిగిన విశ్వకర్మ యజ్ఞం పూజ కార్యక్రమానికి హాజరైన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి ఆచారి, కార్పొరేటర్లు భిక్షపతిచారి, బోయపల్లి శేఖర్ రెడ్డి తదితరులు..

నవతెలంగాణ- బడంగ్‌పేట్

ఎన్టీఆర్‌నగర్ సీపీఐ(ఎం) కార్యదర్శిగా గోపినాయక్





నవతెలంగాణ-ఎల్బీనగర్

మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని ఎన్టీఆర్ నగర్ 5వ శాఖ మహా సభను ఆదివారం నిర్వహించారు. తర్వాత సీపీఐ(ఎం) పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ శాఖ కార్యదర్శిగా గోపినాయక్‌ను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన గోపి నాయక్ మాట్లాడుతూ ఎన్టీఆర్ నగర్ పేద ప్రజల ఇండ్ల సమస్యలపై పోరాడుతామన్నారు. అందరికీ అందు బాటులో ఉంటూ ప్రజా సమస్య లపై ఉద్యమి స్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఈ సభకు ముఖ్య అతిథుగా హాజరైన సీపీఐ (ఎం) పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యం. చంద్రమోహన్, జిల్లా కమిటీ సభ్యులు కీసరి నర్సిరెడ్డిలు గత కార్యకమాలపైన చర్చించి..భవిష్యత్ కార్యక్రమాల గురించి వివరించారు. ఇంకా చర్చలు జరిగినాయి. ఈ సభలో సీపీఐ(ఎం) పార్టీ సరూర్‌నగర్ సర్కిల్ కార్యదర్శి సిహెచ్ వెంకన్న, కార్యదర్శి వర్గ సభ్యులు కట్ట శ్రీనివాస్, యం వీరయ్య, పార్టీ సభ్యులు బి రాజు, యం పద్మ, రావూరి వెంకన్న, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

నిరు పేదలందరికీ ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య
- వనస్థలిపురం సీపీఐ(ఎం) శాఖ కార్యదర్శిగా పొట్టిపాక రామస్వామి ఎన్నిక





నవతెలంగాణ - వనస్థలిపురం

నిరు పేదలందరికీ ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య కోరారు. ఈ మేరకు ఆదివారం సీపీఐ(ఎం) పార్టీ వనస్థలిపురం శాఖ మహాసభల సందర్భంగా ఎన్జీవోస్ కాలనీ బస్ స్టాప్ వద్ద పార్టీ జెండాను ఆలేటి ఎల్లయ్య ఎగరవేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ(ఎం) పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం. చంద్రమోహన్ హాజరైనారు. సీపీఐ(ఎం) పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ బీజేపీ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా అన్ని రాజకీయ పార్టీలను సమీకరించిన ఉద్యమవీరుడు ఏచూరి అని అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లవలసిన బాధ్యత పార్టీ సభ్యులపైన ఉందన్నారు. ఏచూరి విద్యార్థి దశ నుంచి ఉద్యమాల వైపు నిలిచారు. ఢిల్లీలోని జేఎన్‌యూకు మూడు సార్లు అధ్యక్షునిగా ఎన్నికయ్యారని చెప్పారు. ఏచూరి పోరాట పటిమను గుర్తించి పుచ్చలపల్లి సుందరయ్య ప్రోత్సహించారని తెలిపారు. ఆయన ఉన్నతమైన కుటుంబంలో పుట్టి పేదల కోసం తాను నమ్మిన సిద్ధాంతాన్ని పట్టు వదలకుండా 50 సంవత్సరాలు హక్కుల కోసం నిరంతరం పోరాటం చేశారని వివరించారు. దేశంలోని అన్ని రకాల చరిత్ర, సంస్కృతులపై ఆయనకు పట్టుందన్నారు. అందుకే అనేక భాషలో అనార్గళంగా మాట్లాడే వారని గుర్తు చేశారు. 1990 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన ఆర్థిక విధానాలు ప్రజలపై వాటి భారం ఎలా ఉంటుందో చాలా వివరంగా చెప్పారన్నారు. బీజేపీ, మతోన్మాద శక్తులపై దేశంలోని అన్ని రాజకీయ పార్టీలను ఏకతాటిపైకి తీసుకురావడానికి ఏచూరి ఎంతో కృషి చేశారని చెప్పారు. దేశంలోనే ప్రస్తుతం తీవ్రమైన పరిణామాలు జరుగుతున్నాయని, జమిలి ఎన్నికలు జరగాలని కేంద్రం నిర్ణయం తీసుకుందన్నారు. దేశ చరిత్రను వక్రీకరించాలని చూస్తుందని విమర్శించారు.

ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి బీజేపీ మతం రంగు పూస్తుందని విమర్శించారు. భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం దొరలు, భూస్వాములు, రజాకార్ల ఆగడాలకు అణచివేతకు వ్యతిరేకంగా ప్రజలు ఎర్రజెండా నాయకత్వంలో తిరుగుబాటు చేశారని తెలిపారు. 10 లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేసిన ఘనత సాయుధ పోరాటం అని అన్నారు. మూడు వేల గ్రామాల్లో ప్రజారాజ్యం స్థాపనకు కమ్యూనిస్టులు ఎనలేని కృషి చేశారు. ఆర్థిక దోపిడీ, సామాజిక అణచివేతలను ఆ రోజుల్లో కులాలకు, మతాలకు అతీతంగా తీవ్రంగా వ్యతిరేకించారని చెప్పారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అనే చందంగా ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసేంతవరకూ ప్రజల తరపున ప్రజా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం వనస్థలిపురం సీపీఐ(ఎం) నూతన శాఖ కార్యదర్శిగా పొట్టిపాక రామస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బి.కాశయ్య, కే.సుమన్, లక్ష్మయ్య, రాధమ్మ, భాగ్యమ్మ, కోమలత, యాదయ్య, మహేష్, అయోధ్య, జలంధర్, గంగమ్మ, బాలస్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ మహాయజ్ఞంలో ఎమ్మెల్యే సబితమ్మ





నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం పరిధి బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అల్మాస్‌గూడ అడవిరెడ్డి గార్డెన్‌లో జరిగిన విశ్వకర్మ మహాయజ్ఞం, పూజా కార్యక్రమానికి ఆదివారం మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గము శాసన సభ్యురాలు పి. సబితా ఇంద్రారెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.ఆచారిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ విశ్వకర్మలు తమ సమస్యల పరిష్కారం కోసం కలసి కట్టుగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ జనరల్ సెక్రటరీ అరవింద్ శర్మ, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, ఆర్కేపురం అధ్యక్షులు నాగేష్, కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి, సీనియర్ నాయకులు లోకసాని కొండల్ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, విశ్వకర్మ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా పన్యాల



నవతెలంగాణ - హయత్‌నగర్

గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎల్బీనగర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పన్యాల జైపాల్‌రెడ్డి నియామకం అయ్యారు. ఈ మేరకు జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ తనను డైరెక్టర్‌గా నియమించిన కాంగ్రెస్ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా చూస్తానని, రైతులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ఆర్య వైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తా

- టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్త





నవతెలంగాణ-నాగోల్

ఆర్యవైశ్యుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్త అన్నారు. మిర్యాలగూడ లక్ష్మి కల్యాణ మండపంలో జరిగిన వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ సాయిహర్షిని సంతోషాల శ్రీనివాసుని రీకాన్ మహోత్సవంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆర్య వైశ్యుల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని అన్నారు. ఎన్నో ఏండ్ల కల ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, గుండ ప్రకాశ్, శ్రీ వాసవి సేవా సమితి నేషనల్ ప్రెసిడెంట్ పూరి సురేష్ శెట్టి, ఐఈసి ఆఫీసర్స్ బండారు వెంకటేశ్వర్, ఎల్.వి కుమార్, రీజియన్ చైర్‌పర్సన్ గుండ సుధ మాధురి, మిట్టపల్లి రమేశ్, బికుమల్ల నాగేశ్వర్ రావు, ఐవీఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజక వర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేవైఎం అధ్యక్షులు రాళ్లగూడం రామకృష్ణారెడ్డి ఆధ్వ ర్యంలో ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి దిష్టి బొమ్మను ఆదివారం బడంగ్‌పేట్ చౌరస్తాలో దహనం చేశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ సీఎంగా ఉన్న సమయంలో దాదాపు 300 దేవాలయాలను కూల్చివేసిన హిందూ ద్రోహి జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. అత్యంత పవిత్రమైన తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదంలో అప విత్ర పదార్థాలు కలపడం, భక్తు ల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించిన ఎవ్వరినీ వదిలి పెట్టకూడదని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నడికుడి యాదగిరి, సామ సంజీ వరెడ్డి, జిల్లా నాయకులు గుర్రం మల్లారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం కన్వీనర్ దేవేందర్ రెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,జిల్లా యువ నాయకులు నిమ్మల రవికాంత్ గౌడ్, నవార్ శ్రీని వాస్ రెడ్డి, మోర లోకం, బెల్ల రాజు, రుద్ర నర్సింగ్ రావు, మంత్రి మహేష్, చిత్రం శ్రీనివాస్, సైదు లు,బంగారు సురేష్, వనరసేన శివారెడ్డి, అంజి, శశిధర్ రెడ్డి, లక్ష్మీనారాయణ్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రెడాస్ ఫార్మసీ అవుట్లెట్ ప్రారంభం



నవతెలంగాణ-హయత్‌నగర్

క్రెడాస్ ఫార్మసీ ఔట్ లేట్‌ను ఫ్రాంచేజ్ ఏరియా మేనేజర్ అనురాగ్, తలారి విష్ణు వర్ధన్, స్థానిక రాజకీయ నేతలు ఆందోజు రవీంద్ర చారీ, ముత్యాల యాదరెడ్డి, పబ్బతి లక్ష్మణ్, హరిసింగ్ నాయక్‌లు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రెడాస్ ఫార్మసీ అవుట్లెట్ ద్వారా అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన మందులను వినియోగదారులు పొందవచ్చని, ఉచిత డెలివరీ సదుపాయం కూడా అందుబాటులో ఉందని ప్రతి కస్టమర్ ఆరోగ్య విషయంలో మందుల సప్లైలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ డాక్టర్ల సూచన మేరకు మందుల సేవా సదుపాయం కల్పిస్తామని తెలిపారు. బ్రాండ్ జనరిక్ జనరల్ మందులపైన రాయితీ అవకాశం కూడా ఉందన్నారు. ఈ సదుపాయాన్ని ప్రజలందరూ వినియోగించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్ట్ కీర్తి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



దేశంలోని పలు నగరాలలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పారిశుధ్య, ట్రాఫిక్ సమస్యలను ఏవిధంగా అధిగమించారో, వారు అవలంబిస్తున్న తీరును అధ్యయనం చేస్తున్నామని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మితో పాటు నగర కార్పొరేటర్ల బృందం లక్నోకి బయలుదేరి అక్కడ పరిస్థితుల పై సమగ్ర అధ్యయనం చేసి, హైదరాబాద్ మహా నగరంలో మన అవసరాలకు తగినట్టుగా మౌలిక సమస్యల పరిష్కారాలు, సాంకేతిక పరిజ్ఞానంతో నూతన నిర్మాణాలు చేపట్టేలా చర్యలు చేపడుతామని సుజాత నాయక్ తెలిపారు.

నవతెలంగాణ - హస్తినాపురం

పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ - బడంగ్‌పేట్

బాలాపూర్ పీవైఎల్ నాయకులు బలమైన విప్లవ విద్యార్థి ఉద్యమాలను నిర్మించాలని, నవ సమాజ నిర్మాణం కోసం పోరాడాలని పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థి కొల్లూర్ భీమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న బాలాపూర్ పీవైఎల్ నాయకులు పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్ల మందిలో చలనాన్ని అందించి పోరు బాటలో నడిచిన సంస్థ పీడీఎస్‌యూ అన్నారు. ఉద్యమాల గడ్డ ఉస్మానియా యూనివర్సిటీ జార్జిరెడ్డి రక్తంతో తడిసిన బిగి పిడికిలి త్యాగాల చరిత్రతో ఉద్యమాన్ని వదంతం చేసిన కోట్లాది విద్యార్థులకు మార్గదర్శి అయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ బాలాపూర్ కమిటీ సభ్యులు, అధ్యక్ష కార్యదర్శులు, కారేమొల రాకేష్, కొల్లూర్ భీమేష్, సభ్యులు శంకర్, మహేష్, చాగంటి ప్రవీణ్, నరేందర్, ప్రవీణ్ జగదీష్, వసంత్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు తుక్కుగూడలో

ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

- ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ఆమనగంటి వెంకన్న



నవతెలంగాణ-హయత్ నగర్

నేడు, రేపు (23, 24) తుక్కుగూడలో ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు జరగనున్నట్టు ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ఆమనగంటి వెంకన్న తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ సెమినార్‌లో "మన ఆర్థిక విధానం ప్రజల కోసమా, లాభాల కోసమా" అనే అంశం మీద ప్రొఫెసర్ నాగేశ్వర్ పాల్గొని మాట్లాడుతారని వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ పెట్టుబడిదారి విధానాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

'పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి'



నవతెలంగాణ- బడంగ్‌పేట్

ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కార్పొరేటర్లు యాతం పవన్ కుమార్ యాదవ్, బాలు నాయక్‌లు కోరారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ నగరపాలక సంస్థ 12వ రంగనాయకుల కాలనీలో, బాలాజీ నగర్ 13వ డివిజన్లలో తడి, పొడి చెత్త పైన ఇంటింటికీ తిరుగుతూ కార్పొరేటర్లు ప్రజలకు అవగాహన కల్పించారు. తర్వాత శానిటేషన్ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటం వలననే సీజనల్ వ్యాధుల నియంత్రణ జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ శానిటేషన్ సిబ్బందికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ వి.యాదగిరి, జవాన్ శ్రీనివాస్, ఆర్పిలు, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

'సమాజ సేవలో భాగస్వాములు కావాలి'



నవతెలంగాణ- బడంగ్‌పేట్

సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్, చేవెళ్ల ఎంపీ కేవీఆర్‌లు పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ మున్సిపాలిటీలో రంగారెడ్డి జిల్లా యువ మోర్చా అధ్యక్షులు యదీష్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన, ఉచిత వైద్య శిబిరాలను రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నరసింహారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములు యాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్ గౌడ్‌లతో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా జరుగుతున్న సేవా మహా యజ్ఞంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు సేవెల్ల మహేందర్, బీజేపీ సీనియర్ నాయకులు బోసుపల్లి ప్రతాప్, జిల్లా ప్రధాన కార్యదర్శులు పోరెడ్డి అర్జున్, స్థానిక కౌన్సిలర్లు బోధ యాదగిరిరెడ్డి, రాజమోని రాజు ముదిరాజ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మధుమోహన్ గుప్తా, శ్రీనివాస్, మాధవ రెడ్డి, బుర్ర దిలీప్ గౌడ్, రఘు గౌడ్, చింతల రాఘవేందర్ ముదిరాజ్, మునవత్ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ - వనస్థలిపురం

వనస్థలిపురం డివిజన్ పరిధిలోని కిన్నెర గ్రాండ్ హెటల్లో టీకేఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ఎంసీఏ చదివిన 2008 -11 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు వారి అధ్యాపకులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించి, ఘనంగా సన్మానించారు. తర్వాత అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. 13 సంవత్సరాల తరువాత పాత మిత్రులు అందరూ ఒక చోట కలుసుకోవడం అందరికీ సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేయడానికి రమేష్, సుధాకర్, సందీప్, హక్కాని ఎంతో కృషి చేశారు.



లక్ష్మి గార్డెన్ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నిక

నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ 21వ వార్డు పరిధిలోని లక్ష్మి గార్డెన్ కాలనీ నూతన సంక్షేమ సంఘాన్ని మాజీ అధ్యక్షుడు కందాల నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా కోట్ల భాస్కర్ రావు, ఉపాధ్యక్షుడిగా రాజవర్ధన్ రెడ్డి, కోశాధికారిగా అశోక్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా వెంకట రెడ్డి నియమితులయ్యారు. ముఖ్య సలహాదారులుగా ఎ. రాంరెడ్డి, సబావత్ శ్రీకాంత్ నాయక్, మల్లేశం, వి. యాదగిరి, జి. జంగారెడ్డి, ఆదాల రాములు, శివశంకర్ గౌడ్, జంగయ్య తదితరులు ఎన్నిక య్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి కోసం నూతన కార్యవర్గం కృషి చేస్తుందన్నారు. సీసీ రోడ్లు, యూజీడీ, తాగునీరు ఇతర మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తామన్నారు.



8

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్

సోమవారం | సెప్టెంబర్ 23, 2024 | www.navatelangana.com

మంత్రులను కలిసిన చీర్యాల లక్ష్మీనృసింహ స్వామి ఆలయ చైర్మెన్ మల్లారపు లక్ష్మీనారాయణ గౌడ్



నవతెలంగాణ-కీసర

రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లను చీర్యాల లక్ష్మీనృసింహ స్వామి ఆలయ ఫౌండర్ చైర్మెన్ మల్లారపు లక్ష్మీనారాయణ గౌడ్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రులను, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. మంత్రులను కలిసిన వారిలో ఆలయ ధర్మకర్త శ్రీహరి గౌడ్ , యూత్ నాయకుడు మల్లారపు హరి గౌడ్ పాల్గొన్నారు.

ప్రతి నిరుపేద కుటుంబానికి అండగా ఉంటా

- బీఆర్ఎస్ నాయకులు గుర్రం శ్రీధర్ రెడ్డి



నవతెలంగాణ-కీసర

ప్రతి నిరుపేద కుటుంబానికి అండగా ఉంటానని బీఆర్ఎస్ నాయకులు గుర్రం శ్రీధర్ రెడ్డి అన్నారు. కీసర గ్రామం ఎస్సీ కాలనీలో గత వారం క్రితం మృతిచెందిన మొరుగు యాదమ్మ కుటుంబాన్ని ఆదివారం ఆయన పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతురాలి కుమారులు మొరుగు నరసింహ, బాలరాజులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు కర్రే గణేష్, పుంద్రు రాకేష్ తుడుం శ్రీనివాస్, మొరుగు మహేష్, చంద్రయ్యలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞం



- హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కాప్రా

మీర్పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ పరిధిలోని ఫస్ట్ ఫేజ్ ప్లే గ్రౌండ్‌లో విశ్వబ్రాహ్మణ సంఘం కాప్రా సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవిరాట్ విశ్వకర్మ18వ యజ్ఞమహెూత్సవానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విశ్వశాంతి కోసమై విశ్వకర్మలు ప్రతి ఏడాది యజ్ఞం, పూజలు చేస్తూ ఆ భగవానుడిని ఆరాధించడం గొప్ప విషయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్మి కమిటీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం మంచి విషయమన్నారు. యజ్ఞం అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు నూతలపాటి మల్లికార్జున చారి, చైర్మెన్ కేశోజు లక్ష్మీనారాయణ చారి, ప్రధాన కార్యదర్శి సమ్మని మురళి చారి, గౌరవ అధ్యక్షులు కేతోజు శ్రీనివాస చారి, యజ్ఞ కమిటీ అధ్యక్షులు కమ్మని సత్యనారాయణ చారి, కమ్మరి బాలకృష్ణ చారి, ప్రభాకర్ చారి, నాయకులు వసంత రావు, మల్లేష్ గౌడ్, ఉల్లెం బాలరాజు, నవీన్ గౌడ్, రామకృష్ణ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం



నవతెలంగాణ-కాప్రా

పేదలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా లయన్స్ క్లబ్ కృషి చేస్తున్నదని 320సీ జిల్లా లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వి.కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని హౌసింగ్ కాలనీలో లయన్స్ క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ గ్రీన్‌సిటీ, లయన్స్ క్లబ్ ఆఫ్ తెలంగాణ మెడికల్ అసోసియేట్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు వైద్యం అందిస్తున్నామని తెలిపారు. 320సి జిల్లా వ్యాప్తంగా సంక్షేమ కార్యక్రమాలు చేపడతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ ఫస్ట్ వైస్ గవర్నర్ ఇన్నారెడ్డి, రెండో వైస్ గవర్నర్ కృష్ణారెడ్డి, ప్రోగ్రాం కన్వీనర్, డిస్టిక్ పీఎస్టీ ఫోరం సురేష్ కుమార్, డిస్టిక్ క్యాబినెట్ సెక్రెటరీ శేఖర్ రెడ్డి, లైన్స్ క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ గ్రీన్ సిటీ అధ్యక్షురాలు జవ్వాజి రమాదేవి, కార్యదర్శి విష్ణు సాయి ప్రసాద్, కోశాధికారి సాయి కుమార్ గౌడ్, లయన్స్ క్లబ్ ఆఫ్ తెలంగాణ మెడికల్ అసోసియేట్స్ అధ్యక్షుడు డాక్టర్ అన్వేష్, డిస్టిక్ క్యాబినెట్ ట్రెజరర్ రామారావు, జిల్లా సేవా కార్యక్రమాల ప్రతినిధి కె.హనుమంతు రావు, కిషన్‌రావు, దేవి, కోటేశ్వరరావు, శ్రీనివాస్, చంద్రశేఖర్, కాలనీ ప్రతినిధులు నరేష్, ఉపేందర్, లక్ష్మీనారాయణ, రమేష్, నరసింహ, బ్రహ్మయ్య, మాక్సీ విజన్ ఐ హాస్పిటల్ సిబ్బంది, విజయ డయాగ్నస్టిక్ ప్రతినిధులు, క్లావ్ దంత వైద్యశాల ప్రతినిధులు, సన్‌సీడ్ వైద్యశాల సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు. 300మందికి వైద్య పరీక్షలు నిర్వహించి సన్‌సీడ్ హాస్పిటల్ వారు ఉచితంగా మందులు అందజేశారు.

సీపీఐ(ఎం) నాచారం శాఖ మహాసభ కార్యదర్శిగా పి. గణేష్



నవతెలంగాణ-కాప్రా

సీపీఐ(ఎం) నాచారం శాఖ మహాసభ నూతన కార్యదర్శిగా పి. గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నాచారంలోని పార్టీ కార్యాలయంలో గణేష్ బాధ్యతలు చేపట్టాక మొదటి సారిగా సీతారాం ఏచూరి సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యులందరూ ఏచూరి చిత్రపటానికి పూలమాలతో పూలతో నివాళు లర్పించారు. అనంతరం గణేష్ మాట్లాడు తూ.. సీపీఐ(ఎం) పార్టీకి ఎన్నికల్లో ఓటింగ్ శాతం తగ్గిందని, దేశవ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీలు బలహీనమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో సీతారాం ఏచూరి మరణం పార్టీకి తీరని లోటని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోవడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు అవుతుందన్నారు. ఎన్నికల వాగ్దానాలు ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేవలం ఉచిత బస్సు మాత్రమే పూర్తిస్థాయిలో అమలవు తుందని తెలిపారు. ఉచిత కరెంటు, రూ.500 సిలిండర్ పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. రుణమాఫీ పూర్తిగా అమలు కాలేదని, అర్హులైన పేదలకు పింఛన్లు, డబుల్ ఇండ్లు ఇస్తామని చెప్పి ఏ ఒక్కటీ అమలు చేయడం లేదన్నారు. మహాలక్ష్మి పథకం కింద అర్హులైన మహిళలకు రూ.2500 ఇస్తామని చెప్పి దాని గురించి మాట్లాడడం లేదన్నారు. గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు మహాసభలో అబ్జర్వర్స్ కొండారెడ్డి, శ్రీనివాసులు పలు సూచనలు చేశారు. 16 మందితో ఉన్న నాచారం శాఖను 50 మందితో ఏర్పాటు చేసుకోవాలని దిశ నిర్దేశం చేశారు. భవిష్యత్తులో బాబా నగర్, దుర్గా నగర్, ఇందిరానగర్, ఎర్రగుంట, పాత నాచారం, హెచ్‌ఎంటీ నగర్‌లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేయాలని తీర్మానించారు. అనంతరం సర్కిల్ కమిటీకి డెలిగేట్స్ ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సత్యనారాయణ, కొండల్ రెడ్డి, ప్రభాకర్, నూర్జహాన్, సరోజ, శ్రీనివాస్, రాంబాబు సుధీర్, మణెమ్మ, రామకృష్ణ, రాజు నాగమణి, ఉపేందర్ పాల్గొన్నారు.

జై గణేష్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం



నవతెలంగాణ-కాప్రా

కాప్రా ఓల్డ్ విలేజ్ చౌరస్తాలో జై గణేష్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద నిర్వహించిన అన్నప్రసాద కార్యక్రమానికి కొప్పుల కుమార్ పిలుపు మేరకు విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలో కాప్రా కార్పొరేటర్ స్వర్ణ రాజ్ శివమణి పాల్గొన్నారు. ఆయన వెంట భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కాప్రా కన్వీనర్ రేగళ్ల సతీష్ రెడ్డి, పవన్ కుమార్, జగదీష్, ప్రవీణ్, కొప్పుల నాగరాజు, తరుణ్, వరుణ్, అరుణ్, నితిన్, మధు, సింగం రాజు, శ్రీకాంత్ ఉన్నారు.

దేశంలో రాజీవ్‌గాంధీ సంస్కరణలే అమలవుతున్నాయి

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి విశ్వనాథన్



నవతెలంగాణ-ఉప్పల్

దేశ మాజీ ప్రధానిగా రాజీవ్‌గాంధీ హయాంలో తీసుకొచ్చిన సంస్కరణలే నేడు దేశంలో అమలవుతున్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ అన్నారు. ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వద్ద మాజీ ఎంపీ వి.హన్మంతరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న రాజీవ్‌గాంధీ విగ్రహ పరిశీలన, పూజా కార్యక్రమానికి ఆయన ముఖ్యతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ మాట్లాడుతూ.. దేశంలో రాజీవ్ గాంధీ అంటేనే ఐటీ రంగానికి ఆరాధ్యుడిగా పేర్కొంటారని తెలిపారు. దేశంలోని ప్రతి పౌరుడికి 18 ఏండ్లకే ఓటు హక్కును కల్పించారని గుర్తు చేశారు. నేడు దేశంలో అమలవుతున్న ప్రతిదీ రాజీవ్‌గాంధీ హయాంలోనే తీసుకొచ్చారని తెలిపారు. అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. త్వరలోనే ప్రియాంకగాంధీ చేతుల మీదుగా రాజీవ్ విగ్రహాన్ని ప్రారంభించనున్నట్టుగా తెలిపారు. మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో రాజీవ్‌గాంధీ క్రికెట్ స్టేడియం వద్దకు తరలివచ్చారు. భారీగా తరలి వచ్చిన పార్టీ శ్రేణులతో స్టేడియం వద్ద సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ వి.హన్మంతరావు, జితేందర్‌రెడ్డి ప్రభుత్వ సలహాదారులు (క్రీడలు)హరివర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు ,శివసేనారెడ్డి తదితరులున్నారు.

ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

- నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి



నవతెలంగాణ-కీసర

ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వార్డు నెం 2లో ఎలిఫెంట్ ఎంక్లేవ్ కాలనీలో మున్సిపల్ సాధారణ నిధులు రూ. 45 లక్షలతో డ్రయినేజీ నిర్మాణ పనులకు, రూ.30 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణానికి కౌకుట్ల చంద్రా రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాగారం మున్సిపాలిటీలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పాలక నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ బండారి మల్లేశ్ యాదవ్, స్థానిక కౌన్సిలర్ ఎలిజాల నాగేశ్ గౌడ్, కో ఆప్షన్ మెంబర్ క్యాసారం అశోక్ గౌడ్ కాలనీవాసులు పాల్గొన్నారు.



ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో సెప్టెంబర్ 19 నుండి 21 వరకు 15వ జాతీయ కుంగ్ ఫూ ఛాంపియన్ షిప్‌ను కుంగ్ ఫు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉత్తరప్రదేశ్ ఒలంపిక్ అసోసియేషన్ చే గుర్తింపు పొందిన అల్ల ప్రతాప్ యాదవ్ తండ్రి అల్ల నరేష్ నాగారమల్ నుండి ప్రాతినిధ్యం వహిస్తూ 35 కిలోల కేటగిరి కింద సాండా ఫైట్‌లో జాతీయ క్రీడల్లో తెలంగాణ రాష్ట్రం 'గోల్డ్ మెడల్' సాధించింది.
నవతెలంగాణ-నేరేడ్‌మెట్

పోచారం శివారులో భారీ చోరీ





నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మండలం పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ చోరీ జరిగింది. పోచారం పోలీస్ స్టేషన్ సీఐ రాజు వర్మ తెలిపిన వివరాల ప్రకారం... ఘట్కేసర్ మండలం మక్త గ్రామంలో నివసించే నాగభూషణం శంకర్‌పల్లి పరిధిలో తనకున్న భూమిని ఇటీవల విక్రయించారు. భూమి కొనుగోలు దారులు అతడికి రూ.2 కోట్లు అడ్వాన్సుగా ఇవ్వడంతో ఇంటికి తీసుకొచ్చి భద్రపరిచాడు. అయితే ఆదివారం తెల్లవారుజామున రోజులాగే నారపల్లి శివారులో ఉన్న తన ఫామ్ హౌజ్‌లో గేదెలను చూసుకోవడానికి వెళ్లాడు. నాగభూషణం భార్య ఇంట్లోనే నిద్రిస్తుండడంతో తలుపు బయట వైపు గడియ పెట్టి వెళ్లాడు. ఈ విషయాన్ని పసిగట్టిన గుర్తు తెలియని దొంగలు ఇంట్లోకి చొరబడి రెండు కోట్ల నగదు నిలువ ఉంచిన బ్యాగును, సుమారు 35 తులాల బంగారు నగలను ఎత్తుకెళ్లారు. కొద్దిసేపటి తర్వాత నాగభూషణం భార్య పద్మ లేచి చూసేసరికి నగదు ఉన్న బ్యాగుతో పాటు బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని చోరీ జరిగిన ప్రాంతంలో ఆనవాళ్ళ కోసం క్లూస్ టీం సహాయంతో విచారణ జరుపుతున్నారు. సమాచారం తెలుసుకున్న మల్కాజిగిరి ఏసీపీ సంఘటన స్థలానికి వచ్చి వివరాలు తెలుసుకున్నారు.

మండపం ఏర్పాటుకు శంకుస్థాపన



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మల్కాజిగిరిలోని గాంధీ పార్కులో ఆదివారం జై భవాని ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ ఆధ్వర్యంలో మండపం ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీష్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా నవరాత్రి ఉత్సవాలను గాంధీ పార్క్‌లో నియమనిష్ఠలతో నిర్వహిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఎం. నాగేందర్ గౌడ్, ఏ. సురేష్, కేశా దాదా, ఎస్. అనిల్ గౌడ్, కోటేశ్వర్, నవీన్, శ్రీకాంత్, రజిని గౌడ్, నల్లవెల్లి రాజు, సుమంత్, జ్ఞానేశ్వర్, బి. అనిల్ గౌడ్, సంకురి సాయి, రాము, శ్రీనివాస్ గుప్తా, రామకృష్ణ గుప్తా, భాను, అనుదీప్, అభిషేక్, అరవింద్, బి. అరవింద్, రాహుల్, రోహిత్, శ్రీకాంత్, ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్. వినయ్ జన్మదిన వేడుకలు





- అన్నదానం నిర్వహించిన వీహెచ్‌పీఎస్ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వికలాంగుల హక్కుల పోరాట సమితి మల్కాజిగిరి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం మల్కాజిగిరిలోని జీహెచ్‌ఎంసీ కార్యాలయం వద్ద వికలాంగుల హక్కుల పోరాట సమితి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు ఎన్. వినయ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యుల సమక్షంలో వందమందికి పైగా అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎన్. వినయ్ మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమం, అభివృద్ధికి చేస్తున్న సేవకు కృతజ్ఞతతో అన్నదానం నిర్వహించడం సంతోషంగా ఉందని, తోటి వికలాంగుల మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మి, వెంకటేష్, రజిత, శోభ, జ్యోతి, విజయ, తదితరులు పాల్గొన్నారు.

మహనీయులకు జ్ఞానమాల సమర్పణ



నవతెలంగాణ-కాప్రా

కాప్రా మండల పరిధిలోని జమ్మిగడ్డ ప్రాంతంలో ఉన్న బీజేఆర్ కాలనీలో జ్ఞానమాల టీం ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు 121వ వారం పూల మాలతో జ్ఞానమాల సమర్పించారు. ఈ కార్యక్రమంలో జ్ఞానమాల టీం ఆర్గనైజర్ తాడూరి గగన్ కుమార్, సభ్యులు ఎస్.ఏ రహీం, నర్సింహ్మా చారి, రవి నాయక్, దయానంద్, అనిల్ కుమార్, వెంకటయ్య, నాగేష్, శేఖర్ సేటు, మెకానిక్ కొండల్, కుమార్. పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటంలో
ఎర్ర జెండా నాయకులు ముందుండాలి

- సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా నాయకురాలు ఎం. వినోద,
- రామంతపూర్ శాఖ కార్యదర్శిగా వై. వెంకటేశ్వర్లు ఎన్నిక



నవతెలంగాణ-ఉప్పల్

ప్రజా సమస్యల పోరాటంలో ఎర్రజెండా నాయకులు ముందుండి, ప్రజలకు అండగా నిలిచి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సీపీఐ (ఎం) మేడ్చల్ జిల్లా నాయకురాలు ఎం. వినోద అన్నారు. ఆదివారం రామంతపూర్‌లోని రాజేంద్రనగర్ శాఖ మహాసభ కార్యక్రమానికి ఉప్పల్ కార్యదర్శి జె. వెంకన్నతో కలిసి హాజరయ్యారు. ఈ శాఖ మహాసభలో శాఖ కార్యదర్శిగా వై. వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామంతపూర్‌లోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో పోరాటాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. గాంధీనగర్‌కు బస్సు సౌకర్యాలు కల్పించాలని, స్థానికంగా రోడ్లు, డ్రయినేజీ, కరెంటు తదితర సమస్యల పరిష్కారం కోసం పార్టీ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నామాల శీను, యాదగిరి, హుస్సేన్, లక్ష్మణ్, సీతారాములు, దయానంద్, సర్కిల్ కమిటీ సభ్యులు శేషు తదితరులు పాల్గొన్నారు.

నదులు, జలాశయాల సంరక్షణ అందరి బాధ్యత

- ఎఫ్‌బీహెచ్ చైర్మెన్ ప్రొఫెసర్ వేద కుమార్



నవతెలంగాణ-శామీర్‌పేట

నదులు, జలాశయాల సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని చేయి చేయి కలిపి నదులను కాపాడుకుందామని ఎఫ్‌బీహెచ్ చైర్మెన్ ఇంటాక్ న్యూఢిల్లీ జాతీయ సభ్యుడు ప్రొఫెసర్ వేద కుమార్ పలువురు వక్తలు అన్నారు. ఆదివారం ప్రపంచ నదుల దినోత్సవం సందర్భంగా ఫోరం ఫర్‌ఎబెటర్ హైదరాబాద్ వరల్డ్ రివర్స్ డే, కెనడా సహకారంతో, సివిల్ సొసైటీ గ్రూపులు, హైదరాబాద్ ప్రభుత్వ సిటీ కళాశాల, దక్కన్ హెరిటేజ్ అకాడమీ, జేబీఆర్ ఆర్కిటెక్చర్ కళాశాల, సెయింట్ పాట్రిక్స్ హ ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్, శ్రీసాయి విద్యా నికేతన్ హైదరాబాద్, తెలంగాణ సంయుక్తంగా ఇంటాక్ జాతీయ పాలక మండలి సభ్యుడు ప్రొఫెసర్ వేదకుమార్ మణికొండ అధ్యక్షతన శామీర్‌పేట పెద్ద చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా లేక్ అవుట్ ఫ్లో సదరన్ బండ్ ఒడ్డున వాకింగ్ నిర్వహించారు. సందర్శకులకు ఎఫ్‌బీహెచ్ ప్రధాన కార్యదర్శి శోభా సింగ్ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఫోటో ఎగ్జిబిషన్ నిర్వహించగా చూపర్లను ఆకట్టుకుంది. సందర్భంగా వేదకుమార్ మాట్లాడుతూ.. తెలంగాణలో ఎఫ్‌బీహెచ్ మూడేండ్లుగా ప్రపంచ నదుల దినోత్సవాన్ని జరుపుకుంటోందన్నారు. ఈసారి శామీర్ పేట పెద్ద చెరువు వద్ద ఏర్పాటు చేశామని తెలిపారు. నదులను పరిశుభ్రంగా ఉంచుకోవడం మన బాధ్యత అన్నారు. ప్రపంచంలో కాలుష్యం నుంచి నదులు, జలవనరులను పరిరక్షించే బాధ్యతను ప్రభుత్వం మాత్రమే కాదని, పౌరసమాజం, సంస్థలు, యువత బాధ్యత తీసుకోవాలని ఆయన ఉద్ఘాటించారు. శామీర్ పేట సరస్సును 6వ నిజాం మెహబూబ్ అలీ పాషా హైదరాబాద్ చుట్టుపక్కల ఉత్తమ సూర్యాస్తమయం ప్రదేశంగా ఎంపిక చేశారని, హైదరాబాద్ పర్యటనలో ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన అతిథుల మధ్య ఈ సరస్సును ప్రాచుర్యం పెంపొందించారని, శామీర్‌పేట్ సరస్సు చుట్టూ ఉన్నరాతి నిర్మాణాన్ని ప్రశంసించారు. ద్యావనపల్లి సత్యనారాయణ కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంత సంస్కృతి గురించి వివరిస్తూ ప్రజల జీవితంలో తాగు, సాగుకు నదీజలాల ప్రాముఖ్యతను వివరించారు. కాలువ వెంబడి, సరస్సు చుట్టూ రాతి షెల్టర్లు, పెయింటింగ్ ప్రాముఖ్యతను వివరించారు. శిల్పాలు, శాసనాల ద్వారా ప్రదేశం చుట్టూ నాగరికత ఉనికిని రుజువు చేస్తుందన్నారు. కార్యక్రమంలో శామీర్‌పేట పరిరక్షణ కమిటీ కన్వీనర్ రవీంద్రరెడ్డి, వాటర్ హార్వెస్టింగ్ నిపుణుడు సుభాష్ రెడ్డి, ఎఫ్బీహెచ్ సభ్యుడు నరహరి, ఎఫ్‌బీహెచ్ కోఆర్డినేటర్ ప్రభాకర్, పర్యావరణవేత్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల యాజమాన్య పాల్గొన్నారు.

అలియాబాద్‌లో అన్నదానం



నవతెలంగాణ-శామీర్‌పేట

వినాయకుడి నిమజ్జనంలో భాగంగా ఆదివారం శామీర్‌పేట మండలం అలియాబాద్ గ్రామంలోని బస్ స్టాప్ హనుమాన్ టెంపుల్ వద్ద అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మండప నిర్వాహకులు, ప్రజలు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న సరసం మోహన్‌రెడ్డి



నవతెలంగాణ-శామీర్‌పేట

సిద్దిపేట జిలాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామిని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి వారి కుటుంబ సభ్యులు, శామీర్‌పేట మండల బీఆర్ఎస్ నాయకులతో కలిసి దర్శించుకున్నామని శామీర్‌పేట మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సరసం మోహన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వంగ వెంకట్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ భూమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి నియోజకవర్గం కేపీహెచ్‌బీ టెంపుల్ బస్ స్టాప్‌లో కూకట్‌పల్లి నియోజకవర్గం ముస్లీం యూత్ ఆధ్వర్యంలో.. ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహ్ అలేహివ సల్లాం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి పాల్గొని సుమారు 2000 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ మగ్దుం, వారి మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



కేపీహెచ్‌బీ కాలనీ టెంపుల్ బస్టాప్లో కేపీహెచ్‌బీ కల్చర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో 15 రోజులు గణనాధునికి అంగరంగ వైభవంగా పూజలు నిర్వహించారు. శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి వారి మిత్ర బృందం ఆధ్వర్యంలో గణనాథుడి నిమజ్జన కార్యక్రమం కనీవినీ ఎరుగని రీతిలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేలాదిగా భక్తులు, అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, కమిటీ సభ్యులు, కూకట్ పల్లిలో అన్ని గణేష్ మండపాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తనకు మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేత



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం దుండిగల్ మున్సిపాలిటీ "డి.పోచంపల్లి డబుల్ బెడ్ రూమ్" ఇండ్ల లబ్దిదారులు కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో.. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్‌ని కలిసి మంచి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో గల డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద మౌలిక వసతుల కల్పనను కృషి చేస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యే అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ పొందిన లబ్దిదారులు కొందరు ఇప్పటికే వారి కేటాయించిన ఫ్లాట్లలో నివసిస్తున్నారని వారికి అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు నవీన్, ప్రధాన కార్యదర్శి వినోద్ నాయక్, ఉపాధ్యక్షులు భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో కుల, మతాలకు అతీతంగా పండుగలు జరుగుతాయి



● కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

దేశంలో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ పండగలు కులమతాలకు అతీతంగా మత సామరస్యంతో జరుగుతాయని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. మిలాద్ ఉన్ నబి సందర్భంగా కూకట్‌పల్లి ముస్లిం యూత్ ఆధ్వర్యంలో.. కేపీహెచ్‌బీ కాలనీ బస్టాండ్ వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఉత్సవాలను సోదర భావంతో నిర్వహించుకుంటారన్నారు. హిందూ, ముస్లిం ఉత్సవాలు ఏకకాలంలో వచ్చినా ప్రశాంత వాతా వరణంలో సోదర భావంతో ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో జరుపుకోవడం అభినం దించదగ్గ విషయం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పండుగల నిర్వహణకు పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం చేస్తున్నారన్నారు. నిర్వాహకులు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొట్టి ముక్కల వెంకటేశ్వరరావు, గాలి బాలాజీ, ఎల్ రాజా, డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ అరవింద్ రెడ్డి, మగ్దూం, రంగస్వామి, లక్ష్మయ్య, టీడీపీ డివిజన్ అధ్యక్షుడు షేక్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.


అర్హులైన జర్నలిస్టుల వివరాల సేకరణ చేపట్టాలి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాల కేటాయింపు కోసం యూనియన్ పకడ్బందీగా పనిచేస్తుందని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం నాయకులు స్పష్టం చేశారు. ఆదివారం సూరారం విలేజ్ వి.ఐ.పి ఫంక్షన్ హాల్లో జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు అధ్యక్షత నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కోశాధికారి మోతే వెంకట్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం కట్టుబడి పని చేస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. మునిపెన్నడూ లేని విధంగా జర్నలిస్టులకు హౌసింగ్ ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వం జీవోలు జారీ చేసేందుకు ప్రత్యేక చొరవ చూపిస్తుందని తెలిపారు. ఇది ఎంతో హర్షించదగ్గ విషయం అన్నారు. ప్రభుత్వం పెద్దలు చూపిస్తున్న మార్గదర్శకళ మేరకు సమాజంలో జర్నలిస్టుగా పనిచేస్తున్న ప్రతి ఒక్కరిని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గ, మండలాల వారిగా సమావేశాలను నిర్వహించి వర్కింగ్ జర్నలిస్టులను గుర్తించాల్సిన బాధ్యత మనపైనే ఉందని తెలిపారు. రానున్న వారం రోజులలో ప్రాంతాలవారీగా సమావేశాలను ఏర్పాటు చేసి జిల్లావ్యాప్తంగా వర్కింగ్ జర్నలిస్టులను గుర్తించే ప్రక్రియను చేపట్టాలని దిశా నిర్దేశం చేశారు. తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో వర్కింగ్ జర్నలిస్టులను గుర్తించే ప్రక్రియ రాష్ట్ర వ్యాప్తంగా మొదలైందని స్పష్టం చేశారు. జిల్లాలో సేకరిస్తున్నటువంటి జర్నలిస్టుల వివరాలను మీడియా అకాడమీకి అందజేస్తామని జిల్లా అధ్యక్షులు గడ్డమీద బాలరాజ్ స్పష్టం చేశారు. వచ్చే నెలలో జూనియర్ ఆధ్వర్యంలో.. నిర్వహించ తలపెట్టిన ముఖ్యమంత్రితో జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం విజయవంతం చేయడానికి ప్రతి జర్నలిస్ట్ కృషి చేయాలని కోరారు. యూనియన్లకు అతీతంగా మండలాలు నియోజకవర్గం వారిగా సీనియార్టీ ప్రతి పాదికతన లిస్టులను తయారు చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రాంరెడ్డి, కోశాధికారి బిక్షపతి, ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలలో సెయింట్ పీటర్స్ విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ -మేడ్చెల్

మొయినాబాద్‌లోని నారాయణ్ గురుకుల ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో నైపుణ్య పేరుతో కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మైసమ్మ గూడలోని సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యారులు కబడ్డీలో పాల్గొని ద్వితీయ స్థానం సాధించారు. ఫైనల్లో జరిగిన పోటీలో అద్భుత ప్రతిభ కనబరిచిన జి.దేవేందర్ గౌడ్ జట్టు సభ్యులను,ఫిజికల్ డైరెక్టర్స్ కె.రవీందర్, డా.పి జె వి.రత్నకుమార్‌లను కళాశాల సెక్రటరీ టి.వి.రెడ్డి, ప్రిన్సిపాల్ డా.కె శ్రీలత అభినందిచారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ సరోజ రెడ్డి, అడ్మినిస్ట్రేటర్ డైరెక్టర్ అనురాగ్ రెడ్డి, ఆర్ ఓ రవి సుధాకర్ పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం ప్రారంభం





● కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్ రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కూకట్‌పల్లిలోని రాందేవ్రావు ఆస్పత్రిలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమాన్ని కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్ రావు పాల్గొని ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో బాలానగర్ డివిజన్‌లోని ఎనిమిది పోలీసు స్టేషన్లలో గల పోలీసు సిబ్బందికి యాన్యువల్ హెల్త్ చెకప్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాలకు తమ సేవలను అందించేందుకు రాందేవ్ రావు హాస్పిటల్ అభినందనీయమన్నారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ రాందేవ్ రావ్ హాస్పటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్ ని శాలువాలతో, పుష్పగుచ్చాలతో సన్మానించారు. హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్ మాట్లాడుతూ సమాజం యొక్క భద్రతకై పోలీసు శాఖ వారు అహర్నిశలు శ్రమిస్తారు.. అటువంటి పోలీసు శాఖ వారి ఆరోగ్య భద్రత కోసమై ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. హాస్పిటల్ సీఈవో డాక్టర్ యోబు మాట్లాడుతూ కరోనా సమయంలో పోలీసు శాఖ వారు ఈ సమాజానికి చేసిన సేవలు మరవలేనివన్నారు. సమాజంలోని ఏ పౌరునికి ఎటువంటి కష్టం వచ్చినా మొదటిగా సంప్రదించేది పోలీస్ శాఖ వారినే అని, సమస్యను పరిష్కరించడంలో ఎన్ని అవాంతరాలు కష్టనష్టాలు ఎదురైనా కూడా సమస్యను పరిష్కరించడమే తమ అంతిమధ్యయంగా పోరాడే అంత గొప్ప పోలీసు శాఖ వారికి ఈ రోజున ఈ మెగా వైద్య శిబిరం నిర్వహించి ఆరోగ్య పరీక్షలు చేయడం అనేది ఎంతో ఆనందాన్ని కలుగజేసే విషయం అని పేర్కొన్నారు. ఇటువంటి గొప్ప అవకాశాన్ని రాందేవ్ రావ్ హాస్పటల్‌కు ఇచ్చినందుకు కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్ రావుకీ, బాలానగర్ ఏసీపీ హనుమంతరావుకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఏసీబీ హనుమంతరావు ఈ మెగా వైద్య శిబిరం పర్యవేక్షించి సమాజానికి ఇంత మంచి ఆరోగ్య సేవలను అందిస్తున్న రాందేవ్ రావు హాస్పిటల్‌ను కొనియాడారు. ఈ వైద్య శిబిరంలో అల్లాపూర్, సనత్ నగర్, బాలనగర్, కూకట్ పల్లి, కె.పి.హెచ్.బి, జీడిమెట్ల, బాచుపల్లి, జగద్గిరిగుట్ట స్టేషన్లలోని ఏసీపీ క్యాడర్ మొదలుకొని కానిస్టేబుల్స్ వరకు ఉన్న అన్ని విభాగాల వారికి ఈ మెగా వైద్య శిబిరంలో ఉచితంగా అన్ని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ మెగా వైద్య శిబిరం రాందేవ్ రావ్ హాస్పిటల్లో నిర్వహించడం ఎంతో ఆనందాన్ని కలుగజేసే విషయమని హాస్పిటల్ యాజమాన్యం విక్రమ్ దేవ్ రావ్, మీరా రావు, అపర్ణ రావు, ప్రశాంత్ రెడ్డిలు తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి ఇన్‌స్పెక్టర్ కె.ముత్తు, కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, బాచుల్లి ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ రావు, అల్లాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి, జగద్గిరిగుట్ట ఇన్స్పెక్టర్ కే. క్రాంతి కుమార్, జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ జి.మల్లేష్, బాలానగర్ ఇన్‌స్పెక్టర్ పి. నవీన్ కుమార్, సనత్ నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, రాందేవ్ రావ్ హాస్పటల్ కన్సల్టెంట్ డాక్టర్స్ డ్యూటీ డాక్టర్స్ నర్సులు, అడ్మిన్ మేనేజర్స్ తదితరులు పాల్గొన్నారు.

'మార్క్సిజమే నమ్మిన సీతారాం ఏచూరి చరిత్రలో నిలిచిపోతారు'

● భారత లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు

నవతెలంగాణ-హిమాయత్ నగర్



స్నేహం, సిద్ధాంతం, సహజత్వం, సమా నత్వం, సౌభ్రాతృత్వం, ఉద్యమ చైతన్యం, అభ్యుద య ఆచరణల అంతిమ విజయమే మార్క్సిజమని నమ్మిన దివంగత సీపీఐ(ఎం) అగ్ర నాయకులు సీతారాం ఏచూరి చరిత్రలో నిలిచి పోతారని భారత లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో ఆయనను కొనియాడారు. ఆశయాలను నమ్మి అవే ఆచరించిన ఏచూరి మార్క్సిజమే శ్వాసగా తన జీవితాంతం మతోన్మాద ఫ్యూడల్ శక్తులు రెచ్చిపోకుండా వారి కట్టడికి ప్రజలను జాగ్రత్త పరిచిన వ్యూహకర్త ఏచూరి ప్రజల గుండెల్లో చిరకాలం నిలిచిపోతారని ఆయన కొనియాడారు.

న్యాక్ ఆధ్వర్యంలో శిక్షణ..

నవతెలంగాణ-ధూల్ పేట్

సిటీ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (న్యాక్) ఆధ్వర్యంలో సివిల్ ఇంజనీర్స్ గ్రాడ్యుయేట్స్ కోర్సును నిర్వహిస్తున్నట్లు న్యాక్ డైరెక్టర్ శాంతి శ్రీ ఓ ప్రకటనలో తెలిపారు. 45రోజుల కాలవ్యవధి గల ఈ కోర్సు (మెకానికల్, ఎలక్ట్రికల్, పంబ్లింగ్) నిర్వహించబడుతుందన్నారు. శిక్షణ అనంతరం ఉపాధి కల్పిస్తామన్నారు. ఫీజు రూ.15 వేలు ఉంటుందన్నారు. వివరాలకు 7989087226 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.



ఈనెల 23న జరిగే చలో లేబర్ కమిషనర్ ఆఫీస్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ నాంపల్లి జోన్ కార్యదర్శి సి.మల్లేష్, నగర నాయకులు కృష్ణలు కార్మికులకు పిలుపునిచ్చారు. నాంపల్లి నియోజకవర్గం సీఐటీయూ కమిటీ ఆధ్వర్యంలో లేబర్డాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు నాంపల్లి భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఇన్నయ్య, రాములు, వీరేశం, నాగరాజు, నరసింహారెడ్డి లతో కలిసి కరపత్రాలను విజయనగర్ కాలనీ లేబర్ అడ్డ నాంపల్లి లేబర్ అడ్డ మురద నగర్ లేబర్‌లో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల కార్డు ద్వారా ఇచ్చే లేబర్ ఇన్సూరెన్స్ బెనిఫిట్‌ను ప్రయివేటు కంపెనీలకు అప్పచెప్పొద్దన్నారు. అవి వెల్ఫర్ బోర్డులోనే ఉంచాలని తద్వారా కార్మికులకు న్యాయం జరుగుతుంద నన్నారు. ప్రయివేటు ఇన్సూరెన్స్‌కి అప్పజెప్పడం వల్ల అవినీతి జరిగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ వెల్ఫేర్ బోర్డుతో మాత్రమే కొనసా గించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. చలో లేబర్ కమిషనర్ ఆఫీస్‌ను ప్రతి కార్మికుడు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నవతెలంగాణ-ధూల్ పేట్

విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం

నవతెలంగాణ-చంద్రాయనగుట్ట

ఉప్పు గూడ లలితా బాగ్‌లోని ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రీమద్విరాట్ విశ్వకర్మ యజ్ఞమహోత్సవం ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షులు దాసోజు కనుక చారి ఆధ్వర్యంలో జరిగిన ఈ యజ్ఞమహోత్సవ కార్యక్రమం ఉదయం 8:30 కు విశ్వకర్మ భగవానుని ధ్వజారోహణం 9 నుంచి 10 గం॥ వరకు విశ్వకర్మ భగవానుని పూజ పదిన్నర నుంచి 12:30 వరకు విశ్వకర్మ భగవానుని యజ్ఞం మహోత్సవ కార్యక్రమం జరిగింది. కార్యక్రమాలు అనంతరం రెండు గంటలకు అన్న ప్రసాద వితరణ జలపల్లి నాకు లక్ష్మీనారాయణ చారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి తోట శ్రీనివాసచారి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విశ్వకర్మ భగవానుని పూజా కార్యక్రమం బస్తీ వాసులు విశ్వబ్రాహ్మణ మనుమయ త్వష్ట శిల్పి పంచదాయిలు కలిసిమెలిసి సకుటుంబ సపరివారంగా ఈ పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తామన్నారు. సంఘ సభ్యులు విశ్వబ్రాహ్మణ కుల పెద్దలు కలిసి వస్తురూపేనా ఆర్థికంగా ఒకరినొకరు సహకరించుకొని ఈ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటామని పేర్కొన్నారు. సాయంత్రం ఐదు గంటలకు విశ్వకర్మ భగవానుని ఊరేగింపు కార్యక్రమాన్ని బస్తీ వీధులలో ఘనంగా ఊరేగింపు నిర్వహించి ప్రజల్లో ఆధ్యాత్మిక వాతావరణం పెంపొందే విధంగా ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి తోట శ్రీనివాస్ చారితో పాటు బోనాల మధుసూదన్ చారి, యజ్ఞ నిర్వాహకులు జలపల్లి లక్ష్మణ చారి, సజ్జనవు షణ్ముఖ చారి, లక్కుంట్ల శ్రీనివాసాచారి, కూరెళ్ళ బాలకృష్ణ చారితో పాటు బస్తీ వాసులు పాల్గొన్నారు.

జీడిమెట్ల పోలీసులను సస్పెండ్ చేయాలి

● మానవ హక్కుల వేదిక డిమాండ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



షాపూర్ నగర్ నివాసి అయిన రాము నాయక్‌ను ఈనెల సెప్టెంబర్ 16వ తారీఖు ఉదయం జీడిమెట్ల పోలీసులు, స్టేషన్‌కి తీసుకెళ్లి థర్డ్ డిగ్రీ ప్రయోగించిన విషయం మీద మానవ హక్కుల వేదిక నిజ నిర్ధారణ చేసింది. తన మిత్రులు రూ.5 వేలు దొంగతనం చేసారు అని వారిని పట్టించి.. డబ్బులు ఇప్పించవలసిందిగా పోలీసులు తిడుతూ.. లాఠీలతోని, బెల్ట్‌తోని కొట్టారు అని.. తన ఎడమ కాలు, చెయ్యి పడిపోయింది. పనికి పోలేకపోతున్నాను అని బాధితుడు రాము మానవ హక్కుల వేదిక బృందంతో చెప్పాడు. తాకిన దెబ్బలను హాస్పిటల్‌లో చూపించుకోవడానికి డబ్బులు కూడా లేవు అని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఎలాంటి సంబంధం లేని విషయం మీద తనను పోలీస్ స్టేషన్‌కి తీసుకెళ్లి కొట్టారు అని రాము వాపోయాడన్నారు. బాధితుడు రామును తక్షణమే హాస్పిటల్‌కి పోలీసులే తీసుకెళ్లి చికిత్స చేయించాలని మానవ హక్కుల వేదిక హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి సంజీవ్ డిమాండ్ చేసారు. ఇదే పోలీస్ స్టేషన్లో కొన్ని రోజుల కిందట అశోక్ అనే వ్యక్తిని కొట్టడం వల్ల, తాను ఆత్మహత్య చేసుకొని చనిపోయాడు. ఇది రెండో సంఘటన అని, ఈ రెండు సంఘటనల మీద ఎంక్వయిరీ చేసి, వాటి నివేదికలను సామజిక మాధ్యమాలలో పెట్టాలి అని కోరారు. ఇందుకు బాద్యులు అయిన పోలీసులను సస్పెండ్ చేసి, చట్ట పరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేసారు. పోలీస్ స్టేషనులో జరుగుతున్న ఆకృత్యాలు గురించి సైబరాబాద్ కమిషనర్‌కి నివేదిక సమర్పిస్తాము అని చెప్పారు. నిజ నిర్ధారణ బృందంలో సంజీవ్‌తో పాటు మానవ హక్కుల వేదిక హైదరాబాద్ నగర కార్యదర్శి రోహిత్ పాల్గొన్నారు.

ఈత ఒక సాధనంగా పాఠంశంలో చేర్చాలి



● సామాజిక, ప్రకృతి ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఈత ఒక సాధనంగా పాఠ్యాంశంలో చేర్చాలని సామాజిక, ప్రకృతి ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ మేడ్చల్ మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్‌ను ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యతో పాటు ఈతలో నైపుణ్యం కలిగి ఉండటం ఎంతో మంచిది అన్నారు. ఈతరాక ఎంతోమంది విద్యార్థులు నీటి ప్రమాదంతో మృత్యువాత పడుతున్నారన్నారు. తెలుగు రాష్ట్రాలలో ప్రతి సంవత్సరం 1000 నుంచి 1500 మంది వరకు విద్యార్థులు చనిపోవడం విచా రకరమన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 50 నుంచి 60 వేల మంది విద్యార్థులు నీటిలో మునిగి ఈత రాణి కారణంగా చనిపోతున్నారన్నారు. ఈతలో అనుభవం ఉన్న విద్యార్థులకు 3 నుంచి 10వ తరగతి వరకు సోషల్, సైన్స్‌లలో రెండు మార్కులు అదనంగా కలపాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి, ఈ నాపోరాటం, ప్రయత్నంలో గత 15 ఏండ్లుగా దివంగత మాజీ సీఎం వైయస్సార్, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌లకు పలుమార్లు విన్నవించడం, వినతి పత్రాలు అందజేయడం జరిగిందన్నారు. అప్పుడు కార్యాచరణకు నోచుకోని ఈత సమస్యను ఇప్పుడైనా తమరు ఎంపీగా మా కల నెరవేర్చేందుకు కృషి చేయాలని కోరుతున్నా మన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి 18వ శబరిమల మహా పాదయాత్ర : ఎంపీ ఈటెల రాజేందర్ ...

శ్రీ నిఖిల సాయి మైత్రేయ మధుసూదన సరస్వతి పీఠం నిర్వాహకుడు సుబ్రహ్మణ్యస్వామి 18వ శబరిమల మహా పాదయాత్ర సందర్భంగా 22వ తేదీ ఆదివారం సూరారం కాలనీ, దయానంద్ నగర్, జై సంతోషి నగర్ శివాలయం వద్ద అయ్యప్ప పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప పడిపూజ, అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సుబ్రహ్మణ్యస్వామి మాట్లాడుతూ తాను ఇప్పటికి ఇరువై ఏడు సార్లు శబరిమలకు మాలధారణ వేసి స్వామిని దర్శించుకోవడం జరిగిందని, ఇందులో భాగంగా పదిహేడు సార్లు పాదయాత్ర చేసినట్టు తెలిపారు. ఈ సారి పద్దెనిమిదవ సారి మహా పాద యాత్ర చేస్తున్నట్టు, మొత్తం ముప్పై రెండు రోజులపాటు జరిగే ఈ పాదయాత్రలో అక్టోబర్ ఇరువై ఐదవ తేదీన శబరిమల చేసుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్, ముఖ్య సలహాదారులు సర్వేపల్లి రమేష్ కుమార్, కార్యవర్గ సభ్యులు గడ్డం రాంబాబు, హరి రాఘవేంద్ర, శ్రీధరాచార్యులు, బీజేపీ నాయకులు వాసు, శంకర్, సుబ్రహ్మణ్య స్వామి కుటుంబ సభ్యులతో పాటు అయ్యప్ప భక్తులు, స్థానికులు అధిక సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.



వినాయకుడి లడ్డు రూ.3.60 లక్షలకు చీల్ల అశోక్ కైవసం



నవతెలంగాణ-మేడ్చల్

గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని సుతారిగూడలోని హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జనం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డు వేలంలో చీల్ల అశోక్ పాల్గొని రూ.3లక్షల 60వేలకు లడ్డును కైవసం చేసుకున్నారు. మేడ్చల్ మున్సిపాలిటీ పాత గ్రామ పంచాయతీ వద్ద వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జన కార్యక్రమం యూత్ అధ్యక్షుడు వెంకటేష్ వంజరి ఆధ్వర్యంలో నిర్వహించారు. లడ్డును వేలం పాటలో యూత్ సభ్యుడు నావతి ఫణీంద్ర వంజరి రూ.1లక్ష 50వేలకు కైవసం చేసుకున్నారు. వినాయకుడి డబ్బుల హారం రాఘవ రెడ్డి రూ.17 వేలకు, మరో డబ్బుల హారం శ్రీ వైష్ణవి జువెలర్స్ మొల్లంగిరి రఘుచారి రూ.22వేలకు దక్కించుకున్నారు.

గోవులతో పర్యావరణ పరిరక్షణ

నవతెలంగాణ - ధూల్ పేట్

గోవులతో పర్యావరణ పరిరక్షణ ఉంటుందని, గోరక్షణ , భూ రక్షణ , పర్యావరణ రక్షణ కోసం గోరక్ష మహా పాదయాత్రను తలపెట్టినట్లు అఖిల భారత గో సేవ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బాలకృష్ణ గురు స్వామి తెలిపారు. బషీర్ బాగ్ లోని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి , పుంగనూరు ఆవుతో కలిసి హిమాయత్ నగర్ టీటీడీ ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు తలపెట్టిన ఈ మహా పాదయాత్ర ఈ నెల 27 నుండి జమ్మూ కాశ్మీర్ లో ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. 14 రాష్ట్రాల మీదుగా ఆరు నెలల పాటు 4900 కిలోమీటర్లు ఈ పాదయాత్ర కొనసాగనున్నట్లు వివరించారు. గోవుతో పాటు పాదయాత్ర నిర్వహిస్తూ , గోవుల రక్షణ , గోవుల కారణంగా పర్యావరణానికి కలిగే లాభాలను వివరిస్తూ , ప్రజల్లో చైతన్యం తీసుకువస్తామన్నారు. లవ్ ఫార్ కౌ ఫౌండేషన్ చైర్మెన్ జస్మత్ భాయ్ పటేల్ మాట్లాడుతూ... దేశంలో గో హత్యలు పెరిగిపోవడం బాధాకరమని.. పాలకులు రక్షణ చట్టాలు అమలు చేయాలన్నారు. వాటి తో దేశం పాడి పంటలతో అభివృది చెందుతుందన్నారు.

బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం

- నేడు బ్లాక్ డే పాటిద్దాం
- నాలుగు లేబర్ కోడ్ల ప్రతులను దహనం చేద్దాం
- సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి జె.చంద్రశేఖర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

కేంద్ర బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దామని సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి జె.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2019లో వేతనాల కోడ్, 2020లో ఐఆర్ కోడ్, ఓఎస్మాచ్ కోడ్, సామాజిక భద్రతా కోడ్ మొత్తం నాలుగు లేబర్ కోడ్లను కేంద్ర బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించిందని తెలిపారు. అంతకు ముందున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో ఈ నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి బీజేపీ ప్రభుత్వం కార్మికవర్గ హక్కులను విదేశీ-స్వదేశీ పెట్టుబడిదారులకు కట్టబెట్టి, కార్మిక వర్గానికి తీవ్రమైన నష్టం చేసిందని తెలిపారు. పార్లమెంట్‌లో ప్రజాస్వామ్య పద్ధతిలో చర్చలు జరపకుండా యాజమాన్యాలకు కేంద్ర ప్రభుత్వం కొమ్ము కాసిందని తెలిపారు. నాలుగేండ్లుగా ఈ లేబర్ కోడ్లను రద్దు చేయాలని రెండుసార్లు దేశవ్యాప్త సమ్మెలు, సమరశీల ఉద్యమాలు చేపట్టినప్పటికీ బీజేపీ ప్రభుత్వం లెక్క చేయలేదని తెలిపారు. 2024 పార్లమెంట్ ఎన్నికల సందర్భంలోనూ వామపక్షాలు, ప్రతిపక్ష పార్టీలు దేశవ్యాప్తంగా ఈ లేబర్ కోడ్లను వ్యతిరేకించినప్పటికీ బీజేపీ కార్మిక వర్గానికి ద్రోహం చేయడానికే నిశ్చయించుకున్నదని తెలిపారు. దేశంలో ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో ఈ లేబర్ కోడ్లకు సంబంధించిన రూల్స్ రూపొందించబడ్డాయని తెలిపారు. కొన్ని రాష్ట్రాల్లో అమల్లోకి తీసుకొస్తున్నారనీ, ఈ పూర్వ రంగంలో కార్మికవర్గ హక్కులకు ఉరి తాళ్ళుగా మారిన ఈ లేబర్ కోడ్లను దేశ వ్యాప్తంగా కార్మికవర్గం, రైతాంగం వ్యతిరేకిస్తూ నేడు "బ్లాక్ డే" పాటించాలని కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు నిర్ణయించాయనీ, అందులో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, మండల, పట్టణ, పారిశ్రామిక కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. యూనియన్ పెట్టుకునే హక్కు సమ్మె హక్కు, పని గంటలు, అక్రమ తొలగింపులు, మహిళా కార్మికుల హక్కులు, ఆరోగ్యం, సంక్షేమం తదితర అనేక ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే ఈ లేబర్ కోడ్లను నిరసిస్తూ "బ్లాక్ డే కార్యక్రమం" లో కార్మికులు వేలాదిగా పాల్గొనాలని రాష్ట్ర ఉద్యోగ, కార్మిక సంఘాలు కోరుతున్నట్టు తెలిపారు. ప్రస్తుతమున్న 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్లుగా మార్చి కార్మికుల చట్టపరమైన కనీస హక్కులను హరిస్తున్నదనీ, వీటి వల్ల ప్రభుత్వరంగ కార్మికులు, ట్రేడ్ యూనియన్ల హక్కులు కోల్పోతాయని తెలిపారు. జీతాల పెంపుదల కోసం కార్మికులకున్న బేరసారాల హక్కులను కోల్పోయే ప్రమాదమున్నదని తెలిపారు. కొత్త ట్రేడ్ యూనియన్ల నమోదు ప్రక్రియపై తీవ్ర ఆంక్షలు విధించబడతాయనీ, ట్రేడ్ యూనియన్ రిజిస్ట్రేషన్ రద్దు చేయడానికి ట్రేడ్ యూనియన్ రిజిస్ట్రార్లకు విస్తృత అధికారాలు కల్పించబడ్డాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర కార్మిక మంత్రిత్వ శాఖ ద్వారా నిర్వహించబడుతున్న ప్రస్తుత ధ్రువీకరణ వ్యవస్థ తొలగించబడిందనీ, ట్రేడ్ యూనియన్ నమోదును నిర్వహించడం చాలా కష్టం అనీ, 300కంటే తక్కువ కార్మికులు పనిచేసే పరిశ్రమలకు స్టాండింగ్ ఆర్డర్స్ వర్తించవు అనీ, ఈ విధంగా ఆచరణలో కార్మిక చట్టాల ద్వారా లభించిన అనేక హక్కులు రద్దు చేయబడినట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో చేపట్టనున్న "బ్లాక్ డే" నిరసన కార్యక్రమాల్లో జిల్లాలో ప్రతి కార్మికుడూ రాజకీయ అనుబంధాలకతీతంగా పాల్గొనాలని కార్మిక సంఘాలు పిలుపునిస్తున్నాయని తెలిపారు.


ఆశ్రయ్ అక్రుతి ఆధ్వర్యంలో 'సైనథాన్-2024'



నవతెలంగాణ-సిటీబ్యూరో

వినికిడి లోపాలతో బాధపడుతున్న వ్యక్తుల శ్రేయస్సు కోసం అంకితమైన ఆశ్రయ్ అకృతి స్వచ్ఛంద సంస్థ అంతర్జాతీయ సంకేత భాషల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు 'సైనథాన్ 2024'ని నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని క్వాల్కాం సంస్థ టెక్నాలజీ, పేటెంట్ కౌన్సెల్ సీనియర్ డైరెక్టర్ నితిన్ శర్మ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆశ్రయ్ అకృతి వ్యవస్థాపక డైరెక్టర్ డీపీకే బాబు మాట్లాడుతూ ఆశ్రయ్ అకతి 'సైనథాన్ 2024' మిషన్ 'వాక్ ఫర్ ఇన్ క్లూజివిటీ' అనే ఇతి వృత్తంతో రూపొందించబడింది. కమ్యూనికేషన్ అంతరాలను తగ్గించడం, వినికిడి లోపం ఉన్నవారి హక్కుల పరిరక్షణలో సంకేత భాష ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడమే లక్ష్యంగా 28 ఏండ్లుగా ఆశ్రయ్ అకృతి కృషి చేస్తుంది' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ స్ట్రీట్ హైదరాబాద్ చైర్‌పర్సన్ హరీష్ కుమార్ సిరపు, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ జేఎస్ఆర్ ప్రసాద్, తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమల శాఖ సోషల్ ఇంపాక్ట్ గ్రూప్ అర్చన సురేష్, మణి శ్యామ్ సుందర్, యునిసిస్ క్లయింట్ అనలిటిక్స్ మేనేజర్ సునీత తంగెళ్లతోపాటు డెఫ్ అండ్ డంబ్ పాఠశాలల విద్యార్థులు, తదితరులు 1500 మందికి పైగా పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ హెల్త్ ఐడీ అవసరం



- హైదరాబాద్ ఎయిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ యదుకుల్

నవతెలంగాణ-సిటీబ్యూరో

నేటి ఆరోగ్య రంగంలో ప్రతి ఒక్కరికీ హెల్త్ ఐడీ అవసరం అని హైదరాబాద్ ఎయిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్, ఏబీడీఎం నోడల్ ఆఫీసర్ డాక్టర్ యదుకుల్ అభిప్రాయపడ్డారు. రామాంతపూర్‌లోని ఇందిరా ఇంపీరియా గ్రాండ్‌లో ఆదివారం అట్టహాసంగా వహ్నిజా గ్లోబల్ లైఫ్ సైన్సెస్ కంపెనీ డిజిటలైజేషన్ ఫర్ హెల్త్ కేర్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. వీజీఎల్ఎస్ హెల్త్ కేర్ రంగంలో డిజిటలైజేషన్ సర్వీసెస్ కల్పించడానికి పీఆర్జెనిక్స్ వారి టెక్ సపోర్ట్ సహాయంతో దక్షిణ భారతదేశంలోని తమ కార్యకలాపాలను మొదటిసారిగా తెలంగాణలో ప్రారంభించారు. ప్రతి ఒక్కరికీ డిజిటల్ హెల్త్ ఐడీ రిజిస్ట్రేషన్‌ని ముందుకు తీసుకెళ్తున్నారని కంపెనీ అధినేత డాక్టర్ ప్రియదర్శిని వింజమూరు ప్రస్తావించారు. ముఖ్య అతిథి డాక్టర్ యదుకుల్ డిజిటలైజేషన్ ఎంత ముఖ్యమో, ప్రతి ఒక్కరికీ హెల్త్ ఐడీ ఉండటం ఎంత ఉత్తమమో, జాతీయ ప్రభుత్వం తీసుకుంటున్న ఏబీడీఎం చర్యల డిజిటల్ ఐడీలు ఉండటం వల్ల జరిగే లాభాల గురించి ప్రస్తావించారు. గౌరవ అతిథి ఐఐహెచ్చ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు నేటి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కాలంలో మార్పుతోపాటు మార్పుని అందుకోవడం తప్పని సరి అనీ, లేకపోతే కనుమరుగైపోతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్జెనిక్స్ సీఈవో వినోద్ పాట, సోమ సుందర్ శర్మ, వహ్నిజా గ్లోబల్ లైఫ్ సైన్సెస్ కంపెనీ అధినేత డాక్టర్ ఐ.ప్రియదర్శిని, ఇతర ప్రముఖులు, పాల్గొన్నారు.

పది మంది సీఆర్పీలకు షోకాజ్ నోటీసులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఫేస్ రికగ్నైజేషన్ సిస్టం(ఎఫ్ఆర్ఎస్) హాజరు తక్కువగా నమోదైన పది పాఠశాలల క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్‌లకు జిల్లా విద్యాశాఖ షోకాజు నోటీసులు జారీ చేసింది. విధుల్లో అలసత్వం ప్రదర్శించినందుకు బహదూర్‌పురా, ఆసిఫ్‌నగర్, బండ్లగూడ, గోల్కొండ, సికింద్రాబాద్ పాఠశాలల సీఆర్పీలకు వివరణ కోరుతూ నోటీసులు జారీ అయ్యాయి.

మండలం	స్కూల్	సీఆర్పీ
బహదూర్‌పురా-2	జీహెచ్ఎస్ వట్టేపల్లి	అబ్దుల్ సమద్
బహదూర్‌పురా-2	జీహెచ్ఎస్ కాళీ కమాన్	శ్రీను నాయక్
బహదూర్‌పురా	జీజీహెచ్ఎస్ శాలిబండ	జమీల్ అహ్మద్ అల్వీ
ఆసిఫ్‌నగర్-2	జీహెచ్ఎస్ ముస్తైద్ పురా	అన్నపూర్ణ(డీఎల్ఎంటీ)
ఆసిఫ్‌నగర్-2	జీహెచ్ఎస్ గోష్‌కట్	కె.మంజులేశ్వరి
బహదూర్‌పురా-2	జీహెచ్ఎస్ దరీచే బవహీర్	అహ్మద్ అలీ
బండ్లగూడ	జీబీహెచ్ఎస్ ఈడీ బజార్	జి.రఘు కుమార్
గోల్కొండ	జీబీహెచ్ఎస్ గోల్కొండ	ఏ. తిరుపతయ్య
బండ్లగూడ	జీజీహెచ్ఎస్ ఫలక్‌నుమా	డి.శ్రీదేవీ
సికింద్రాబాద్	జీజీహెచ్ఎస్ బన్సీలాల్‌పేట్	సమీనా బేగం

ఎస్టీ వర్గీకరణకు ప్రత్యేక కమిషన్ వేయాలి

- ప్రొఫెసర్ హరగోపాల్



నవ తెలంగాణ - ముషీరాబాద్

ఎస్సీ వర్గీకరణ తరహాలో ఎస్టీ వర్గీకరణ కూడా చేయాలని ఇది ఆదివాసీల డిమాండ్ న్యాయమైందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ఆదివారం బాగ్లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తుడుం దెబ్బ. ఆదివాసీల సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఎస్టీ వర్గీకరణ పై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న హరగోపాల్ మాట్లాడుతూ. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని అదే తరహాలో ఎస్టీలో ఏబీసీడీలు నిర్వహిస్తే సామాజిక న్యాయం చేకూరుతుందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికే పరిమితమైందని అయితే ఎస్టీ వర్గీకరణ చేపట్టాలని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మన భూమి, మన సంపద మనకు దక్కాలంటే పోరాటం తప్పదన్నారు. ఇట్టి విషయంలో కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలి అన్నారు. సామాజిక న్యాయం దక్కలేదు కాబట్టే ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని అయితే ఎస్టీ రిజర్వేషన్ ఎక్కువగా లంబాడీలే లబ్ధిపొందినందున వర్గీకరణ చేపడితే అందరికి సామాజిక న్యాయం దక్కుతుందన్నారు. ఈ వర్గీకరణ విషయంలో లంబాడీలు కూడా మద్దతు తెలుపాలని ఆయన కోరారు. తుడుం దెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య మాట్లాడుతూ. గత 50 ఏళ్లుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో వస్తున్న ఎస్టీ రిజర్వేషన్లో ఎక్కువగా లబ్ది పొందిది లంబాడీలే నని అన్నారు. విద్యా ఉద్యోగ, ఉపాధి, రాజకీయాల్లో ఎక్కువగా లంబాడీలే లబ్ది పొందారని అన్నారు. ఆదివాసీల భూములు కూడా లంబాడీల చేతుల్లోకి వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వేషన్ ఫలాలు ఆదిమా తెగలకు దక్కడం లేదన్నారు. ఏజెన్సీ ప్రాంతాలలో ఉన్న భూములను బినామి పేరులతో లాక్కుంటున్నారని ఆరోపించారు. ఆదిమా తెగలకు జరుగుతున్న అన్యాయాలను పరిగణలోకి తీసుకోని ఎస్టీ వర్గీకరణ చేపట్టాలని దీనికి ఒక ప్రత్యేక కమీషన్ను వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బా రాష్ట్ర అధ్యక్షులు పట్నం ఉపెందర్, జేఏసీ చైర్మన్ పాయం సత్యనారాయణ, సలహాదారులు పొడుగు శ్రీనాథ్. వివిధ సంఘాల నాయకులు రత్నం, వెంకటేశ్వర్లు, కొమురం ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తమ్ కుమార్ రెడ్డి మంత్రుల కమిటీని రద్దు చేయాలి'

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 30న రాష్ట్ర సచివాలయం ఎదుట నిరసన, దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ, క్రిమిలేయర్ అమల కోసం ఏర్పాటు చేసిన ఉత్తమ్ కుమార్ రెడ్డి మంత్రుల కమిటీని వెంటనే రద్దు చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు, ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ చైర్మన్ వడ్లమూరి కృష్ణ స్వరూప్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హిమాయత్ నగర్ లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆందోళన, రాష్ట్ర స్థాయి సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగానికి వ్యతిరేకంగా వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దళితులను రాజ్యాధికారంలోకి రానీయకుండా అడ్డుకోవడం కోసమే వర్గీకరణ పేరుతో దళిత జాతులపై సామాజిక దాడి చేస్తున్నారని ఆరోపించారు. గత పదేళ్లుగా ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక అభివృద్ధి నిధులు రూ.2 లక్షల కోట్లు ఈ దోపిడీ మనువాద పాలకులు దోచుకున్నారని విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన విద్యా, ఉద్యోగ, ఉపాధి, జీవన, సామాజిక హక్కులను కాంగ్రెస్, బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ నెల 30న ఉదయం 11 గంటలకు రాష్ట్ర సచివాలయం ఎదుట నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.అనంతరం మధ్యాహ్నం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో సమితి ఆధ్వర్యంలో సమితి ప్రతినిధుల రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వాడాల భాస్కర్, తెలంగాణ బేగరి సంక్షేమ సంఘం అధ్యక్షులు పి.సుచంద్ర, డీబీపీ గ్రేటర్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పరి సుబ్బారావు పాల్గొన్నారు.

స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం



నవతెలంగాణ - ముషీరాబాద్

స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫుట్ పాతుల మీదనే జీవనం సాగిస్తున్న అనాథలు, నిరాశ్రయులు, సంచార జాతుల వారిని గుర్తించి 261 అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ అన్నదాన కార్యక్రమంలో ప్రెసిడెంట్ డాక్టర్. వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ.పావని, సేవ సభ్యులు కుషికోమల్, అఖిల్, శుభం, రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

'రాష్ట్ర ప్రభుత్వం ఆక్యుపంక్చర్ వైద్యాన్ని గుర్తించాలి'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

భారత ప్రభుత్వం ఐసీఎంఆర్, డీహెచ్ఆర్ నేతృత్వంలోని స్టాండింగ్ కమిటీ 2018లో ఆక్యుపంక్చర్ వైద్యాన్ని ఆరోగ్య సంరక్షణ వ్యవస్థగా ఆమోదించిందని, అదే విధంగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఆక్యుపంక్చర్ వైద్యాన్ని గుర్తించి, ప్రోత్సహించాలని తెలంగాణ ఆక్యుపంక్చర్ ఆక్యుప్రెషర్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ సీఎం ఎ.రేవంత్ రెడ్డిని కోరింది. ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్.సుధీర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.ఎస్.సాగర్ మాట్లాడుతూ దేశంలోని మిగతా రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు ఈ వైద్య విధానాన్ని ఆమోదించాయని, అదే విధంగా తెలంగాణ రాష్ట్రంలో ఈ వైద్యాన్ని గుర్తించవలసిన అవసరం ఉందన్నారు.మన రాష్ట్రంలో ఈ వైద్య విధానం అంతర్జాతీయ మెడికల్ వెల్నెస్ ఇండస్ట్రీ, టూరిజంను అభివృద్ధి చేస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆక్యుపంక్చర్ 51 శాతం మంది వైద్యుల మద్దతుతో బీమా కవరేజ్ తో 2వ అతిపెద్ద పరిశోధనాత్మక అభ్యాసంగా మారిందన్నారు. డబ్ల్యూహెచ్ఓ ద్వారా ధ్రువీకరించబడిన 1,200 తీవ్రమైన, దీర్ఘకాలిక వ్యాధులు, కొన్ని దీర్ఘకాలిక ఎమర్జెన్సీలలో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో ఆక్యుపంక్చర్ వైద్యానికి కౌన్సిల్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ వైద్య విధానం ద్వారా 200కు పైగా జబ్బులను నయం చేయవచ్చునన్నారు.ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ లేకుండా ఈ వైద్యం పని చేస్తుందన్నారు. అతి తక్కువ ఖర్చుతో ఈ వైద్యం అందించబడుతుందని వారు తెలిపారు.దేశంలో ఈ ఆక్యుపంక్చర్ వైద్యాన్ని విస్తృతం చేసేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ రాకేష్ జైస్వాల్, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ త్రివిక్రమ్, కోశాధికారి జి.సుభాష్, సంయుక్త కార్యదర్శి టి.అనిల్ కుమార్, ఎస్.రవీందర్, జె.పురుషోత్తం, అనిరుద్, అభిషేక్, ఆర్.సత్యం తదితరులు పాల్గొన్నారు.

'అర్హులకే బ్యాక్ లాగ్ ఉద్యోగాలివ్వాలి'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలలో భర్తీ చేస్తున్న బ్యాక్ లాగ్ ఉద్యోగాలను అర్హులకే ఇవ్వాలని తెలంగాణ గ్రాడ్యుయేట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నల్లవెల్లి భరత్ డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్ బాగ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివిధ శాఖలలో ఏర్పడిన ఖాళీలను నోటిఫికేషన్ జారీ చేసి భర్తీ చేయాల్సిన అధికారులు నిబంధనలు పాటించకుండా దొడ్డిదారిన నియమించడానికి సన్నాహాలు చేస్తున్నారని ఆరోపించారు. దీని వల్ల నిరుద్యోగ యువతకు తీరని నష్టం చేకూరుతుందని, గతంలో నిర్మల్ మున్సిపల్ లో ఏకంగా 44 పోస్టులు భర్తీ చేయడం జరిగిందని పత్రికల్లో రావడం జరిగిందన్నారు. అలాగే కరీంనగర్ బీఆర్ఎస్ సోదరుని కూతురుకు తెలంగాణ జెన్ కోలో ఎగ్జామ్ రాయకుండానే ఆమెకి ఏఈ పోస్టు ఇచ్చినట్లు జెన్ కో ప్రభాకర్ రావుపై ఆరోపణలు ఉన్న నేటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకుంటుంటే నాయకుల బంధువులకు మాత్రం ఎగ్జామ్ రాయకుండానే ఉద్యోగాలు ఇస్తున్నారని మండపడ్డారు. నిరుద్యోగులకు చెందాల్సిన పోస్టులను అనర్హులకు కట్టబెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం దొడ్డి దారిన జరిగే బ్యాక్ లాగ్ నియామకాలను అడ్డుకుని, నిరుద్యోగ యువతకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, జిల్లాలలో దొడ్డి దారిన జరిగే నియామకాలను అడ్డుకోవాలని కోరారు.ఈ కార్యక్రమం లో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు శోభన్ బాబు, మొగిలి, బంజారా గిరిజన సమైక్య రాష్ట్ర ఇంచార్జ్ శ్రవణ్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ముక్తార్ గంజ్ , మహారాజ్ గంజ్ శాఖ కార్యదర్శిగా పీ. కుర్మయ్య



నవతెలంగాణ - ధూల్ పేట్

భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్టు) సీపీఐ(ఎం) ముక్తార్ గంజ్ , మహారాజ్ గంజ్ శాఖ కార్యదర్శి గా పీ. కుర్మయ్య ను ఎన్నుకున్నారు. ముక్తార్ గంజ్ , మహారాజ్ గంజ్ పార్టీ 9వ మహాసభ కిషన్ గంజ్ సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభ కు ముఖ్య అతిదులుగా హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి. నాగేశ్వర్ , కందుల జంగయ్య హాజరై మాట్లాడుతూ.. పార్టీ మహాసభల సందర్భంగా అని అంశాలపై చర్చించి సభ్యులు అభిప్రాయం ప్రకారం కార్యదర్శి ని ఎన్నుకునారని తెలిపారు. మూడు సంవత్సరాల కొకసారి పార్టీ మహాసభలు జరుపుకోంటామని ప్రజా సమస్యల పరిష్కారమే పార్టీ ప్రధాన ధ్యేయమన్నారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధపోరాటాని కమ్యూనిస్టు లు నిర్వహించినారని పేర్కొన్నారు. ఆ పోరాటంలో నాలుగు వేల మంది బలిదానం అయ్యారని, భూస్వాముల పై నైజాం నవాబు రజాకార్ల పై పోరాడి 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేసిందన్నారు. ఎర్ర జెండా కమ్యూనిస్టు పార్టీ అని, వీరతెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి మతతత్వ శక్తులు ఆ పోరాటానికి మతం రంగు పులుముతున్నారన్నారన్నారు. వారి మాటలు నమ్మోదని వారు ప్రజలకు కోరారు.

గుర్తుతెలియని యాచకుడు మృతి



నవతెలంగాణ - ముషీరాబాద్

గుర్తు తెలియని యాచకుడు మృతి చెందిన ఘటన ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ముషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నియోజకవర్గంలోని గాంధీనగర్ బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎం సెంటర్ వద్ద బిక్షటన చేస్తూ జీవితం సాగిస్తున్న 65 సంవత్సరాల వృద్ధుడు అపస్మారక స్థితిలో పడి ఉండడం గమనించి స్థానికులు ముషీరాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి మృతుడి వివరాల గురించి దర్యాప్తు చేపట్టారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చే విధానాన్ని విరమించుకోవాలి



నవతెలంగాణ - ధూల్‌పేట్

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చే విధానాన్ని ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని సీడబ్ల్యుఎఫ్ఐసీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సీడబ్ల్యుఎఫ్ఐ సీఐటీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్ సౌత్ జిల్లా ఉపాధ్యక్షులు , నెమ్మది గోపాల్, సి. బాల్‌రాజు రెండో రోజు బేగం బజార్ లేబర్ అడ్డా వద్ద కార్మికుల తో సంతకాల సేకరణ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకా ల అమలు ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వడం ద్వారా కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ విధానం అమల్లోకి వస్తే ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు లాభాలు చేకూరుతాయని కార్మికుల సొమ్ము లేబర్ బోర్డు లో ఉండకుండా పోతాయన్నారు. కార్మికుల సంక్షేమ పథకాలు లేబర్ బోర్డు ద్వారానే నిర్వహించి కార్మికులకు అందించాలని వారు డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమ పథకాలు లేబర్ బోర్డు ద్వారనే అమలు చేయాలని ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొదని నేడు (23వ తేదీ) సోమవారం ఉదయం 10 గంటలకు లేబర్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు నారాయణ , నరేష్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి అండగా తోటి ఉద్యోగులు



నవతెలంగాణ -బేగంపేట్

ఇటీవల ఆత్మహత్య కు పాల్పడ్డ ట్రాఫిక్ కానిస్టేబుల్ కుటుంబానికి తోటి ఉద్యోగులు అండగా నిలిచారు.కానిస్టేబుల్స్ అంత కలిసి రూ .3,40,000 అతని కుటుంబానికి అందజేశారు.వివరాల్లోకి వెళ్తే బోడుప్పల్ నారపల్లి కి చేసిన పి. నరసింహ రాజు 2009 వ సంవత్సరంలో కానిస్టేబుల్ గా ఎంపికయ్యాడు.భార్య ఇద్దరు కుమార్తెలతో కలిసి నారపల్లిలో నివాసం ఉంటునాడు .హైదరాబాద్ లో పలు పోలీస్ స్టేషన్లో లలో విధులు నిర్వహించాడు. ఇటీవల సికింద్రాబాద్ లోని గోపాలపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వర్తిస్తున్నాడు.గత కొంత కాలంగా ఆర్థిక పరిస్థితి నిలకడగా లేకపోవడంతో మానసిక వేదనకు గురయ్యాడు.దీంతో చేసే ఏమి లేక రైల్వే ట్రాక్లై పడుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.విషయం తెలుసుకున్న తోటి ఉద్యోగులు,2009 బ్యాచుకు చెందిన కానిస్టేబుల్స్ 7 వందల మందికి పైగా వారికి తోచిన సహాయాన్ని కానిస్టేబుల్ నరసింహారాజు కుటుంబ సభ్యులకు ఆదివారం రూ .3,40,000 అందజేశారు.వారి కుటుంబానికి అండగా నిలబడ్డ తోటి కానిస్టేబుల్లను పలువురు అభినందించారు.

సంతూర్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ 9వ ఎడిషన్

నవతెలంగాణ-సిటీబ్యూరో

విప్రో కన్స్యూమర్ కేర్ అండ్ లైటింగ్ సంతూర్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ 9వ ఎడిషన్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్‌లోని అంతటా వెనుకబడిన ప్రాంతాల నుంచి బాలికలకు సాధికారత కల్పించడానికి ఉద్దేశించిన ప్రధాన కార్యక్రమం. ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్‌లోని (వెనుకబడిన) జిల్లాలకు చెందిన వారికి ప్రాధాన్యతనిస్తూ, 1,500 మంది అర్హులైన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడంపై ఈ కార్యక్రమం దృష్టి సారించింది. ఈ సందర్భంగా పి.ఎస్.నారాయణ్, గ్లోబల్ హెడ్-సస్టైనబిలిటీ అండ్ సోసైటల్ ఇనిషియేటివ్స్, విప్రో లిమిటెడ్ మాట్లాడుతూ 'సుస్థిర అభివద్ధి పురోగతికి విద్య మూలస్తంభం. మరింత సమానమైన సమాజానికి కీలకమైనది. దీని ద్వారా ఉన్నత పాఠశాల, కళాశాల మధ్య ఉన్న అగాధాన్ని దాటడంలో సహాయం చేయడం ద్వారా వెనుకబడిన వర్గాల బాలికల సాధికారతకు తోడ్పడాలని ఆశిస్తున్నాం' అని తెలిపారు.

పేకాట రాయుళ్లు అరెస్ట్



నవతెలంగాణ-వనస్థలిపురం

వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధి లోని సాహెబ్ నగర్ లో మహిళా మండలి కమ్యూనిటీ హాల్ నందు పేకాట శిబిరం పై వనస్థలిపురం పోలీసుల దాడి చేసి ఆరుగురుని నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి రూ.65 వేల, 650 రూపాయల నగదు, 6 మొబైల్స్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నామని వనస్థలిపురం ఎస్‌హెచ్‌ఓ అశోక్ రెడ్డి తెలిపారు.

గ్లోబల్ ట్రీ స్కూల్‌కు చిత్రలేఖనంలో జిల్లా స్థాయి ప్రథమ బహుమతి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

గ్లోబల్ ట్రీ స్కూల్ చైర్మన్ హన్మంత్.గ్లోబల్ ట్రీ పాఠశాల విద్యార్థికి చిత్ర లేఖనంలో జిల్లా స్థాయిలో వి. హర్షిత్ కు ప్రథమ బహుమతి గెలుచుకున్నట్లు పాఠశాల చైర్మన్ హన్మంత్ అన్నారు.ఆదివారం రంగారెడ్డి జిల్లాలో ముచ్చింతల్ లోని చిన్న జీయర్ స్వామి వారి ఆశ్రమంలో రాష్ట్ర స్థాయి చిత్రలేఖనం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో గ్లోబల్ ట్రీ స్కూల్ నుండి వి.హర్షిత్ జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి నగదు రూ. 6వేల రూపాయలు నగదు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. అనంతరం చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించడం వలన విద్యార్థుల యుక్క మేధాశక్తి మెరుగుపడుతుందని శ్రీ శ్రీ త్రి దండి చిన్న జీయర్ స్వామి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ హన్మంతు, చిన్న జీయర్ స్వామి, అహోబిల క్షేత్రం రామానుజ జీయర్ స్వామి, మై హోం సంస్థ అధినేత డా రామేశ్వర్ రావు, ఐఏఎస్ అధికారి జగదీశ్, అడ్వైసర్ నైన నాథ, ట్రస్మా స్టేట్ చీఫ్ అడ్వైసర్ యాదగిరి శేకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

సంగీత నృత్య కళా ప్రక్రియలు సంస్కృతిలో భాగం



నవతెలంగాణ-కల్చరర్

సంగీత నృత్య కళా ప్రక్రియలు సంస్కృతిలో భాగం అనీ వీటి పరిరక్షణ లో నవ్య నాటక సమితి చేస్తున్న కృషి అభినందనీయం అని ప్రముఖ ఆంధ్ర నాట్య కళా కారుడు కళా కృష్ణ అన్నారు తెలుగు విశ్వవిద్యాలయం లో ఎన్ టి ఆర్ కళా వేదిక పై నవ్య నాటక సమితి నిర్వహణ లో రాష్ట్ర సంగీత నాటక అకాడమీ సౌజన్యం తో జరుగుతున్న జాతీయ స్థాయి సంగీత నృత్య పోటీలు లో భాగంగా ఆదివారం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కళా కృష్ణ పాల్గొని మాట్లాడుతూ నేటి తరం కళల పట్ల గౌరవం ఆసక్తి కలిగి వుండాలి అని కోరారు వేదిక పై సంగీత గురువులు వాస గోపీ నాథ రావు సారంగపాణి కె సహేర్ రావు విద్యారన్య స్వామి అకుల రంజిత్ కుమార్,వసుంధర తదితరులు పాల్గొనగా సంస్థ అధ్యక్షులు వేమరాజు విజయ కుమార్ స్వాగతం పలుకుతూ పోటీల నేపథ్యం తెలిపారు. సుధా మాల సమన్వయం చేశారు ఈ సందర్భం గా సంస్థ ప్రత్యేక సంచిక ను అతిథులు ఆవిష్కరించారు.

గురువులు సామాజిక శాస్త్రవేత్తలు



నవతెలంగాణ-కల్చరర్

గురువులు భాధ్యత విస్తృతం అనీ కేవలం తరగతి గదిలో పాఠాలు చెప్పటం తో సరి పోదని కేంద్ర పూర్వ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. గురువులు పిల్లలకు నైతిక విలువలు కుటుంబ సంబంధాలు సత్ప్రవర్తన నేర్పాలని వారు సమాజిక శాస్త్రవేత్తలు అని అయన చెప్పారు రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై భారత్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహణలో లో వుపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురు సత్కారం పురస్కార ప్రదాన సభ జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ వేణుగోపాలాచారి పలువురు నాట్య సంగీత గురువులకు గురు రత్న పురస్కారాలు బాల కళాకారులకు అభ్యుదయ పురస్కారాలు బహుకరించారు. దాదాపు మూడేళ్ళ బాల కళాకారుల నుంచి పదునాలుగు సంవత్సరములు వయస్సు కళ యువ కళా కారుల వరకు దాదాపు వంద మంది పైగా తమ నాట్య సంగీత ప్రదర్శనలతో కను విందు చేశారు అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో భారత్ వరల్డ్ రికార్డ్స్ రమణా రావు అధ్యక్షత వహించిన సభలో నాట్య గురువులు పి శేషుబాబు డాక్టర్ పి రమా దేవి , నటుడు విక్రమాదిత్య , పద్మావతి పాల్గొనగా రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కె సుజాత పాల్గొని మాట్లాడుతూ భారత్ ఆర్ట్స్ అకాడమీ భారతీయ సంస్కృతి సంపద ఇన శాస్త్రీయ కళల పెంపు కు తమ వంతు కృషి చేస్తున్నారని అభినందించారు. సంస్థ అధ్యక్షురాలు లలిత రావు కార్యక్రమ నిర్వహణ చేశారు.

రికార్డ్ నమోదు చేసుకున్న స్వర వీణా పాణి రచనల బృంద గానం



నవతెలంగాణ-కల్చరర్

ప్రముఖ సినీ సంగీత దర్శకుడు స్వర వీణాపాణి స్వర రచన చేసిన 72 మేళ కర్త రాగాల స్వర కామాక్షి స్వర బీజాక్షరి కీర్తనలు 72మందితో 36 నిమిషాలలో అన్నమయ్య కళా సమితి(నక్రేకల్) స్వర నిధి నిర్వహణలో బృంద గానం చేసి తెలుగు బుక్ రికార్డ్స్ లో నమోదు చేసుకున్నారు అని రికార్డ్ జూరీ సభ్యుడు అశోక్ కుమార్ ప్రకటించారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై తెలుగు రాష్ట్రాల నుంచే కాక కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా బృంద గానం లో పాల్గొన్నారు .ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ గీత రచయిత సుద్దాల అశోక్ తేజ రికార్డ్ నమోదు పత్రం సంస్థ నిర్వాహకురాలు జీ సుమలత కు అందజేసి మాట్లాడారు. సుమలత బాలలు యువతులకు స్వరాలు నేర్పి మహా విన్యాసం చేశారని ప్రశంసించారు. భారతీయ సంగీతం స్వరాలు మేళ కర్తల సమ్మేళనం అనీ లయ బద్ధ గానం కోసం ముఖ్య మన్నారు. స్వర వీణా పాణి అద్భుత సంగీత దర్శకుడు అని ప్రశంసించారు. వేదిక పై వంశీ రామరాజు కవి అక్కిరాజు సుందర రామ కృష్ణ రవి వర్మ దైవజ్ఞ శర్మ తదితరులుపాల్గొనగా మాధవి వ్యాఖ్యానం చేశారు అంతకు ముందు అన్నమయ్య కీర్తనలు గానం నృత్య ప్రదర్శన జరిగాయి.

జిల్లాల్లో కుంటుపడ్డ క్రికెట్ అభివృద్ధి

- అవినీతిలో కూరుకుపోయిన హెచ్‌సీఏ
- శాట్స్ చైర్మెన్ కె.శివసేనారెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రంలోని జిల్లాలో క్రికెట్ అభివద్ధి కుంటు పడిందనీ, ప్రతిభావంతులైన గ్రామీణ క్రికెటర్లకు అవకాశాలు లభించటం లేదని శాట్స్ చైర్మెన్ కె.శిశసేనారెడ్డి అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'తెలంగాణ క్రికెట్ దశ-దిశ'పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శిశసేనారెడ్డి మాట్లాడుతూ జిల్లాల్లో క్రికెట్ అభివద్ధికి తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) సంకల్పం తీసుకోవటం ఆహ్వానిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అవినీతిలో కూరుకుపోయిందనీ, గ్రామీణ క్రికెట్‌ను పూర్తిగా నిర్లక్షం చేస్తోందన్నారు. ఈ విషయంపై బీసీసీఐకి సైతం లేఖ రాసేందుకు వెనుకాడబోమన్నారు. తెలంగాణ జిల్లాల్లో క్రికెట్ అభివద్ధికి మరిన్ని సంఘాలు ముందుకు రావాలని' కోరారు. తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) అధ్యక్షుడు, శాట్ మాజీ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో క్రికెట్ అభివద్ధి చెందాలంటే ప్రతి జిల్లాకూ ఆధునాతన మౌళిక సదుపాయాలతో కూడిన అకాడమీలు అవసరమన్నారు. రాష్ట్ర జట్టు అంటే ప్రతి జిల్లా నుంచి క్రికెటర్లకు ప్రాతినిధ్యం ఉండాలని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో గ్రామీణ క్రికెట్ దశాబ్దాలుగా కుంటుపడిందన్నారు. రాష్ట్ర క్రికెట్ జట్టు అంటే ప్రతి జిల్లాకు ప్రాతినిధ్యం లభించేలా ఉండాలనీ, అందుకు టీడీసీఏ తరఫున రాజీలేని కషి చేస్తామనీ, అందరి మద్దతుతో బీసీసీఐ గుర్తింపు సైతం తీసుకొస్తామని తెలిపారు. ఈ సమావేశంలో టీడీసీఏ జిల్లా సంఘాల ప్రతినిధులు, మాజీ క్రికెటర్లు సహా పెట్ టీఎస్ అధ్యక్షుడు రాఘవరెడ్డి, స్టేట్ పెట్ అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ సోమేశ్వరరావు, రంగారెడ్డి జిల్లా పెట్ అసోసియేషన్ సెక్రెటరీ భాస్కర్, టీడీసీఏ ఫౌండర్ మెంబర్, మాజీ క్రికెట్ క్రీడాకారుడు కాంభోజీ వెంకటేశ్వర్లు, ఖమ్మం జిల్లా సీనియర్ క్రికెట్ నిర్వాహకులు మతీన్, నల్గొండ జిల్లా సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు రామ్ నరసింహ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ బాలరాజు, క్రికెట్ కోచ్ రాజ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ క్రాస్ రోడ్డులో మాంగళ్య షాపింగ్ మాల్ ప్రారంభం



నవతెలంగాణ - ముషీరాబాద్

హైదరాబాదు నగరంలోని ఆర్టీసీ క్రాస్ రోడ్ లో మాంగళ్య షాపింగ్ మాల్ 20వ స్టోర్ ను సినీ నటి కీర్తి సురేష్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నటి కీర్తి సురేష్ మాట్లాడుతూ. తెలుగు రాష్ట్రాల్లో అధునాతన కలెక్షన్స్ తో అతిపెద్ద షాపింగ్ మాల్ గా అవతరించిందనీ ఈ స్టోర్ ను నేను ప్రారంభించడం ఆనందంగా ఉంది, పట్టు ఫ్యాన్సీ కంచి ధర్మవరం ఉప్పాడ పట్టు చీరలతో పాటు, అధునాతన కలెక్షన్స్ తో కిడ్స్, ఎత్నిక్ వేర్ మెన్స్ అండ్ ఉమెన్స్ వివాహాది శుభకార్యములకు ప్రత్యేక వస్త్ర ప్రపంచం మాంగళ్య షాపింగ్ మాల్ అని పేర్కొన్నారు. షాపింగ్ మాల్ డైరెక్టర్లు పి ఎన్ మూర్తి, కాసం నమ శివాయ, కాసం మల్లికార్జున్, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్ కుమార్ మాట్లాడుతూ. తెలుగు రాష్ట్రాల్లో గత 12 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ఇప్పటివరకు 20 స్టోర్ లు ప్రారంభించాం మరో వారంలో హైదరాబాద్ నగరంలో నార్సింగ్, మణికొండ లో ప్రారంభించబోతున్నాం, త్వరలో కర్ణాటక రాష్ట్రంలో కూడా మా స్టోర్లను విస్తరించబోతున్నాం మా మా వస్త్రాలను ఎల్లప్పుడూ ఆదరిస్తున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు, అధునాతన ఫ్యాషన్ డిజైన్లను అందించడానికి ప్రధాన కారణం మా సొంత మగ్గాలపై తయారు చేయడంతో వినియోగదారులకు తక్కువ రేటుకే నాణ్యమైన వస్త్రాలను అందిస్తున్నామని తెలిపారు, ఈ కార్యక్రమంలో తొడపనూరి అరుణ్ కుమార్, కార్తీక్, విశాల్, వరుణ్, ఫణి, సాయి పాల్గొన్నారు. అందాల తార సినీనటి కీర్తి సురేష్ చూడడానికి ఉదయం నుండి అభిమానులు, పరిసర ప్రాంత యువతి యువకులు బారులు తీరారు కేరింతలతో షాపింగ్ మాల్ ప్రాంతం పండగ వాతావరణం కనిపించింది. ముందుగా కీర్తి సురేష్ అభిమానులను చూసి సందడి చేసింది.

సుజరిత శిష్య బృందం నాట్యం మనోహరం



నవతెలంగాణ-కల్చరర్

ప్రముఖ నాట్య గురువులు సుజరిత సహ గురువు సుప్రజ ల శిష్య బృందం సీతారామంజనేయ దేవాలయ ప్రాంగణం లో కూచిపూడి నృత్య అంశాలు గణేష్ పంచరత్న కీర్తన తో ఆరంభించి భామాకలాపం, దశావతార శబ్దం దీక్షితార్ కృతిని మనోహరంగా నర్తించారు.



యాదవులను విస్మరించిన మొదటి ప్రభుత్వం రేవంత్ రెడ్డిదే

- యాదవ ఐక్య వేదిక



నవ తెలంగాణ - బంజారాహిల్స్...

యాదవ ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమాజి గూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అధ్యక్ష ప్రధాన కార్యదర్శి చక్రధర్ యాదవ్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో 55 లక్షల మంది యాదవ్ కులస్తుల ఉన్నారని అన్నారు. రాష్ట్రంతో పాటు నగరంలో కాంగ్రెస్ పార్టీలో యాదవులు గెలవక పోవటానికి కారణం ఆ పార్టీ తప్పిదమే అన్నారు.నాటి నుంచి నేటి వరకూ మంత్రి వర్గంలో తప్పకుండా చోటు ఉండే యాదవులను నేడు మంత్రి పదవి ఇవ్వకపోవడం అవమానించడమే అవుతుందన్నారు. 2004,09 లో సిటీ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన పార్టీ అధికారంలో రావటానికి తనవంతు కృషి చేసిన అంజన్ కుమార్ యాదవ్ నూ శాసన మండలి సభ్యులుగా ఉన్నిక చేసి మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒక్క కార్పొరేషన్ చైర్మన్ ఇవ్వలేదనీ ఇప్పుడున్న పరిస్థితుల్లో మూడు చొప్పున అసంబ్లీ,శాసన మండలి,రాజ్య సభ, చైర్మన్ పదవులు కేటాయించాలనీ అలాగే కోకపేట ఆత్మయా భవనన్నీ పూర్తి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో వివిధ యాదవ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మను కలిసిన కజకిస్తాన్ కాన్సుల్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్



నవతెలంగాణ - బంజారా హిల్స్

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో కజకిస్తాన్ గౌరవ కాన్సుల్‌గా ఉన్న డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్ తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ ను హైదరాబాద్ లోని రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సమావేశం అలీ ఖాన్ ఇటీవల కజకిస్తాన్ రాజధాని అస్తానా అధికారిక పర్యటన అనంతరం జరిగింది. అస్తానాలో జరిగిన చర్చలను గవర్నర్‌కు వివరించారు. ముఖ్యంగా అస్తానా అంతర్జాతీయ విమానాశ్రయ మేనేజ్‌మెంట్ బోర్డు ఛైర్మన్ యూసఫ్ అల్‌జావ్దెర్, కజకిస్తాన్ రిపబ్లిక్ రవాణా విభాగ ఉప మంత్రి హిజ్ ఎక్స్‌లెన్సీ తల్గత్ లాస్తాయెవ్‌లతో చర్చలు జరిపారు. హైదరాబాద్ - అస్తానా మధ్య విమాన సర్వీసులు ప్రారంభించే అవకాశాలపై ఈ చర్చలు జరిగాయి. కజకిస్తాన్ అధికారులు ఈ విమాన సర్వీసులు ప్రారంభించడానికి ఆసక్తిగా ఉన్నారు. ఈ ఏడాది చివరలో హైదరాబాద్‌కు రానున్నట్లు తెలిపారు. జీఎంఆర్ విమానాశ్రయ అధికారులు, భారతీయ ఎయిర్‌లైన్ ఆపరేటర్లతో భేటీ చేసేందుకు ఈ పర్యటన ఉద్దేశించబడింది. కజకిస్తాన్ టూరిజం నేషనల్ కంపెనీ జేఎస్సీ మేనేజ్‌మెంట్ బోర్డు ఛైర్మన్ కైరాత్ సద్వకసోవ్‌తో జరిగిన సమావేశాన్ని కూడా వివరించారు.భారతదేశం, కజకిస్తాన్ మధ్య టూరిజాన్ని ప్రోత్సహించడానికి గల అవకాశాలను చర్చించారు. హైదరాబాద్‌లో కజకిస్తాన్ కాన్సులేట్ భాగస్వామ్యంతో పర్యాటక ప్రమోషన్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నారు.తద్వారా రెండు దేశాల మధ్య పర్యాటక సంబంధాలను బలోపేతం చేయడానికి సద్వాకాసోవ్ 2024 నవంబర్, డిసెంబర్ నెలలో హైదరాబాద్ సందర్శించనున్నారు. దీనివల్ల రెండు దేశాల మధ్య పర్యాటక సంబంధాలు మరింత బలపడతాయని భావిస్తున్నారు. కజకిస్తాన్ రిపబ్లిక్ వాణిజ్య, ఇంటిగ్రేషన్ ఉప మంత్రి హిజ్ ఎక్స్‌లెన్సీ కైరాత్ టోరెబాయెవ్‌తో తన సమావేశాన్ని వివరించారు. ఈ చర్చలలో భారత్, కజకిస్తాన్ మధ్య ఎగుమతి, దిగుమతి కార్యకలాపాలలో ప్రధానంగా ఔషధాలు, సమాచార సాంకేతికత రంగాల అభివృద్ధి అవకాశాలపై దృష్టి పెట్టారు. ఈ సమావేశం రవాణా,పర్యాటకం, వాణిజ్యంతో సహా పలు రంగాల్లో పెరుగుతున్న సహకారం, మెరుగైన ద్వైపాక్షిక సంబంధాలకు ఉన్న అవకాశాలను తెలియజేసిందన్నారు.

చలో కామారెడ్డి కార్యక్రమం విజయవంతం చేయండి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

రైతులు చలో కామారెడ్డి కార్యక్రమం విజయవంతం చేయాలని నోముల గోవర్ధన్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కమిటీ మండల కమిటీ ముఖ్యమైన కార్యకర్తల సమావేశం ఆదివారం శ్రీ నగర్ గ్రామ పరిధిలోని ప్యాబ్ సిటీ రోడ్డు,దేవుని గుట్ట శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమములో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కమిటీ కోశాధికారి మాణిక్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా పూర్వ అధ్యక్షులు గజేంధర్ గౌడ్, ప్రస్తుత అధ్యక్షులు మాధవ రెడ్డి, మండల జిల్లా కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరు అయ్యారు. ఈ సంధర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సమక్షంలో ప్రకటించిన వరంగల్ సభ రైతు డిక్లరేషన్ వెంటనే అమలు పరుచాలని డిమాండ్ చేశారు. ఈ సంధర్భంగా రంగారెడ్డి జిల్లా బికేఎస్.కార్యదర్శి నోముల గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రైతుల సమస్యల సాధన కోసం కామారెడ్డిలో జరుగబోయే రాష్ట్ర మహాసభకు వేలాదిగా రైతులు చలో కామారెడ్డికి రావాలని పిలుపు ఇచ్చారు.

నవతెలంగాణ
12
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
సోమవారం | సెప్టెంబర్ 23, 2024 | www.navatelangana.com

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

ఈ నెల 7న 2009 బ్యాచ్‌కి చెందిన కానిస్టేబుల్ పి. నరసింహారాజు(38) మృతిచెందారు. అతను పలు పోలీస్ స్టేషన్లలో పనిచేసి ప్రస్తుతం గోపాలపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ చనిపోవడం జరిగింది. అయితే జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో అతని బ్యాచ్ మేట్ పోలీస్ కానిస్టేబుల్ గణేష్(కోర్ట్ కానిస్టేబుల్) గా పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని తెలుసుకున్నాడు. వారి కుటుంబాన్ని ఆదుకోవడానికి అందరూ కలిసి చందాలు వేసుకుని, మూడు లక్షల నలభై వేల రూపాయలు(3,40,000) చెక్కును కానిస్టేబుల్ గణేష్, వారి బృందం మృతి చెందిన కానిస్టేబుల్ నరసింహారాజు కుటుంబానికి అందజేశారు.



ఫెమినా ప్లాంట్ శిఖర క్లినిక్‌ను ప్రారంభించిన 'మహానటి'

నవతెలంగాణ - బంజారాహిల్స్

బంజారా హిల్స్ రోడ్ నెంబర్ 2లో నూతనంగా ఏర్పాటు చేసిన ఫెమినా ప్లాంట్ శిఖర క్లినిక్‌ను మహానటి కీర్తి సురేష్ ప్రారంభించారు. అత్యధిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన శిఖర క్లినిక్‌ను ప్రారంభించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని నటి కీర్తిసురేష్ అన్నారు. ఉదయం 6 నుంచి రాత్రి 12 గంటల వరకు ఈ క్లినిక్‌లో సేవలు అందుబాటులో ఉండడం విశేషమని అన్నారు. మేకప్ కోసం తాను పెద్దగా హడావిడి చేయనని నానమ్మ, అమ్మమ్మలు సూచించిన పద్ధతులనే పాటిస్తానని చెప్పారు. ప్రస్తుతం మూడు సినిమాలలో నటిస్తున్నట్లు ఆమె చెప్పారు. ఒక ఏడాది నాటికి మరో 100 క్లినిక్‌లను అందుబాటులోకి తేవడానికి సిద్ధపడడం అభినందనీయమని అన్నారు.



సీఎంఆర్ఎఫ్
చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ - జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ శాసనసభ్యులు, బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపినాథ్ ఆదివారం రెహ్మత్ నగర్ డివిజన్ కార్మిక నగర్ చౌరస్తాలో 8 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చోటు, బషీర్ , వినోద్, కే.నాగరాజ్, రాకేష్, అరుణ్, వెంకటేష్ గౌడ్, ధనుజ , అహ్మద్ , వాజీద్ , అర్షద్, గని, రమేష్, స్రవంతి, బేగం, రమక్క, మల్లేష్, బసప్ప, మహేష్, కిట్టు, విజయ్, రఘు, జగ్గు, పెదంటి కుమార్, రాజకుమార్, బషీర్, అస్లాం, చంద్రబాబు, శ్రీను, ఫ్రాంక్లిన్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ శాసనసభ్యులు, బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపినాథ్, ఆదివారం బోరబండ డివిజన్ సైట్ 3 వీకర్ సెక్షన్‌లో ఏడుగురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణ మోహన్, విజయ్ కుమార్, బాబు రావు, యూసఫ్, బాబు నాయక్, రమేష్ యాదవ్, ఫైయాజ్ ఖాన్, ఇర్ఫాన్, మోయిజ్, మధు,యం రమేష్ నాయక్, యం డి గౌస్, వెంకటాద్రి, వెంకట్ యం, పరుష రాము, సూర్య కళ, యం.ఆనంద్, సాయి చరణ్, రజియా, దేవమణి, శ్రీ లక్ష్మీ, మేరి, అజయ్ కుమారి, రహమత్ పాల్గొన్నారు.



'అత్యాధునిక వైద్య విధానాలపై అంతర్జాతీయ సదస్సు'

నవతెలంగాణ-బేగంపేట్

యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీలో లాపరోస్కోపిక్ నుండి రోబోటిక్ సహాయక సర్జరీల వరకు (యూరాలజీలో) కిడ్నీ సంబంధిత వ్యాధులు, వాటికి అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక వైద్యవిధానాలపై అంతర్జాతీయ సదస్సు అండ్ లైవ్ వర్క్ షాప్ LAP-URO 24 పేరుతో రూపొందించబడిన ఒక ప్రీమియర్ సైంటిఫిక్ అప్‌డేట్ ప్రోగ్రాంను విజయవంతంగా నిర్వహించారు. ఈ అంతర్జాతీయ సదస్సు అండ్ లైవ్ వర్క్ షాప్‌లో యూరాలజీ వైద్యరంగంలో అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక సాంకేతిక పురోగతిని ప్రదర్శిస్తూ అగ్రశ్రేణి జాతీయ యూరాలజిస్టులను ఒకచోట చేర్చింది. ఇందులో లైవ్ ఆపరేటివ్ సెషన్‌లు, ప్యానెల్ డిస్కషన్‌లు, వర్చువల్ ట్రెనింగ్ మాడ్యూల్స్, ఆధునిక యూరాలజికల్ ఇన్‌స్ట్రుమెంట్‌ల హ్యాండ్-ఆన్ ప్రదర్శనలతో విజయవంతం చేయబడింది. ఈ సందర్భంగా యశోద హాస్పిటల్స్, సీనియర్ యూరాలజిస్ట్ అండ్ కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్ సర్జన్, డాక్టర్. గుత్తా శ్రీనివాస్, LAP-URO 24 గురించి మాట్లాడుతూ.. ఈ సదస్సులో పీడియాట్రిక్ యూరాలజీ, యూరో-ఆంకాలజీ, రీకన్‌స్ట్రక్టివ్ యూరాలజీ మరియు రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో ఆవిష్కరణలపై దృష్టి సారించడం జరిగింది. ప్రొఫెసర్ డాక్టర్. అనంత్ కుమార్, డాక్టర్. అరవింద్ గన్‌పూలే, డాక్టర్. జమాల్ రిజ్వీ మరియు డాక్టర్. శ్రీహర్ష వంటి నిపుణులతో సహా హాజరైన వారు, రాడికల్ ప్రోస్టేటెక్టమీ నుండి మూత్రపిండ మార్పిడి వరకు, యూరాలజికల్‌లో కొత్త బెంచ్‌మార్క్‌లను సెట్ చేయడం వరకు కీలకమైన అంశాలపై లోతైన చర్చలు జరిగాయన్నారు.



ఈ సదస్సులో లాపరోస్కోపిక్ సింపుల్ నెఫ్రెక్టమీ, రెట్రో-పెరిటోనియోస్కోపిక్ నెఫ్రెక్టమీ, అడ్రినలెక్టమీ మరియు రోబోటిక్ ప్రోస్టేటెక్టమీ వంటి అనేక రకాల ప్రత్యక్ష శస్త్రచికిత్సలు ఉన్నాయి. శస్త్రచికిత్సా విధానాలను మార్చడంలో, వాటిని సురక్షితంగా మరియు మరింత ప్రభావవంతంగా చేయడంలో ఆధునిక సాంకేతికత పాత్రను చర్చలు మరింత నొక్కిచెప్పాయని డాక్టర్. గుత్తా శ్రీనివాస్ తెలిపారు.

ప్రొఫెసర్ డాక్టర్. అనంత్ కుమార్ ఈ కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ... లాపరోస్కోపిక్ మరియు రోబోటిక్ సర్జరీలు యూరాలజీలో విప్లవాత్మక మార్పులు చేస్తున్నాయని, రోగులకు మరింత ఖచ్చితత్వం, మెరుగైన ఫలితాలు మరియు మెరుగైన జీవన నాణ్యతను అందిస్తున్నయన్నారు. LAP-URO 24 వంటి సదస్సులు నైపుణ్యం యొక్క నిరంతర అభివృద్ధికి మరియు రోజువారీ ఆచరణలో తాజా సాంకేతికతను చేర్చడానికి ఇలాంటి సదస్సులు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు

ఓయూలో
జగన్, సుబ్బారెడ్డిల దిష్టిబొమ్మలు దహనం

- నిందితులను కఠినంగా శిక్షించాలి
- గుడిని గుడిలోని లింగాన్ని మింగే గొప్ప వ్యక్తి జగన్
- చంద్రబాబు నాయుడు నిర్ణయం హర్షణీయం
- సీబీఎన్ ఫ్యాన్స్ అసోసియేషన్

నవతెలంగాణ- ఓయూ

తిరుమల శ్రీవారి దేవస్థానంలో శ్రీవారి ప్రసాదం తయారీలో నెయ్యికి బదులుగా పలు జంతువుల మాంసంతో ఇతర చెట్ల బెరడుతో ప్రసాదాన్ని తయారు చేసిన నాటి టీటీడీ చైర్మెన్, మాజీ సీఎం, ఇతర అధికారులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని అఖిల భారత సీబీఎన్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఓయూ పీహెచ్డీ విద్యార్థి తలారి. శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఎదుట చంద్రబాబు నాయుడు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏపీ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి, టీటీడీ మాజీ చైర్మెన్ సుబ్బారెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆగమ శాస్త్రములకి విరుద్ధంగా గత ప్రభుత్వము ఐదేళ్ల పాలనలో ఇలాంటి అక్రమాలు చేసినందున, ఇలాంటి వాళ్ళని కఠినంగా శిక్షించాలని కోరారు. నాణ్యమైన నెయ్యితోనే ప్రసాదాలు తయారు చేయాలన్నారు.



సీబీఎన్ నిర్ణయం హర్షణీయం..

ఈ లడ్డు ఉదంతం వెలుగుచూసిన తరువాత ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు నిర్ణయం హర్షణీయం అన్నారు. ఇంత అపచారం జరిగిన తరువాత సంప్రోక్షణ చేయడానికి తీసుకున్న నిర్ణయం హిందువుల్లో సత్వాత్ర హర్షం వ్యక్తం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రబాబు నాయుడు ఫ్యాన్స్ గోపీ, సాయి, రాము, సుధాకర్ , రామారావు, రాజు పాల్గొన్నారు.

'రోబోటిక్'
శస్త్రచికిత్సలతో విప్లవాత్మక మార్పులు'

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

'రోబోటిక్' శస్త్రచికిత్సలు విప్లవాత్మక మార్పులకు నాందిగా చెప్పవచ్చని అపోలో హాస్పిటల్ సీనియర్ ఆర్థో, జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్, ఏఏఎస్ కోర్సు డైరెక్టర్ డాక్టర్ మితిన్ ఆచి తెలిపారు. ఇది ఖర్చులను గణనీయంగా తగ్గిస్తుందన్నారు. కచ్చితమైన వైద్య సేవలకు ఆస్కారం ఉంటుందన్నారు. అపోలో హాస్పిటల్స్, అపోలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్‌తో కలిసి తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ (టీఓఎస్ఏ), ట్విన్ సిటీస్ ఆర్థోపెడిక్ సొసైటీ (టీసీఓఎస్) ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లోని అపోలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్‌లో 8వ ఆర్థోప్లాస్టీ ఆర్థోస్కోపీ సమ్మిట్ 2024 (ఏఏఎస్) నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో డాక్టర్ మీ తిన్ ఆచి మాట్లాడుతూ రోబోటిక్ శస్త్రచికిత్స దీర్ఘకాలిక సమర్థత ఇంకా పరిశోధనలో ఉందన్నారు. హిప్ రీప్లేస్మెంట్ సమయంలో కచ్చితమైన కప్ పొజిషనింగ్లో, తీవ్రమైన మోకాలి వైకల్యాలు నిర్వహించడంలో దీని ప్రయోజనాలు కాదనలేనివన్నారు. ఈ పురోగతి అధునాతన చికిత్సా ఎంపికలను మరింత సరసమైనదిగా చేస్తాయన్నారు. పెద్ద సంఖ్యలో రోగులకు అందుబాటులోకి తెస్తుందన్నారు. ఇది కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలో సమూల మార్పులకు కారణమవుతుందని తెలిపారు. కీళ్ల సంరక్షణలో అత్యాధునిక పురోగతిని ఈ సమ్మిట్ గుర్తించిందన్నారు. కీళ్లనొప్పులు రాకుండా నిరోధించే లక్ష్యంతో మోకాలిలోని మృదులాస్థి గాయాలకు సంబంధించిన కీళ్ల మార్పిడిలో రోబోటిక్స్ పాత్రపై అంతర్దృష్టులు ఉన్నాయన్నారు. ఈ చర్చలు జాయింట్ ప్రిజర్వేషన్లో అత్యంత అధునాతన పద్ధతులను, భుజం శస్త్రచికిత్సలో కనిష్టంగా ఇన్వాసివ్ కీహోల్ విధానాలను కవర్ చేశాయన్నారు. అనంతరం అపోలో హాస్పిటల్ సీనియర్ ఆర్థో, జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్, ఏఏఎస్ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ ఎన్ సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సమగ్ర బోధనా వ్యాయామం యువ ఆర్థోపెడిక్ సర్జన్లకు విజ్ఞానం, నైపుణ్యాలు రెండింటిపై మార్గనిర్దేశం చేయడానికి రూపొందించబడిందని తెలిపారు. సరైన శస్త్రచికిత్స సూచనలు గుర్తించడంలోనూ నైపుణ్యం సాధించడంలోనూ, విద్యార్థులకు శస్త్రచికిత్స కచ్చితత్వం, నైపుణ్యాన్ని పెంపొందించడంలో సహాయపడిందని తెలిపారు. ఈ సంవత్సరం సమ్మిట్ మోకాలి లేదా తుంటి మార్పిడి శస్త్రచికిత్సలు అవసరం లేకుండా కీళ్ల సమస్యలకు చికిత్స చేయడానికి వినూత్న విధానాలపై దృష్టి సారించిందన్నారు.



'ఉపాధ్యాయులను
సన్మానించుకోవడం అందరీ బాధ్యత'

నవతెలంగాణ - బంజారాహిల్స్

సమ సమాజ నిర్మాణంలో కీలకపాత్ర పోషించే ఉపాధ్యాయులను సన్మానించుకోవడం మన అందరీ బాధ్యత అని యాదవ్ సేవా సంఘం అధ్యక్షులు అల్లాడి శ్రీనివాస్ యాదవ్ తో కలిసి మెమొంటోలను అందజేశారు. కార్యక్రమానికి స్వాగతం పలుకుతూ ముందుగా సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాబోయే కాలంలో



శరత్ తెలిపారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 33 జిల్లాల ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కరించి.. సేవా సంఘం తరపున సర్టిఫికెట్లతో పాటు అతిథిగా హాజరైన ఆల్ ఇండియా యాదవ సంఘం జాతీయ అధ్యక్షులు గడ్డం యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో వివిధ రంగాలలో నిష్ణాతులైన వారికి అవార్డులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేగల శ్రీనివాస్, అరుణ్, టి మహేష్, జితేంద్ర, రవిచంద్ర యాదవ్ పాల్గొన్నారు.

సమాజ్‌వాదీ పార్టీతోనే సమన్యాయం

కళ్యాణ్ యాదవ్

నవతెలంగాణ - బంజారాహిల్స్

తెలంగాణలో సమాజ్‌వాదీ పార్టీకి మంచి అవకాశాలు, తెలంగాణ రాష్ట్రంలో సమాజ్‌వాది పార్టీకి రాజకీయంగా మంచి అవకాశాలున్నాయని సోషల్ యాక్టివిస్ట్, ఎనలిస్ట్ దండుబోయిన నిత్య కళ్యాణ్ యాదవ్ అన్నారు. జూబ్లీహిల్స్‌కు చెందిన ఆయన ఆదివారం లక్నోలో యూపీ మాజీ ముఖ్యమంత్రి, సమాజవాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కళ్యాణ్ యాదవ్ మాట్లాడుతూ యూపీలో మొన్నటి పార్లమెంటు ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుచుకున్నట్లే.. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా భారీ ఎత్తున స్థానాలు గెలుచుకొని అధికారాన్ని కైవసం చేసుకుంటుందని అన్నారు. హైదరాబాద్ నగరంలో పెద్ద ఎత్తున యాదవ్ కమ్యూనిటీ నేతలు ఉన్నారని, వారికి ఇతర పార్టీల్లో మంచి అవకాశాలు రావడం లేదని సమాజ్‌వాదీ పార్టీ ద్వారా వారికి అవకాశాలు కల్పిస్తే మంచి ఫలితాలు వస్తాయని వివరించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల నాటికి నగరంలో, అసెంబ్లీ ఎన్నికల నాటికి తెలంగాణ వ్యాప్తంగా పార్టీని బలోపేతం చేయవచ్చునని వివరించారు. చాలా మంది యువత సమాజ్ వాది పార్టీలో చేరేందుకు ఆసక్తిగా ఉన్నారని తెలిపారు. తెలంగాణ మాదిగ దండోరా ఫౌండర్ ప్రెసిడెంట్ నర్సింగ్ రావ్ కూడా పార్టీలో చేరారు.



మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

- సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్

నవతెలంగాణ- ఓయూ

మహిళలు స్వయం ఉపాధిని కల్పించుకోవడం ద్వారా వారు ఆర్థికంగా ఎదగడంతో పాటు ఇతరులకు ఉపాధిని కల్గించాలని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సితాఫలమండీలోని మేడిబావి ప్రాంతంలో స్థానిక మహిళా నాయకురాలు పీ.ప్రవలిక నెలకొల్పిన లాస్య శ్రీ కలెక్షన్స్ శారీ సెంటర్‌ను పద్మారావు గౌడ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.



బీజేపీ సభ్యత్వ నమోదులో ఎంపీ డీకే అరుణ



నవతెలంగాణ- ఓయూ

సికింద్రాబాద్ నియోజకవర్గం సీతాఫల్మండి డివిజన్‌లోని మధుర నగర్ కాలనీలో మేకల కీర్తి హర్ష కిరణ్ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ అరుణ ముఖ్య అతిథిగా భారతీయ జనతా పార్టీ మెంబర్షిప్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గడపగడపకూ తిరిగి సభ్యత్వ నమోదు చేశారు. తర్వాత డీకే అరుణ మాట్లాడుతూ మైనారిటీలు, మహిళలు, యువత, డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు, పారిశ్రామివేత్తలు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు, స్వచ్ఛంద సంస్థలు ఆసక్తి చూపుతున్నారన్నారు. ఇక్కడ సభ్యత్వ నమోదు కార్యక్రమం చాలా జోరుగా జరుగుతుందని ఇదే స్ఫూర్తితో ముందుకి కొనసాగించాలని నిర్వాహకురాలు మేకల కీర్తి హర్ష కిరణ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కంటెస్టెంట్ ఎమ్మెల్యే మేకల సారంగపాణి, సభ్యత్వ నమోదు సహ ఇంచార్జ్ వందే వరుణ్, మాజీ కార్పొరేటర్ మేకల సుజాత, జిల్లా సభ్యత కన్వీనర్ కనకట్ల హరి, సీతాఫల్మండి డివిజన్ అధ్యక్షుడు అంబాల రాజేశ్వరరావు, ఓబీసీ రాష్ట్ర కోశాధికారి ఆకారం రమేష్, బౌద్ధ నగర్ డివిజన్ అధ్యక్షుడు హనుమంతు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అనిత తదితరులు పాల్గొన్నారు.

చలో లేబర్ ఆఫీస్
ధర్నాను జయప్రదం చేయండి

జూబ్లీహిల్స్ జోన్ సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

సెప్టెంబర్ 23న హైదరాబాదులోని లేబర్ ఆఫీస్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని జూబ్లీహిల్స్ జోన్ సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం మోతి నగర్ లేబర్ అడ్డా వద్ద కరపత్రం రిలీజ్ చేసి పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా సీఐటీయూ నగర ఉపాధ్యక్షులు రాపర్తి అశోక్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వవద్దు అని, ప్రభుత్వమే అధికారుల ద్వారా కార్మికులకు సక్రమంగా అమలు చేయాలని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికుల సంక్షేమ నిధులను ఇతర కార్యక్రమాలకు మళ్ళించవద్దని అన్నారు. సెప్టెంబర్ 23న కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో లేబర్ ఆఫీస్ అంజయ్య భవనం ఆర్టీసీ క్రాస్ రోడ్డు వద్ద ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మోతీ నగర్ యూనియన్ అధ్యక్షులు కే శ్రీనివాస్, పి సోమేష్, శ్రీను ,అబ్బాస్, మహమూద్, తదితరులు పాల్గొన్నారు.



మృతి చెందిన కానిస్టేబుల్‌కు సంతాప సభ

- కానిస్టేబుల్ కుటుంబానికి రెండు నెలల జీతం చెక్కును అందించిన బాబా ఫసియుద్దీన్

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

బోరబండ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించిన ఎం.సాయి కుమార్ ఈ నెల 20న హార్ట్ ఎటాక్‌తో మృతి చెందారు. ఈ మేరకు ఆదివారం బొర బండ కార్పొరేటర్ మరియు మాజీ డిప్యూటీ మేయర్ మొహమ్మద్ బాబా ఫసియుద్దీన్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఆ ర్‌పురం సైట్ - 2లోని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కమ్యూనిటీ హాల్లో బోరబండ పోలీస్ అధికారులతో కలిసి సంతాప సభ ఏర్పాటు చేశారు. తరువాత 2 నిముషాలు మౌనం పాటించారు. అనంతరం కానిస్టేబుల్ కుటుం బానికి రెండు నెలల జీతం చెక్కును బాబా ఫసియుద్దీన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వీర శేఖర్, ఎస్ఐ తులసి రాంనాయక్, బోరబండ పీఎస్ కానిస్టేబుల్స్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఈ సింపుల్ టిప్స్ ఫాలో అయిపోండి!

హెల్తీగా, ఫిట్‌గా ఉండాలని అందరూ అనుకుంటారు. దానికోసం తెగ కష్టపడిపోవాలేమో అనుకుంటారు. కానీ రెగ్యూలర్‌గా మనం కొన్ని ఫాలో అవ్వడం వల్ల హెల్తీగా ఉండడమే కాకుండా.. బరువును కూడా అదుపులో ఉంచుకోవచ్చు అంటున్నారు నిపుణులు. ఆ సింపుల్ టిప్స్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

రెగ్యూలర్ వ్యాయామం..

వ్యాయామం చేయడానికి సమయం లేదా అయితే చిన్న తేలికపాటి వ్యాయామాలు చేయవచ్చు. వీటివల్ల కేవలం బరువు తగ్గడమే కాదు ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చు. వ్యాయామం మానసిక పరిస్థితిని మెరుగుపరుస్తుంది. యాక్టివ్‌గా ఉండడంలో మనకు హెల్ప్ చేస్తుంది. ఎముకలను, కండరాలను ధృడంగా చేస్తుంది.

హైడ్రేటెడ్‌గా ఉండండి..

సమ్మర్ అయినా కాకున్నా.. నిరంతరం హైడ్రైటేడ్‌గా ఉంటే మంచిది. ఇది కేవలం దాహం తీర్చడమే కాదు.. శరీరం, మెదడును కూడా ఉత్తేజపరుస్తుంది. మీరు నిత్యం ఉత్సాహంగా ఉండేలా చేస్తుంది. జీర్ణశక్తిని మెరుగుపరచడం, కీళ్లనొప్పులు దూరం చేయడం, శరీరాన్ని డిటాక్స్ చేయడం వంటి ఫలితాలు ఇస్తుంది.

బయటకు వెళ్లండి

వర్క్ ఫ్రమ్ హెూమ్ చేసేవారిలో చాలామంది రూమ్‌లకే పరిమితమైపోతున్నారు. అలాంటివారు కూరగాయల కోసమో.. పెట్స్ కోసమో.. లేదంటే ఈవెనింగ్ వాక్ కోసమో బయటకు వెళ్తూ ఉండాలి. ఇది మిమ్మల్ని మానసికంగా ఉత్తేజ పరుస్తుంది. ఉదయానే విటమిన్ డి కోసం ఎండలో కూర్చొన్నా మంచిదే. విటమిన్ డి బరువు తగ్గడంలో హెల్ప్ చేస్తుంది.

పోషకాలతో నిండిన ఆహారం

హెల్తీగా ఉండడంలో మొదలుకుని.. బరువును అదుపులో ఉంచడంలో ఆహారం ముఖ్యపాత్ర పోషిస్తుంది. సమతుల్యమైన ఆహారం మీకు ఆరోగ్య ప్రయోజనాలు అందించడమే కాకుండా.. బరువును తగ్గించడంలో హెల్ప్ చేస్తుంది. పండ్లు, కూరగాయలు, బీన్స్, నట్స్, ప్రోటీన్స్ కలిగిన ఫుడ్స్ మీ డైట్‌లో చేర్చుకుంటే మంచిది. విటమిన్స్, మినరల్స్, పీచుతో కూడిన ఫుడ్స్ మంచి ఆరోగ్యాన్ని ప్రోత్సాహిస్తాయి.

ప్రాసెస్ చేసిన ఫుడ్ వద్దు

పోషకాలు కలిగిన ఫుడ్స్ తీసుకోవడం మంచిదే కానీ.. ప్రాసెస్ చేసిన వాటితో పోషకాలు పొందాలి అనుకోకూడదు. ప్రాసెస్ చేసిన ఫుడ్‌లో కేలరీలు ఎక్కువగా ఉంటాయి. వీటిలో ఉప్పు, చక్కెర మోతాదుకు మించి ఉంటాయి. తినేందుకు టేస్టీగానే ఉన్నా ఆరోగ్యాన్ని ఇబ్బంది పెడతాయి.

స్క్రీన్ సమయం

పనికోసం ల్యాప్ టాప్, రిఫ్రెష్‌మెంట్ కోసం ఫోన్. ఇలా చాలామందిలో స్క్రీన్ టైమ్ పెరిగిపోతుంది. ఇది కేవలం కంటికే కాదు మీ మొత్తం శరీరానికి చెడు చేస్తుంది. ఎక్కువసేపు కూర్చోవడం వల్ల గుండె జబ్బులు, బరువు పెరగడం వంటి సమస్యలు వస్తాయి. రోజంతా కూర్చొని చేయాల్సిన పని ఉంటే కాసేపు దానికి విరామం తీసుకోండి. ఇది మీరు హెల్తీగా ఉండడంలో హెల్ప్ చేస్తుంది.

నిద్రలేకుంటే ఏమి చేసినా వేస్టే

మంచి నిద్ర మంచి ఆరోగ్యాన్ని సూచిస్తుంది. ఇది మొత్తం ఆరోగ్యాన్ని, బరువును, మానసిక ప్రయోజనాలను అందిస్తుంది. నిద్రపోయేప్పుడు శరీరం అనేక ముఖ్యమైన పనులను పూర్తి చేస్తుంది. శారీరక విధులు చేయడం, కండర కణజాలాన్ని సరిచేయడం, మెదడును ప్రాసెస్ చేయడం, శక్తిని అందించడం వంటి పనులు చేస్తుంది. నిద్రలేకుంటే ఇవన్నీ శరీరానికి అందక.. హెల్త్ కరాబ్ అవుతుంది. దానివల్ల దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువ. గుండె జబ్బులు, మధుమేహం సమస్యలకు దారితీస్తుంది. అందుకే మంచి నిద్రకు ప్రాధాన్యం ఇవ్వండి.

మల్టీవిటమిన్స్ తీసుకోండి

కొన్ని విటమిన్స్ వివిధ ఫుడ్స్ ద్వారా తీసుకోలేకపోతుంటే.. వాటిని మెడిసన్ రూపంలో తీసుకోండి. మల్టీ విటమిన్స్ శరీరానికి అవసరమైన విటమిన్స్, పోషకాలను అందిస్తాయి. అయితే వీటిని వినియోగించే ముందు వైద్యుల సలహా కచ్చితంగా తీసుకోవాలి.

మరోసారి చరిత్ర సృష్టించింది



రికార్డులు బద్దలు కొట్టడం ఆమెకు కొత్త కాదు. తన చరిత్రను తానే లిఖించుకోవడంలో ఆమెకు ఆమే సాటి. ఐదేండ్ల కిందటనే కఠిన పరీక్షల్లో నెగ్గి భారత తొలి యుద్ధ విమాన పైలట్(ఫ్లైట్ లెఫ్టినెంట్)గా చరిత్ర సృష్టించారు. అత్యాధునిక యుద్ధ విమానాలను నడిపేందుకు అర్హత సాధించిన తొలి మహిళగా నిలిచారు. ఇప్పుడు తరంగ్ శక్తిలో భాగమై తన రికార్డును తానే బద్దలు కొట్టారు. భారత వాయుసేనలో వాయువేగంతో దూసుకుపోతున్నారు. ఆమే ఫ్లైట్ లెఫ్టినెంట్ మోహనా సింగ్.

రాజస్తాన్‌లోని ఝున్‌ఝును జిల్లాలో మోహనా సింగ్ జన్మించారు. అమృత్‌సర్‌లోని గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో గ్రాడ్యుయేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌లో బీటెక్ చేశారు. 2013లో 83.7 శాతం మార్కులతో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. మోహన తండ్రి ప్రతాప్ సింగ్ వాయుసేనలోనే వారంట్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. తాత లాడూ రామ్ ఏవియేషన్ రీసెర్చ్ సెంటర్‌లో ఫ్లైట్ గన్నర్. ఈయన 1948 భారత్-పాక్ యుద్ధంలో పాల్గొన్నారు. వీర్ చక్ర అవార్డు కూడా పొందారు. 2016లో ప్రభుత్వం మహిళలకు కూడా యుద్ధ విమానాలు నడిపే అవకాశం ఇచ్చింది. దాంతో ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో దాదాపు 20 మంది మహిళా ఫైటర్ పైలట్లు చేరారు. అందులో మోహన కూడా ఒకరు. ఈమె తండ్రి విధులు నిర్వర్తిస్తున్న చోటే ట్రెయినీ క్యాండెట్‌గా చేరి 2019లో శిక్షణ పూర్తి చేశారు.



కఠినమైన శిక్షణతో

జెట్ ఫైటర్‌గా రాణించాలంటే కఠినమైన శిక్షణ పూర్తి చేయాలి. సుమారు పన్నెండు సార్లు ద్వంద్వ తనఖీలు ఎదుర్కోవాల్సి వస్తుంది. మొదట విమానం ఎగరటంలో మెళకువలు, నిర్వహణ పద్ధతులు, టేకాఫ్, లాండింగ్ వంటి ప్రాథమిక అంశాలపై పూర్తి పట్టు సాధించాలి. యుద్ధ విమానం నడిపే సమయంలో ఏర్పడే చిక్కుల్ని ఎదుర్కొనే సమయస్ఫూర్తి, సామర్థ్యం, నేర్పు ఉండాలి. ప్రాథమిక శిక్షణ అనంతరం యుద్ధ సమయంలో పాటించాల్సిన వ్యూహాలతో పాటు, యుక్తులు ప్రదర్శించగలగాలి. అవసరాన్ని బట్టి ఆకాశం నుంచి ఆకాశంలోకి, ఆకాశం నుంచి భూమిపైకి విమాన మార్గాన్ని మళ్లించే చతురత ఉండాలి. ఈ శిక్షణలో నెగ్గితేనే యుద్ధ విమానాన్ని నడిపేందుకు అర్హత సాధిస్తారు. అలాంటి కఠినమైన శిక్షణలో మోహనతో పాటు భావనా కాంత్, అవనీ చతుర్వేది కూడా విజయం సాధించారు.

తొలి మహిళగా...

బెంగాల్‌లోని కలైకుండా వాయుసేన కేంద్రంలో శిక్షణ ముగిసిన కొన్ని రోజుల్లోనే మోహనా అరుదైన ఘనత సాధించారు. అత్యాధునిక యుద్ధ విమానాన్ని పగటిపూట నడిపిన తొలి మహిళగా చరిత్ర సృష్టించారు. శిక్షణలో రాకెట్ల ప్రయోగం, బాంబులు జారవిడవడం, లక్ష్యాలను గురిచూసి కాల్చడం వంటి ప్రక్రియల్ని ఆమె పూర్తి చేశారు. అప్పటికే మోహనకు 500 గంటలకు పైగా ఫ్లయింగ్ అనుభవం ఉంది. ఇందులో 380 గంటలు హాక్ ఎంకే-132 జెట్‌ను నడిపారు.



'తరంగ్ శక్తి'లో...

తాజాగా LCA తేజస్ ఫైటర్ ఫ్లీట్‌లో మోహనా సింగ్ మరోసారి మొదటి మహిళా ఫైటర్ పైలట్‌గా నిలిచారు. అంతేకాదు ఎలైట్ 18 'ఫ్లయింగ్ బుల్లెట్స్' స్క్వాడ్రన్‌లో చేరిన మొదటి మహిళా ఫైటర్ పైలట్‌గా చరిత్ర సృష్టించారు. 'మేడ్ ఇన్ ఇండియా' LCA తేజస్ ఫైటర్ జెట్ స్క్వాడ్రన్‌ను నిర్వహిస్తోంది. మోహనా సింగ్ ఇందులో చేరి లింగ సమానత్వం, సాధికారతకు నిదర్శనంగా నిలిచారు. మరింత మంది మహిళలు వాయుసేనలో చేరేందుకు మార్గం సుగమం చేశారు. త్రివిధ దళాలకు చెందిన ముగ్గురు వైస్ చీఫ్‌ల చారిత్రాత్మక విమానంలో భాగమయ్యారు. జోధ్‌పూర్‌లో ఇటీవల జరిగిన 'తరంగ్ శక్తి'లో అధికారికంగా పాల్గొన్నారు.

చారిత్రాత్మక ఫ్లైట్ LCA

మోహనా సింగ్‌తో పాటు శిక్షణ పొందిన ఇతర ఇద్దరు మహిళలు భావా కాంత్, అవనీ చతుర్వేది ప్రస్తుతం పశ్చిమ ఎడారిలో Su-30 MKI ఫైటర్ జెట్‌లను నడుపుతున్నారు. మొన్నటి వరకు మోహన MiG-21 కోసం పని చేశారు. ప్రస్తుతం చారిత్రాత్మక ఫ్లైట్ LCA తేజస్ ఫైటర్ జెట్‌లో ఆర్మీ నేవీ వైస్ చీఫ్‌లకు సూచనలతో పాటు వారికి అవసరమైన సహాయం అందిస్తున్నారు. మేక్ ఇన్ ఇండియాకు, రక్షణ దళాలు ఉమ్మడి పద్ధతిలో మద్దతు ఇవ్వడానికి ఇది ఎంతో ముఖ్యమైనదిగా పరిగణించబడుతోంది. యూఎస్, గ్రీస్, శ్రీలంక, ఆస్ట్రేలియాతో పాటు అనేక ఇతర దేశాలతో సహా ప్రపంచంలోని అగ్రశ్రేణి వైమానిక దళాలు తమ ఫైటర్ జెట్‌లతో జోధ్‌పూర్ ఎయిర్‌లో ఎక్సర్‌సైజ్‌కు హాజరయ్యారు. ఇందులో మన LCA తేజస్‌లో విమానం కూడా పాలుపంచుకుంది. ■

దేశంలో ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని కాపాడటంలో ఏచూరి ఒక స్ఫూర్తి

(మొదటిపేజీ తరువాయి)

అని చిన్న వయసులోనే కేంద్ర నాయకత్వంలో ప్రముఖ నాయకుడిగా ఎదిగారని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.ఏ.బేబి తెలిపారు. మార్క్సిజం, లెనినిజం యొక్క విశిష్టతను ఆయన తెలియజేశారని పేర్కొన్నారు. ప్రజాతంత్ర శక్తులను ఐక్యం చేయడానికి ఇండియా బ్లాక్ ఏర్పాటు చేయడంలో అన్ని పార్టీల వ్యక్తిగత అభిప్రాయాలను స్వీకరిస్తూనే ఏచూరి నిర్వహించిన పాత్రను మర్చిపోలేమని పేర్కొన్నారు. ఏచూరికి అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంతోనూ సంబంధాలు ఉన్నాయని తెలిపారు. ఎప్పుడు అంతర్జాతీయ సమావేశాలకు వెళ్లినా ఏచూరి గురించి అడిగేవారని తెలిపారు. నాలుగున్నర దశాబ్దాల పాటు విద్యార్థి ఉద్యమం నుంచి తాము కలిసి పనిచేశామని అన్నారు. ఆయన ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తూ పార్టీ అగ్రనేతలు ఇఎంఎస్ నంబూద్రిపాద్, సూర్జిత్, సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య నాయకత్వంలో అభివృద్ధి చెందారని పేర్కొన్నారు. పార్టీ యువతను ప్రమోట్ చేయడానికి సిద్ధమైన సమయంలో 1992 పద్నాలుగో మహాసభలో సోవియట్ యూనియన్, తూర్పు యూరప్ దేశాల్లో కమ్యూనిస్టులు దెబ్బతిన్న సమయంలో సోషలిజం అజేయం, శాశ్వతం అని దాని అమల్లో లోపాల వల్లే దెబ్బతిందనే తీర్మానాన్ని ఏచూరి ప్రవేశపెట్టారని తెలిపారు. దాన్ని మాకినేని బసవపున్నయ్య ప్రవేశపెట్టాల్సి ఉందని, సైద్ధాంతిక పరిపక్వతను దృష్టిలో పెట్టుకుని ఏచూరితో పెట్టించారని పేర్కొన్నారు.

పేదల కోసం అహర్నిశలూ పనిచేశారు
రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ మంత్రి, టీడీపీ నాయకులు కొలుసు పార్థసారథి

పేదల కోసం అహర్నిశలూ పోరాడిన వ్యక్తి మరణం బాధాకరమని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ మంత్రి, తెలుగుదేశం నాయకులు కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. తెలుగు వ్యక్తిగా ఉండటం గర్వకారణమని పేర్కొన్నారు. జెఎన్‌యులో కమ్యూనిజాన్ని బలోపేతం చేయడంతోపాటు ప్రజాస్వామ్య విలువల కోసం పనిచేశారని తెలిపారు. ఇందిరాగాంధీ అంటేనే భయపడుతున్న సమయంలో ఆమె పక్కన నిలబడి యూనివర్సిటీలో ఛాన్సలర్‌గా పదవికి రాజీనామా చేయాలని కోరిన ధీరుడని తెలిపారు. ఎక్కడున్నా తెలుగు ప్రజలకు, తెలుగు నేలకు ఆత్మబంధువుగా ఉన్నారని వివరించారు. ప్రత్యేకంగా తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి తనవంతు కృషి చేశారని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన అనివార్యమైన సమయంలోనూ పార్లమెంటులోనూ, అవకాశం వచ్చిన అన్నిచోట్ల ఆయన గళాన్ని బలంగా వినిపించారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ప్రజాస్వామ్యానికి ఆపద ముంచుకొచ్చినా ముందుండి పోరాడారని వివరించారు. ఎన్‌టీఆర్‌ను గద్దెదించిన సమయంలో శాసనసభ్యులందరూ ఢిల్లీకి వెళ్లిన సమయంలో ఏచూరి చేసిన కృషి మరిచిపోలేమని తెలిపారు. ఆయన జీవితం మొత్తం దోపిడీ వ్యవస్థలకు వ్యతిరేకంగా పోరాడారని వివరించారు. పెట్టుబడుల ఉపసంహరణకు, ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. స్టీలు ప్లాంటును కాపాడుకునేందుకు మూడేండ్లుగా కృషి చేస్తున్నారని వివరించారు. ఆయనకు అధికారం ముఖ్యం కాదని, ఈ తరం రాజకీయ నాయకులకు ఆయన జీవితం పాఠంగా ఉండాలని పేర్కొన్నారు. అమెరికాతో అణు ఒప్పందం చేసుకున్న సమయంలో దేశ సార్వభౌమత్వానికి ఈ ఒప్పందం ముప్పుగా పరిణమిస్తుందని బలంగా వ్యతిరేకించారని తెలిపారు. నేషనల్ ఫ్రంట్ ఏర్పాటులోనూ సీతారాం ఏచూరి ముఖ్య కారకులని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలోనూ, రాష్ట్రాల హక్కుల విషయంలో ఆయన ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను బలోపేతం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్న ఈ సమయంలో ఆయనను కోల్పోవడం తీరని లోటని పేర్కొన్నారు. ఆయన మరణం దోపిడీదారులకు భయంలేని పరిస్థితులను కల్పిస్తోందని వివరించారు.

భారత రాజకీయాల్లో తీరని లోటు
వైసీపీ నాయకులు, మాజీ మంత్రి అంబటి రాంబాబు

వైసీపీ నాయకులు అంబటి రాంబాబు మాట్లాడుతూ.. కమ్యూనిస్టు ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. ముఖ్యంగా పేద ప్రజల కోసం నిరంతరం పోరాడుతున్న శక్తిగా దేశవ్యాప్తంగానూ, ప్రపంచ వ్యాప్తంగానూ భావించే పార్టీలో నిబద్ధతగా విద్యార్థి దశ నుండి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని తెలిపారు. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలో కీలక పాత్ర వహించే స్థాయికి ఏచూరి ఎదిగారని తెలిపారు. నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాన్ని అంకితం చేశారని పేర్కొన్నారు. ఆయన మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి, భారత రాజకీయాలకు తీరని లోటని తెలిపారు. పార్లమెంటులో ఏచూరి ప్రవేశపెట్టిన సవరణలు, ఉపన్యాసాల తరువాత పార్లమెంటు ప్రభావితం అయిన అంశాలను గుర్తుచేసుకుంటే ఒక మంచి పార్లమెంటేరియన్‌గా ఆయన విశేషమైన సేవలు అందించారని అన్నారు.

ఏచూరి మరణం దేశానికి నష్టం
సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు

ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమంతోపాటు, దేశానికి కూడా నష్టమని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు పేర్కొన్నారు. విప్లవకారుడు, కమ్యూనిస్టు దేశంలో సిపిఎంను అభివృద్ధి చేసి నిర్మించే కర్తవ్యంలో ముఖ్యపాత్ర వహించారని తెలిపారు. దేశంలో బీజేపీకి మెజార్టీ తగ్గినా ఎజెండాలోని ముఖ్యమైన అంశాలను ఆ పార్టీ కొనసాగిస్తోందని తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను పరిరక్షించడం కోసం అన్ని రాజకీయపక్షాలను ఒకతాటిపైకి తేవడంలో ఆయన అత్యంత కీలకంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ పెట్టిన సమయంలో సీతారాంతోపాటు పలువురిని జైల్లో పెట్టారని అన్నారు. అనంతరం జెఎన్‌యు ఛాన్సలర్ పదవికి ఇందిరాగాంధీ రాజీనామా చేయాలని ఆమె ముందే నిలుచుని డిమాండ్ చేశారని పేర్కొన్నారు. హిట్లర్ చెప్పిన విధంగా ఒకే దేశం, ఒకే ఎన్నిక పేరుతో మోడీ ముందుకు వెళుతున్నారని పేర్కొన్నారు. మతాలు, భాషలు, కులాలు కలిగిన దేశంలో ఒకేసారి ఎన్నిక ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఇది ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తుందన్నారు. దీనివల్ల ఖర్చు కూడా తగ్గదన్నారు. ఈ దేశంలో ప్రజాస్వామ్యం ఉండకూడదనే విధంగా వ్యవహరిస్తున్నారని, రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి లేకుండా చేసే పని చేస్తున్నారని అన్నారు. గతంలో ఎన్‌టిఆర్‌ను దించేసిన సమయంలో ప్రజలు నిలబడి ఆయనను మరలా తెచ్చుకున్నారని, ఒకే దేశం ఒకే ఎన్నిక వస్తే ఆ అవకాశం వుండదన్నారు. ఈ విషయంలో అందరూ కలిసి పనిచేయాల్సిన సందర్భమని, అటువంటి వారిని కలిపి ఉమ్మడిగా ముందుకు తీసుకెళ్లడంలో సీతారాం దిట్టని పేర్కొన్నారు. ఈ దేశం సమైక్యంగా ఉండాలంటే లౌకికవాదం ఉండాలని బలంగా నమ్మారని వివరించారు. మతం ప్రాతిపదికన రాజ్యం నడవకూడదని అన్నారు. తిరుమల లడ్డూ తయారీ కలుషితం అయిందన్న విషయాన్ని అందరూ ఖండిస్తున్నారని, కారకులను శిక్షించొచ్చని, కానీ రాజకీయం చేయకూడదని తెలిపారు. దీంతోపాటు అన్ని పదార్థాల్లోనూ కల్తీ జరుగుతుండొచ్చని, వాటినీ నిలువరించాలని కోరారు. దేవుడి సొమ్మును దోచుకునే వారిని వదిలేస్తూ పవిత్రతను ప్రస్తావించడం సరికాదని అన్నారు.

రాడార్ స్టేషన్ నిర్మాణంపై ప్రభుత్వం పునరాలోచించాలి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వికారాబాద్ జిల్లా పూడూరు సమీపంలోని దామగుండం అటవీ ప్రాంతంలో రాడార్ స్టేషన్ నిర్మాణంపై ప్రభుత్వం పునరాలోచించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సుమారు మూడు వేల ఎకరాలను రాడార్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిందని తెలిపారు. రాడార్ నిర్మాణం చేయటం అవసరమైనప్పటికీ ఆ ప్రాంతంలో లక్షల సంఖ్యలో వృక్షాలతో పాటు వన్యప్రాణులకు నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. మూసీ నది ప్రారంభమైన ఈ జిల్లాలో నీటితో పాటు జీవ వైవిధ్యానికి, పర్యావరణానికి ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందన్నారు. పర్యావరణానికి నష్టం జరగకుండా ఇతర ప్రాంతాల్లో రాడార్ స్టేషన్‌ను నిర్మించాలనీ, ఆ దిశగా ప్రభుత్వం పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు.

పదేండ్లయినా పెరగని పరిహారం

(మొదటిపేజీ తరువాయి)

ఆమోదయోగ్యమైన నష్టపరిహారం చెల్లించాలి. ఆ తర్వాతే పనులు మొదలు పెట్టాలి. కానీ నిర్మాణ సంస్థలు, ఉన్నతాధికారలు కుమ్మక్కై ప్రస్తుత భూముల ధరలను, రైతుల అభీష్టాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా పరిహారాన్ని నిర్ణయించారు. టవర్లను కూడా ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యారు. దాంతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతోంది. తమకు న్యాయం జరిగే వరకూ నిర్మాణాలు చేపట్టొద్దని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇతర జిల్లాలతో పోలిస్తే రంగారెడ్డి జిల్లాలో గజం భూమి ధర వేలల్లో పలుకుతోంది. ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా ఈ భూముల ధరలు ఉన్నాయి. మార్కెట్ విలువను పరిగణనలోకి తీసుకోకుండా గత పదేండ్ల కింద నిర్ణయించిన పరిహారాన్ని చెల్లించడంపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి.

2014లో చెల్లింపులు ఇలా..

2013-14లో రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల మీదుగా 400 కేవీ ఎలక్ట్రికల్ ట్రాన్స్‌మిషన్ నిర్మించినప్పుడు రైతులు తమ సమస్యలను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దాంతో రైతులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు, తదితరులతో కలెక్టర్ చర్చలు జరిపారు. మార్కెట్ ధర ప్రకారం ఒక్క టవర్ నిర్మాణం వల్ల కోల్పోనున్న 350 గజాల భూమికి రోడ్డు ఫేసింగ్ భూములకు రూ.4.5లక్షలు, లోపలున్న భూములకు రూ.3.5లక్షలు, అదే విధంగా ట్రాన్స్‌మిషన్ లైన్ ద్వారా కోల్పోనున్న భూమికి రోడ్ ఫేసింగ్ భూములకు గజానికి వెయ్యి రూపాయలు, లోపలున్న భూములకు గజానికి రూ.700 నష్టపరిహారం చెల్లించారు. ఈ ధర ప్రకారమే ప్రస్తుతం కూడా చెల్లిస్తామని అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై రైతుల్లో వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. గతంలో లాగా కాకుండా ప్రస్తుత ధరల ప్రకారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

నాపై అవినీతిపరుడిగా ముద్రవేసే కుట్ర

- దీని వెనుక మోడీ హస్తం : అరవింద్ కేజ్రీవాల్



న్యూఢిల్లీ: తనను అవినీతిపరుడిగా నిరూపించేందుకు ప్రధాని మోడీ కుట్ర పన్నారని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. తనపై గెలవాలంటే తన నిజాయితీపై దాడి చేయాలని మోడీ భావించారంటూ మండిపడ్డారు. ఆదివారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన 'జనతా కీ అదాలత్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'ప్రధాని మోడీ మాపై కుట్ర పన్నారు. నన్ను, (ఆప్ నేత) మనీశ్ సిసోడియాను అవినీతిపరులుగా నిరూపించేందుకు కుట్ర పన్నారు. మా ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నించారు' అని విమర్శించారు. పదేండ్లుగా నిజాయితీతో ఢిల్లీ ప్రభుత్వాన్ని నడిపానని కేజ్రీవాల్ తెలిపారు. 'సీఎం కుర్చీపై వ్యామోహం లేకపోవడం వల్లే రాజీనామా చేశా. డబ్బు సంపాదించడానికి కాదు, దేశ రాజకీయాలను మార్చేందుకే వచ్చా' అని అన్నారు. సీఎం పదవికి రాజీనామా చేసిన తాను మరికొద్ది రోజుల్లో సీఎం అధికార నివాసం నుంచి వెళ్లిపోతానని తెలిపారు. పదేండ్లపాటు సీఎంగా ఉండి కూడా ఢిల్లీలో తనకు సొంత ఇల్లు లేదన్నారు.మరోవైపు తనను అవినీతిపరుడని బీజేపీ అనడంతో బాధపడ్డానని కేజ్రీవాల్ ఆవేదన వ్యక్తం చేశారు. 'కేజ్రీవాల్ నిజాయితీ లేనివాడైతే ప్రజలకు ఉచిత విద్యుత్తు, మహిళలకు ఉచిత బస్సు ఇచ్చేవాడా? పిల్లల కోసం స్కూళ్లు కట్టించేవాడా? ఆస్పత్రుల్లో వైద్యం ఉచితంగా అందించేవాడా?' అని ప్రశ్నించారు. 22 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉందని, వారు ఏ రాష్ట్రంలోనైనా ఉచిత విద్యుత్తు లేదా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించారా? అని నిలదీశారు. 'నేను దొంగనా? నన్ను జైలుకు పంపిన వ్యక్తులు దొంగలా?' అని ప్రశ్నించారు.

బోనస్ కాదు... బోగస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సింగరేణి కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం దగా చేసిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ బోనస్ విషయంలో అంకెల గారడీ చేసి కార్మికులను మోసం చేశారని విమర్శించారు. డిప్యూటీ సీఎం భట్టి, సీఎం రేవంత్ చెప్పిన మాటలకు పొంతన లేకుండా ఉందని అన్నారు. "1999 నుంచి 2004 వరకు టీడీపీ, 2004 నుంచి 2014 వరకు పదేండ్ల పాటు కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలో ఉంది. పదేండ్ల కాంగ్రెస్ పాలనలో సింగరేణి కార్మికులకు 11 నుంచి 20 శాతం వరకు బోనస్‌ను పెంచి మొత్తం రూ.370 కోట్లు ఇచ్చింది. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది 2014లో సింగరేణి రూ.1,060 కోట్ల లాభాలను ఆర్జించింది. అందులో 21 శాతం బోనస్‌గా ప్రకటించగా వచ్చిన రూ.102 కోట్లను ఒక్కో కార్మికునికి రూ.17 వేలు ఇచ్చాం. 2018-19లో రికార్డు స్థాయిలో లాభాలు వచ్చాయి. ఆ ఏడాది ఒక్కో కార్మికుడికి రూ.లక్ష చెల్లించాం. 2023లో రూ.2,222 కోట్ల లాభాల్లో రూ.1.60 లక్షలు బోనస్‌గా అందజేశాం. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేండ్లలో 60,369 మంది సింగరేణి కార్మికులకు రూ.2,780 కోట్ల లాభాలను బోనస్ ఇచ్చాం. కాని దానికి భిన్నంగా కాంగ్రెస్ సర్కార్ కార్మికులను మోసం చేసింది. డిప్యూటీ సీఎం చెప్పిన లెక్కల ప్రకారం ఈ ఏడాది సింగరేణి రూ.4,701 కోట్ల లాభాలను గడించింది. అందులో 33 శాతం వాటా (రూ.1,551కోట్లు) కార్మికులకు ఇచ్చామన్నారు. కార్మికులకు 33 శాతం వాటా ఇస్తే ఒక్కొక్కరికి రూ.3.70లక్షల లాభం రావాలి. కానీ ప్రభుత్వం రూ.1.90లక్షలు మాత్రమే బోనస్‌గా ప్రకటించింది. ఈ లెక్క ప్రకారం చూస్తే కేవలం 16.2శాతం లాభాల్లో వాటాగా ఇచ్చి, 33 శాతం అని మభ్యపెడుతున్నారు. ఇది ముమ్మాటికీ కార్మికులను దగా చేయడమే అవుతుంది. దీనిపై సీఎం నేరుగా సమాధానం చెప్పాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం సింగరేణిని ప్రయివేటీకరణ చేయాలని చూస్తోందనీ, కాంగ్రెస్ దానికి సహకరిస్తోందని ఆరోపించారు. సింగరేణి లాభాల వాటాపై కార్మికులు స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు.. సింగరేణి అధికార గుర్తింపు సంఘం ఏఐటీయూసీతో పాటు, సీపీఐ, బీజేపీ నేతలు ఈ అంశంలో స్పందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

టెండర్లపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

అమృత్ టెండర్లపై సిట్టింగ్ జడ్జి, లేదా సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌తో విచారణ జరిపించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ ఘాటుగా స్పందించారు. కేవలం రూ. రెండు కోట్ల లాభం ఉన్న కంపెనీకి రూ.1,000 కోట్ల కాంట్రాక్టు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా జరిగిన తప్పును ఒప్పుకొని జరిగిన టెండర్లను సీఎం వెంటనే రద్దు చేయాలని డిమండ్ చేశారు. అమృత్ నిధుల విషయంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ నుంచి మొదలుకొని ఒక్క ఎంపీ కూడా ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. ఫార్మాసిటీ రద్దు చేస్తున్నామనీ, సీఎంతో పాటు మంత్రి శ్రీధర్ బాబు మీడియాకు చెప్పి, న్యాయస్థానంలో మాత్రం అలాంటిదేమి లేదని తప్పుడు అఫిడవిట్ దాఖలు చేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం న్యాయస్థానాలను కూడా తప్పు దోవ పట్టిస్తున్నదని ఆరోపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకుని, అధికారికంగా మాత్రం చేర్చుకోలేదని చెబుతున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అవినీతి, అవకాశవాదాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారనీ, తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

క్లాడ్ ఎనర్జీకోసం ప్రపంచబ్యాంకు నిధులు

- శ్వేతసౌధం వెల్లడి

న్యూఢిల్లీ : స్వచ్ఛమైన ఇంధన సరఫరా చైన్‌ల నిర్మాణానికి కావాల్సిన నిధుల కోసం భారత్-యూఎస్‌లు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇందుకు ఇంటర్నేషనల్ బ్యాంక్ ఫర్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ డెవలప్‌మెంట్ (ప్రపంచబ్యాంకు) నుంచి ఒక బిలియన్ యూఎస్ డాలర్లు (దాదాపు రూ.8348 కోట్లకు పైగా) పొందటానికి ఈ రెండు దేశాలు పని చేస్తున్నాయి. దీనితో స్వచ్ఛమైన ఇంధన భాగాల తయారీ, సురక్షిత ప్రపంచ స్వచ్ఛ ఇంధన సప్లయ్ చైన్ నిర్మాణాన్ని విస్తరించే విషయంలో రెండు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని నెలకొల్పేందుకు ఈ ప్రయత్నాలు జరుగుతున్నాయి. క్వాడ్ సమ్మిట్ సందర్భంగా భారత ప్రధాని మోడీ, అమెరికా అధ్యక్షుడు జో బిడెన్ లు ద్వైపాక్షిక చర్చలు జరిపిన తర్వాత శ్వేతసౌధం ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ ఫండింగ్ భారత ఉత్పాదక సామర్థ్యాన్ని విస్తరించటానికి, సౌర, పవన, బ్యాటరీ, ఎనర్జీ గ్రిడ్ సిస్టమ్స్, అధిక సామర్థ్య ఎయిర్ కండీషనర్‌లకు కీలక సాంకేతిక కాంపోనెంట్‌లను సమకూర్చటంలో సమ్మతికి, సీలింగ్ ఫ్యాన్ సప్లయ్ చైన్‌లకు ఆర్థిక సాయం చేయగలదని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇరు దేశాల నాయకుల మధ్య ఈ చర్చలు విల్మింగ్‌టన్‌లోని యూఎస్ అధ్యక్షుడు బిడెన్ ఇంటి వద్ద జరిగాయి.



అశ్విన్ మాయలో..

చెపాక్‌లో అశ్విన్ మాయజాలం. తొలుత బ్యాట్‌తో శతక మ్యాజిక్‌తో బంగ్లాదేశ్‌ను దంచికొట్టిన చెన్నై చిన్నోడు.. ఆఖర్లో బంతితో బంగ్లాదేశ్‌ను గిర్రున తిప్పేశాడు. అశ్విన్ ఆరు వికెట్ల మాయజాలానికి రవీంద్రజాలం తోడవటంతో 515 పరుగుల రికార్డు ఛేదనలో బంగ్లాదేశ్ చేతులెత్తేసింది. 234 పరుగులకే ఆలౌటై తొలి టెస్టులో పరాజయం పాలైంది.



తొలి టెస్టులో టీమ్ ఇండియా దుమ్మురేపింది. బ్యాట్‌తో, బంతితో తిరుగులేని ప్రదర్శన చేసింది. తొలి రోజు ఉదయం సెషన్లో కాస్త తడబాటుకు గురైనా.. ఆ తర్వాత రోహిత్‌సేనకు ఎక్కడా బ్రేక్ పడలేదు. సీమర్లు, స్పిన్నర్లు వికెట్ల వేటలో పోటీపడటంతో బంగ్లాదేశ్ తేలిపోయింది. 280 పరుగుల తేడాతో తొలి టెస్టులో ఘన విజయం సాధించిన భారత్ టెస్టు సిరీస్‌లో 1-0తో ఆధిక్యం సాధించింది. భారత్, బంగ్లాదేశ్ రెండో టెస్టు శుక్రవారం నుంచి కాన్పూర్‌లో జరుగనుంది.

- 515 ఛేదనలో బంగ్లాదేశ్ చతికిల
- 280 పరుగుల తేడాతో ఆతిథ్య జట్టు గెలుపు

1-0తో టెస్టు సిరీస్‌లో భారత్ ఆధిక్యం

నవతెలంగాణ-చెన్నై

తొలి టెస్టులో టీమ్ ఇండియా అలవోక విజయం సాధించింది. ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ (113, 133 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) (6/88) బ్యాట్‌తో, బంతితో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో చెలరేగాడు. నాల్గో రోజు ఆటలో స్పిన్ మాయజాలం సృష్టించిన అశ్విన్.. బంగ్లాదేశ్ కథ ముగించాడు. రవీంద్ర జడేజా (3/58) సైతం మ్యాజిక్‌లో జత కలవటంతో 515 పరుగుల ఛేదనలో బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 234 పరుగులకు కుప్పకూలింది. భారత బౌలర్ల ధాటికి 62.1 ఓవర్లలోనే బంగ్లాదేశ్ చతికిల పడింది. 280 పరుగుల భారీ తేడాతో భారత్ తొలి టెస్టులో ఘన విజయం సాధించింది. బంగ్లాదేశ్ కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ శాంటో (82, 127 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఒక్కడే ఒంటరి పోరాటం చేశాడు. లోకల్ స్టార్ రవిచంద్రన్ అశ్విన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. రెండు మ్యాచుల టెస్టు సిరీస్‌లో భారత్ 1-0తో ఆధిక్యం సొంతం చేసుకుంది. భారత్, బంగ్లాదేశ్ రెండో టెస్టు సెప్టెంబర్ 27 నుంచి కాన్పూర్ గ్రీన్ పార్క్ స్టేడియంలో ఆరంభం కానుంది.

తొలి సెషన్లోనే..

ఓవర్‌నైట్ స్కోరు 158/4తో నాల్గో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన బంగ్లాదేశ్ ఉదయం సెషన్లోనే చేతులెత్తేసింది. 25 ఓవర్లలోనే బంగ్లా పులుల కథ ముగిసింది. నిజానికి తొలి గంట ఆటలో బంగ్లాదేశ్ గొప్పగా ప్రతిఘటించింది. కెప్టెన్ నజ్ముల్ శాంటో (82), షకిబ్ అల్ హసన్ (25) ఆచితూచి ఆడారు. బుమ్రా, సిరాజ్, ఆకాశ్ దీప్‌లు కట్టుదిట్టంగా బంతులేసినా.. వికెట్ లభించలేదు. ఉదయం సెషన్లో పేస్‌కు వికెట్ దక్కలేదు, దీంతో బంగ్లాదేశ్ శిబిరంలో ఆశలు రేకెత్తాయి. కానీ బంతి అశ్విన్ చేతికి అందిన తర్వాత సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. పేసర్లు వికెట్ల వేటలో చెమటోడ్చిన పిచ్‌పై అశ్విన్ ఆడుతూ పాడుతూ వికెట్ల జాతర సాగించాడు. బంగ్లా బ్యాటర్లు ఎదురుదాడి చేయాలనే ప్రణాళికలో వికెట్లు కోల్పోయారు. బంగ్లాదేశ్ ఆఖరు ఆరు వికెట్లను 40 పరుగుల వ్యవధిలోనే కోల్పోయింది. ప్రమాదకర షకిబ్ అల్ హసన్‌ను తన తొలి ఓవర్లోనే అవుట్ చేసిన అశ్విన్.. మెహిది హసన్ మిరాజ్ (8), టస్కిన్ అహ్మద్ (5)లను సాగనంపాడు. అర్థ సెంచరీతో విసిగించిన నజ్ముల్ సహా ఫామ్‌లో ఉన్న లిటన్ దాస్ (1), హసన్ మహ్మద్ (7)లను జడేజా పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో 62.1 ఓవర్లలోనే బంగ్లాదేశ్ 234 పరుగులకు కుప్పకూలింది. భారత్ 280 పరుగుల భారీ తేడాతో అలవోక విజయం నమోదు చేసింది. ఆఫ్ స్పిన్నర్ అశ్విన్ ఆరు వికెట్లు పడగొట్టగా.. రవీంద్ర జడేజా మూడు వికెట్లు తీసుకున్నాడు. ఓ టెస్టులో శతకం సహా ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన అత్యంత పెద్ద వయస్కుడిగా రవిచంద్రన్ అశ్విన్ రికార్డు నెలకొల్పాడు.



స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్ : 376/10

బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్ : 149/10

భారత్ రెండో ఇన్నింగ్స్ : 287/4 డిక్లేర్డ్

బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్ : జాకిర్ హసన్ (సి) జైస్వాల్ (బి) బుమ్రా 33, షాద్‌మాన్ ఇస్లామ్ (సి) గిల్ (బి) అశ్విన్ 35, నజ్ముల్ శాంటో (సి) బుమ్రా (బి) జడేజా 82, మోమినుల్ హాక్ (బి) అశ్విన్ 13, ముష్ఫికర్ రహీమ్ (సి) రాహుల్ (బి) అశ్విన్ 13, షకిబ్ అల్ హసన్ (సి) జైస్వాల్ (బి) అశ్విన్ 25, లిటన్ దాస్ (సి) రోహిత్ (బి) జడేజా 1, మెహిది హసన్ మిరాజ్ (సి) జడేజా (బి) అశ్విన్ 8, టస్కిన్ అహ్మద్ (సి) సిరాజ్ (బి) అశ్విన్ 5, హసన్ మహ్మద్ (బి) జడేజా 7, నహిద్ రానా నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు : 12, **మొత్తం :** (62.1 ఓవర్లలో ఆలౌట్) 234.

వికెట్ల పతనం : 1-62, 2-86, 3-124, 4-146, 5-194, 6-205, 7-222, 8-222, 9-228, 10-234.

బౌలింగ్ : జస్‌ప్రీత్ బుమ్రా 10-2-24-1, మహ్మద్ సిరాజ్ 10-5-32-0, ఆకాశ్ దీప్ 6-0-20-0, రవిచంద్రన్ అశ్విన్ 21-0-88-6, రవీంద్ర జడేజా 15.1-2-58-3.

తొలి టెస్టు పాస్!

స్వదేశీ టెస్టు సీజన్‌లో టీమ్ ఇండియా తొలి సవాల్‌ను విజయవంతంగా ఎదుర్కొంది. ప్రత్యర్థి బంగ్లాదేశ్.. పాకిస్థాన్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసి ఇక్కడికి వచ్చింది. ఉపఖండ పిచ్‌ల పరిస్థితులు బంగ్లాదేశ్‌కు కొత్త కాదు. దీనికి తోడు ఆ జట్టులో నాణ్యమైన స్పిన్నర్లకు కొదవ లేదు. ఇదే సమయంలో మన బ్యాటర్లు స్పిన్ ఆడేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమయంలో గౌతం గంభీర్ చీఫ్ కోచ్‌గా చెపాక్‌లో తొలి టెస్టు సవాల్‌లో పాస్ అయ్యాడు. 280 పరుగుల తేడాతో భారత్ భారీ విజయం సాధించినా.. ఇది అంత తేలిగ్గా దక్కిన గెలుపు కాదు. ఎర్రమట్టి పిచ్‌పై పదునైన పేస్ ముంగిట తొలి రోజు ఆరంభంలోనే భారత బ్యాటర్లు చేతులెత్తేశారు. రోహిత్, గిల్, విరాట్ అవుటవగా.. 34/3తో భారత్ కష్టాల్లో పడింది. 144/6తో 200 పరుగుల లోపే ఆలౌటయ్యే ప్రమాదంలో పడింది. అశ్విన్, జడేజా ఏడో వికెట్‌కు అద్భుత భాగస్వామ్యం నెలకొల్పి జట్టును నిలబెట్టారు. రెండో ఇన్నింగ్స్‌లోనూ రోహిత్, జైస్వాల్, విరాట్ త్వరగా అవుటయ్యారు. 67/3తో ఉండగా.. రిషబ్ పంత్, గిల్‌లు సెంచరీలతో చెలరేగారు. బ్యాటింగ్ పరంగా కీలక ఆటగాళ్లు నిరాశపరిచినా.. యువ బ్యాటర్లు కదం తొక్కారు. బంతితోనూ భారత్ ప్రదర్శన అమోఘం. పేస్‌కు అనుకూలత లభించిన వేళ బుమ్రా, సిరాజ్, ఆకాశ్ వికెట్ల వేట సాగించగా.. పిచ్ నుంచి టర్న్ రాగానే స్పిన్నర్లు అశ్విన్, జడేజా మాయజాలం మొదలెట్టారు. ఒకరికద్దరు ఆటగాళ్ల ప్రదర్శనపై ఆధారపడి విజయాలు సాధించలేమని గంభీర్ బలంగా విశ్వసిస్తాడు. అతడి శిక్షణ సారథ్యంలో తొలి టెస్టులోనే సమిష్టి ప్రదర్శనతో విజయం సాధించటం భారత క్రికెట్‌కు సానుకూల సంకేతం.

చెస్‌లో చారిత్రక స్వర్ణం

ఫిడె ఒలింపియాడ్ ఓపెన్ విభాగంలో భారత్‌కు పసిడి



బుడాపెస్ట్ : 2024 ఫిడె చెస్ ఒలింపియాడ్‌లో భారత్ చారిత్రక స్వర్ణం సాధించింది. ఓపెన్ విభాగంలో భారత్ అగ్రస్థానంలో నిలిచి బంగారు పతకం కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన 11వ రౌండ్ పోటీల్లో డి. గుకేశ్, ఆర్. ప్రజ్ఞానంద, అర్జున్ , విదిత్ గుజరాతీ, పెంటాల హరికృష్ణలు సత్తా చాటారు. స్లోవేనియాపై గుకేశ్, అర్జున్ విజయాలతో భారత్ 2-0తో ఆధిక్యం సాధించింది. హరికృష్ణ, విదిత్ గుజరాతీ మ్యాచ్ ఫలితాలతో సంబంధం లేకుండా మనోళ్లు పసిడి పతకం ఖాయం చేసుకున్నారు. రెండో స్థానంలో నిలిచిన చైనా సిల్వర్ మెడల్‌కు పరిమితమైంది. చెస్ ఒలింపియాడ్‌లో భారత్‌కు ఇదే తొలి పసిడి పతకం కావటం విశేషం. మహిళల విభాగంలో భారత్ పసిడి దిశగా దూసుకెళ్తోంది. హరిక ద్రోణవల్లి, ఆర్. వైశాలి, దివ్య దేశ్‌ముఖ్, వి అగర్వాల్, తానియ సచ్‌దేవ్‌లు ఆఖరు రౌండ్లో అజర్‌బైజాన్‌పై 1-0తో ముందంజలో కొనసాగుతున్నారు. చెస్ ఒలింపియాడ్‌లో ఓపెన్, మహిళల విభాగాల్లో పసిడి నెగ్గి చెస్ చరిత్రలోనే నవ శకానికి భారత్ నాంది పలకనుంది.

ప్రతి జిల్లాకు ప్రాతినిథ్యం ఉండాలి

రాష్ట్ర క్రికెట్ జట్టుపై టీడీసీఏ అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి



నవతెలంగాణ-హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో క్రికెట్ అభివద్ధి చెందాలంటే ప్రతి జిల్లాకు ఆధునాతన మౌళిక సదుపాయాలతో కూడిన అకాడమీలు అవసరమని, రాష్ట్ర జట్టు అంటే ప్రతి జిల్లా నుంచి క్రికెటర్లకు ప్రాతినిథ్యం ఉండాలని తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) అధ్యక్షుడు, శాట్ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. . ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన 'తెలంగాణ క్రికెట్ దశ-దిశ' రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శాట్ చైర్మన్ కే. శివసేనా రెడ్డి మాట్లాడుతూ.. 'తెలంగాణలో జిల్లాలో క్రికెట్ అభివద్ధి కుంటుపడింది. ప్రతిభావంతులైన గ్రామీణ క్రికెటర్లకు అవకాశాలు లభించటం లేదు. జిల్లాల్లో క్రికెట్ అభివద్ధికి తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) సంకల్పం తీసుకోవటం ఆహ్వానిస్తున్నాం. హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అవినీతిలో మునిగింది. గ్రామీణ క్రికెట్‌ను పూర్తిగా నిర్లక్షం చేస్తోంది. ఈ విషయంపై బీసీసీఐకి సైతం లేఖ రాసేందుకు వెనుకాడబోం. తెలంగాణ జిల్లాల్లో క్రికెట్ అభివద్ధికి మరిన్ని సంఘాలు ముందుకు రావాలని' శివసేనా రెడ్డి అన్నారు. అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ..' తెలంగాణలో గ్రామీణ క్రికెట్ దశాబ్దాలుగా కుంటుపడింది. రాష్ట్ర క్రికెట్ జట్టు అంటే ప్రతి జిల్లాకు ప్రాతినిథ్యం లభించేలా ఉండాలి. అందుకు టీడీసీఏ తరఫున రాజీలేని కషి చేస్తాం. అందరి మద్దతుతో బీసీసీఐ గుర్తింపు సైతం తీసుకొస్తామని' తెలిపారు. టీడీసీఏ జిల్లా సంఘాల ప్రతినిధులు, మాజీ క్రికెటర్లు సహా పెటాటిఎస్ అధ్యక్షుడు రాఘవరెడ్డి తదితరులు రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు.

మరో అరుదైన విశిష్ట గౌరవం

156 చిత్రాలు.. 537 పాటలు.. 24 వేల స్టెప్పులతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు



చిరంజీవి



అత్యద్భుతమైన డాన్స్ మూమెంట్స్‌కి పెట్టింది పేరు మెగాస్టార్ చిరంజీవి. పాటల్లో ఆయన వేసే స్టెప్పులకు ప్రేక్షకులు, అభిమానులే కాదు ఏకంగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ కూడా ఫిదా అయిపోయింది. 156 చిత్రాలు..537 పాటలు..24 వేల స్టెప్పులతో ప్రేక్షకులను అలరించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చిరంజీవి చోటు సొంతం చేసుకుని, మరో అరుదైన విశిష్ట గౌరవాన్ని దక్కించుకున్నారు. చిరంజీవికి గిన్నిస్ వరల్డ్ రికార్డు ప్రకటించే కార్యక్రమం హైదరాబాద్‌లో ఆత్మీయుల సమక్షంలో వైభవంగా జరిగింది. బాలీవుడ్ సూపర్‌స్టార్ ఆమీర్‌ఖాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్ తరఫున రిచర్డ్ స్టెన్నింగ్ పాల్గొని, మెగాస్టార్‌కి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్‌ను అందజేశారు. ఇదే వేడుకలో ఆమీర్‌ఖాన్‌కి కానుకగా స్పెషల్ బ్రాండెడ్ పెన్‌ని చిరంజీవి బహూకరించారు.

ప్రాణం పెట్టి డాన్స్ చేస్తారు : అమీర్ ఖాన్

నేను చిరంజీవికి పెద్ద అభిమానిని. చిరంజీవి గిన్నిస్ విషయం నాతో చెప్పినప్పుడు చాలా ఆనందంగా అనిపించింది. ఆయన డాన్స్ చేస్తున్నప్పుడు చూడ్డానికి మనకు రెండు కళ్లు సరిపోవు. ప్రతి పాటను ఆస్వాదిస్తూ.. ప్రాణం పెట్టి డాన్స్ చేస్తారు. ఈ ప్రయాణంలో ఆయన ఇంకా ఎంతో దూరం సాగాలి'.

ఎదురు చూడనిది దక్కింది : చిరంజీవి

ఒక్క ఫోన్ కాల్‌తో అమీర్‌ఖాన్ ఇక్కడకు వచ్చినందుకు ధన్యవాదాలు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ గురించి నేనెప్పుడూ ఊహించలేదు. గిన్నిస్ బుక్‌కి, మనకూ ఏంటి సంబంధం అని మామూలుగా అనుకుంటాం కదా.. కానీ, నాకు అలాంటి ఊహే లేదు. నా జీవితంలో నేను ఎదురుచూడనిది నాకు దక్కింది. భగవంతుడికీ, దర్శక, నిర్మాతలకు, కొరియోగ్రాఫర్లకు, ఫ్యాన్స్‌కి రుణపడి ఉంటాను. నటన కన్నా ముందు నుంచే డ్యాన్సుల మీద నాకు ఇంట్రస్ట్ ఉంది. అదే ఇవాళ నాకు ఈ అవార్డు వచ్చేలా చేసిందా అనిపించింది. నా చిన్నప్పుడు మా చుట్టుపక్కల ఉన్నవారిని ఎంటర్‌టైన్ సంగీతానికి అనుగుణంగా స్టెప్పులు వేయడం అలవాటు చేసుకున్నాను. ఆ అలవాటే ఈ స్థాయికి తీసుకొచ్చింది. నా డాన్స్‌లను చూడ్డానికి ప్రేక్షకులు, అభిమానులు మళ్ళీ మళ్ళీ థియేటర్లకు వచ్చేలా చేసిందంటూ ఇన్నేళ్ళ సినీ ప్రస్థానాన్ని చిరంజీవి గుర్తు చేసుకున్నారు.

అభినందనల వెల్లువ

మెగాస్టార్ గిన్నిస్ బుక్‌లో చోటు సొంతం చేసుకున్న నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు పలువురు సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలిపారు.

ఆస్ట్రేలియాలో రాబిన్‌హుడ్



నితిన్, శ్రీలీల

హీరో నితిన్ అప్ కమింగ్ యాక్షన్, హీస్ట్ కామెడీ ఎంటర్‌టైనర్ 'రాబిన్‌హుడ్'. ఈ సినిమా తాజా షెడ్యూల్ ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో ప్రారంభమైంది.
వెంకీ కుడుముల దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది.
లీడ్ పెయిర్‌తో డ్యూయెట్ సాంగ్ షూట్‌ని టీమ్ మొదలుపెట్టింది.
కృష్ణకాంత్ లిరిక్స్‌తో జివి ప్రకాష్ ఆకట్టుకునే పాటను కంపోజ్ చేశారు. నితిన్, శ్రీలీల డాజ్లింగ్ కెమిస్ట్రీ హైలెట్‌గా ఉండనుంది. మెల్‌బోర్న్‌లోని అద్భుతమైన ప్రదేశాలలో షూట్ చేస్తున్న ఈ పాటకు శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. సాంగ్‌తో పాటు బ్రహ్మాజీ, వెన్నెల కిషోర్‌తో సహా ప్రధాన నటీనటులతో ముఖ్యమైన టాకీపార్ట్‌ని చిత్రీకరించ నున్నారు. ఈ చిత్రంలో రాజేంద్ర ప్రసాద్ కీలక పాత్ర పోషిస్తున్నారు. అత్యున్నత స్థాయి నిర్మాణ, సాంకేతిక విలువలతో నిర్మాతలు నవీన్ యెర్నేని, వై రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 20న ఈ సినిమా వరల్డ్ వైడ్‌గా గ్రాండ్‌గా రిలీజ్ కానుంది.
భిన్న కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం కచ్చితంగా ప్రేక్షకుల్ని అలరిస్తుందనే నమ్మకంతో మేకర్స్ ఉన్నారు.
ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: వెంకీ కుడుముల, సిఇఓ : చెర్రీ, సంగీతం: జివి ప్రకాష్ కుమార్, డీఓపీ: సాయి శ్రీరామ్, ఎడిటర్: కోటి, ఆర్ట్ డైరెక్టర్: రామ్ కుమార్, ఫైట్స్: రామ్-లక్ష్మణ్, రవివర్మ, విక్రమ్ మోర్.

నవచిత్రం

ఊహించిన దాని కంటే..



రజనీకాంత్ టైటిల్ పాత్రలో నటించిన చిత్రం 'వేట్టైయాన్- ది హంటర్'. దసరా సందర్భంగా అక్టోబర్ 10న రిలీజ్ అవుతుంది. కె.ఇ.జ్ఞానవేల్ దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ ఈ సినిమాను నిర్మించారు. ఇటీవల ఈ చిత్ర ఆడియో వేడుక చెన్నైలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రజనీకాంత్ మాట్లాడుతూ, 'సాధారణంగా సినిమా హిట్ తర్వాత ఫ్లాప్ ఇస్తే హీరో, డైరెక్టర్, ప్రొడ్యూసర్‌లో ఓ టెన్షన్ ఉంటుంది. నెక్ట్స్ ఎలాగైనా హిట్ మూవీ ఇవ్వాలని అనుకుంటారు. హిట్ తర్వాత హిట్ మూవీ ఇవ్వాలనే టెన్షన్ అందరికీ ఉంటుంది. సాధారణంగా హిట్ కావాలంటే ఓ మ్యాజిక్ జరగాలి. అన్నీ అలా కుదరాలి. 'జైలర్' మూవీ హిట్ తర్వాత అంతటి హిట్ సినిమా ఇవ్వాలనే టెన్షన్‌తో ఉన్నాను' అని అన్నారు.

రజనీకాంత్‌తో చాలా సంవత్సరాలుగా మంచి పరిచయం ఉంది. వృత్తి పరంగానే కాదు, వ్యక్తిగతంగానూ తను నాకెంతో సన్నిహితంగా ఉంటారు. రజనీకాంత్ పాత్ర గురించి, నా పాత్ర గురించి తెలిసిన తర్వాత నేను జ్ఞానవేల్ నెరేషన్ నచ్చి సినిమా చేయటానికి ఒప్పుకున్నాను. రజనీతో యాక్ట్ చేయటానికి గొప్పగా, గర్వంగా భావిస్తున్నాను. తను మనందరికీ ఓ మంచి గిఫ్ట్. గ్రేట్ హ్యూమన్ బీయింగ్. చాలా సింపుల్‌గా కనిపిస్తారు. అక్టోబర్ 10న ఈ సినిమా రిలీజ్ అవుతుంది. సినిమా పెద్ద హిట్ కావాలని ఆశిస్తున్నాను.

- అమితాబ్ బచ్చన్

"జై భీమ్' మూవీ హిట్ అయిన తర్వాత నాకు అవకాశం వస్తుందని తెలుసు. కానీ ఇలాంటి గొప్ప అవకాశం వస్తుందని అనుకోలేదు. ఆయనకు సన్నివేశాలు రాసే సమయంలో ఆయన మాత్రమే చేయగలడు అనేలా మాస్ సన్నివేశాలు కుదిరాయి. కథ రాసుకునే సమయంలోనే అమితాబ్, ఫహాద్ ఫాజిల్, రానా.. ఇలా అందరినీ ఉహించుకునే రాసుకున్నాను. రజీనీకాంత్, లైకా ప్రొడక్షన్స్ సంస్థ ఉండటం వల్లనే వారందరినీ ఈ సినిమాలో యాక్ట్ చేసేలా ఒప్పించగలిగాను. సుభాస్కరన్ కథ వినగానే మీకెలా కావాలో సినిమాను అలా చేయండి అన్నారు. ఆయన చెప్పినట్లుగానే తమిళ్ కుమరన్ నాకు సపోర్ట్ అందించారు. అభిమానులు ఊహించుకున్న దాని కంటేఎక్కువగానే ఈ సినిమా ఉంటుంది. ప్రతి చిన్న మూమెంట్‌ను ఎంజాయ్ చేస్తారు' అని డైరెక్టర్ కె.ఇ.జ్ఞానవేల్ చెప్పారు.
'లైకాప్రొడక్షన్స్ జర్నీ 10 ఏళ్ల పూర్తి చేసుకుంది. ఈ ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసిన సుభాస్కరన్‌కి అభినందనలు. సూపర్‌స్టార్ రజనీతో మరోసారి కలిసి ట్రావెల్ చేయటం మరచిపోలేని అనుభూతి నిచ్చింది. ఈ సినిమా కచ్చితంగా బ్లాక్‌బస్టర్ అవుతుందనే నమ్మకం ఉంది' అని లైకా ప్రొడక్షన్స్ హెడ్ చెప్పారు.

ఆస్కార్ ఎంట్రీ కోసం..



97వ ఆస్కార్ అవార్డుల ఉత్తమ విదేశీ చిత్రం విభాగం కోసం మన దేశం నుంచి ఎంపిక చేసిన జాబితాలో ఉన్న తెలుగు చిత్రాలు కల్కి, మంగళవారం, హను-మాన్

'ఆర్‌ఆర్‌ఆర్' సినిమా ఆస్కార్ సాధించిన తర్వాత మరోమారు ఈ ప్రతిష్టాత్మక ఆస్కార్ వస్తుందనే ఆశలు తెలుగు చిత్ర పరిశ్రమలో చిగురించాయి. 97వ ఆస్కార్ అవార్డుల్లోని ఉత్తమ విదేశీ చిత్రం విభాగం కోసం మన దేశం నుంచి పంపే నామినేషన్ల జాబితాలో ఈసారి మూడు తెలుగు చిత్రాలు 'కల్కి', 'హనుమాన్', 'మంగళవారం' చోటు దక్కించుకోవడం విశేషం.
ఇప్పటికే కొన్ని దేశాలు తమ అధికారిక ఎంట్రీలను ప్రకటించగా మరికొన్ని దేశాలు ఉత్తమ చిత్రాలను సెలక్ట్ చేసుకునే ప్రక్రియలో బిజీగా ఉన్నాయి. అయితే మన దేశం నుంచి అధికారిక ఎంట్రీని పంపించేందుకు షార్ట్ లిస్ట్ రెడీ చేసి తెలుగు, తమిళ, మలయాళం, హిందీ, మరాఠీ భాషలకు చెందిన చిత్రాల స్క్రీనింగ్ చేశారు. తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి 'కల్కి', 'హను-మాన్', 'మంగళవారం' సినిమాలు ఉండటం విశేషం. అలాగే తమిళం నుంచి 'తంగలాన్', 'వాజై', 'కొట్టుకాళి', 'మహారాజ', 'జమా', 'జిగర్తాండ డబల్ ఎక్స్', మలయాళం నుంచి 'ఉళ్ళొళుక్కు', 'ఆడు జీవితం', 'ఆల్ వీ ఇమాజిన్ యాస్ లైట్', 'ఆట్టం', మరాఠీ నుంచి 'స్వరగంధర్వ సుధీర్ ఫడకే', 'ఘాట్', 'ఘరత్ గణపతి' హిందీ నుంచి 'కిల్', 'ఆర్టికల్ 370', 'షామ్ బహదూర్', 'గుడ్ లక్', 'జోరం', 'యానిమల్', 'శ్రీకాంత్', 'వీర్ సవార్కర్', 'చోటా భీమ్ అండ్ ది కర్స్ ఆఫ్ దమ్యం', 'లా పట్టా లేడీస్', 'చందు ఛాంపియన్' వంటి సినిమాలు లిస్టులో ఉన్నాయి.
మొత్తమ్మీద తెలుగు నుంచి 3, తమిళం నుంచి 6, మలయాళం నుంచి 4, మరాఠీ నుంచి 3, హిందీ నుంచి 11 సినిమాలు మన దేశం నుంచి పంపించే చిత్రాల జాబితాలో ఉన్నాయి. వీటిలోంచి ఓ చిత్రాన్ని ఎంపిక చేసి ఆస్కార్ నామినేషన్‌కు పంపించనున్నారు.
నేడు (సోమవారం) మధ్యాహ్నం 12 గంటల తర్వాత ఇండియా నుంచి అస్కార్‌కు నామినేట్ చేసిన చిత్రాన్ని ప్రకటించే అవకాశం ఉంది.
97వ అకాడమీ అవార్డుల వేడుక వచ్చే ఏడాది మార్చి 2న జరుగుతుందని అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ఇప్పటికే ప్రకటించింది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.